www.manatelangana.news

Mana Telangana

# మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 219 | సోమవారం | 29 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



3 పంచాయతీ చట్టంపై అసెంబ్లీ సమావేశం అనుమానమే!
• ఆర్డినెన్స్ యోచనలో ప్రభుత్వం?

# ఈ ఊరు ఏ జిల్లాలో?




## పాతదాంట్లోంచి తీసేశారు, కొత్తదాంట్లో చేర్చలేదు

## 'మహబూబ్‌నగర్ జిల్లా'లో దిక్కూమొక్కులేని ఓ గ్రామం కథ

సంక్షేమ, సహాయ పథకాల లబ్ధిని ఎక్కడ నుంచి పొందాలో తెలియక గ్రామస్థుల అయోమయం

సాగు పెట్టుబడి సొమ్ము ఏ జిల్లా ఖాతా నుంచి వస్తుందో అర్థంకాక తలపట్టుకున్న రైతులు

**మన తెలంగాణ** / హైదరాబాద్ : మన ఇంట్లో ఒకరు కనిపించకుండా పోతే ఊరంతా గాలిస్తాం. కానీ ఊరే కనబడకుండాపోతే ఏం చేస్తాం? ప్రభుత్వానికి విన్నవిస్తాం. ఇప్పుడు పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని సూరారం గ్రామ ప్రజలు కూడా ఇదే చేశారు. ఏడాదిన్నర క్రితం జిల్లాల పునర్ వ్యవస్థీకరణ కసరత్తు చేపట్టిన ప్రభుత్వం సూరారం గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు ఈ గ్రామాన్ని ఫారూక్‌నగర్ మండలంలో కలిపి రంగారెడ్డి జిల్లా పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. బాలానగర్

తరువాయి 6లో

# అవినీతిపై పోరు

• యువత సహకరించాలి, ముగ్గురు మాజీ సిఎంలు కటకటాలు లెక్కబెడుతున్నారు

• ఎన్‌సిసి ర్యాలీనుద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ :** అవినీతికి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి యువత సహకరించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. యువత తప్ప మరెవరూ తన అవినీతి వ్యతిరేక పోరాటాన్ని విస్తృతపర్చలేరని అన్నారు. అవినీతికి పాల్పడిన ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు జైళ్లలో మగ్గుతున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆదివారం ఇక్కడ నిర్వహించిన ఎన్‌సిసి ర్యాలీలో మోడీ ప్రసంగించారు. ఆధార్ దేశ ప్రగతికి దోహద పడుతుందని, ఇది ప్రభుత్వ పథకాల్లో అవినీతిని అరికడుతుందని, ప్రభుత్వం ఖర్చు చేస్తున్న ప్రతి రూపాయి నిరుపేద లబ్ధిదారులకు చేరుతుందని అన్నారు. ఆధార్ కారణంగా కొన్ని ప్రభుత్వ పథకాల్లో రూ.60 వేల కోట్ల ధనం ఆదా అయిందని చెప్పారు. అంతకు ముందు ఈ ధనం దుర్వినియోగం జరిగిందని అన్నారు. ధనికులు, అధికారంలో ఉన్న వారు అవినీతిరహితంగా ఎప్పుడూ ఉండబోరనే నమ్మకం ప్రజల్లో ఉందని, ఇప్పుడు అలా అవినీతికి పాల్పడిన ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు జైళ్లలో ఊచలు లెక్కపెడుతున్నారని తెలిపారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, జగన్నాథ్ మిశ్రాలను కోర్టులు ఇటీవల గడ్డి కుంభకోణంలో దోషులుగా తేల్చాయని, అలాగే మరో అవినీతి కేసులో హర్యానా ముఖ్యమంత్రి ఓపి చౌతాలాను కూడా దోషిగా తేల్చగా జైలు శిక్ష అనుభవిస్తున్నారని ఆయన వెల్లడించారు. 'భారతీయ యువకులు అవినీతిని వ్యతిరేకిస్తారు. అవినీతి, నల్లధనానికి వ్యతిరేకంగా ఈ పోరాటం ఆగదు. ఇది భావి భారత యువకుల పోరాటం' అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఈ పోరానికి ఎన్‌సిసి క్యాడెట్లతో పాటు యువత అంతా మద్దతుగా నిలువాలని ఆయన ఆకాంక్షించారు.



# పార్లమెంట్ బడ్జెట్ భేటీ

## నేటి నుంచే ప్రారంభం

ట్రిపుల్ తలాక్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం సాధిస్తాం

జిఎస్‌టి మాదిరిగానే ప్రతిపక్షాల సహకారం పొందుతాం :

కేంద్రమంత్రి అనంత్‌కుమార్, రాష్ట్రపతి కోవింద్‌కు ఇవే తొలి బడ్జెట్ సమావేశాలు



**మన తెలంగాణ**/ న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ మొదట విడత సమావేశాలు సోమవారం నుండి వచ్చే నెల 9వ తేదీ వరకు మొత్తం 8 రోజుల పాటు జరగనున్నాయి. వచ్చే నెల 1న ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. మొదటి రోజుయిన సోమవారం పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగించనున్నారు. అనంతరం రెండు సభలు 1వ తేదీకి వాయిదా పడనున్నాయి. మంగళ, బుధ వారాలు పార్లమెంట్ ఉభయ సభలకు సెలవు దినాలు. రాష్ట్రపతిగా రామ్‌నాథ్ కోవింద్‌కి ఈ బడ్జెట్ సమావేశాలు మొదటివి. సోమవారం నుండి ప్రారంభమయ్యే సమావేశాల కోసం, ఆదివారం పార్లమెంట్ వ్యవహారాల శాఖమంత్రి అనంత్ కుమార్ అధ్యక్షతన, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అధ్యక్షతన వేరు వేరుగా అఖిలపక్ష సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో బడ్జెట్ సమావేశాల నిర్వహణంపై చర్చ

తరువాయి 6లో

20వ సారి గ్రాండ్‌స్లామ్ టైటిల్ విజేత

## రోజర్ ఫెదరర్



12లో

# మిర్చి బండి గొడవే!

• రాజకీయ కోణం లేదు • నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త హత్యపై ఎస్‌పి శ్రీనివాసరావు ప్రకటన • 11 మంది నిందితుల్లో 8 మంది అరెస్టు

**మన తెలంగాణ** / నల్లగొండ: జిల్లాలో సంచలనం కలిగించిన కాంగ్రెస్ నేత, నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త శ్రీనివాస్ హత్య కేసులో పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. కేసుకు సంబంధించి ఆదివారం జిల్లా పోలీసు కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్‌పి శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు. శ్రీనివాస్ హత్య కేసులో రాజకీయ కోణం లేదన్నారు. ఈ ఘటనలో పదకొండు మంది ప్రమేయం ఉండగా, 8 మందిని అరెస్టు చేశామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. గత బుధవారం సాయంత్రం మిర్చి బండి వద్ద



జరిగిన చిన్న గొడవ శ్రీనివాస్ హత్యకు దారి తీసిందని చెప్పారు. ఈనెల 22న నల్లగొండలోని గాంధీనగర్ సెంటర్‌లో ప్రధాన నిందితులైన రాంబాబు, శరత్, చక్రీలు మిర్చిబండి నిర్వాహకునితో గొడవపడి అతనిపై దాడి చేసి మిర్చి బండిని ధ్వంసం చేశారు. ఈ విషయం స్థానిక కౌన్సిలర్ కుమారుడైన మెరుగు గోపికి మిర్చిబండి యాజమాని చెప్పడంతో అతను రాంబాబుకు ఫోన్ చేసి

తరువాయి 6లో

సిద్దిపేటకు చెందిన టెకీ అమెరికాలో అనుమానాస్పద మృతి

• మృతదేహాన్ని రప్పించే యత్నాలు 3



రాజు (ఫైల్)

# ఆపరేషన్ సక్సెస్ పేషంట్ డెడ్!

రూ.7 లక్షలు కట్టించుకొని చనిపోయాడని ప్రకటించిన ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు

బిల్లు డబ్బు కోసమే ఆపరేషన్ విజయవంతమైందని నాటకమాడారంటూ బంధువుల ఆందోళన, ఫర్నీచర్ ధ్వంసం

**మన తెలంగాణ**/ మాదన్నపేట్: నల్లగొండ జిల్లా ఇరుగంటి పాలెంకు చెందిన రాజు (24) ఉపాధి దృష్ట్యా హైదరాబాద్ కుషాయిగూడలో ఉంటూ ఓ ప్రైవేట్ పాఠశాలలో పిఇటిగా పని చేస్తున్నాడు. పది రోజుల క్రితం రాజు విద్యార్థులకు క్రికెట్ శిక్షణ ఇచ్చే సమయంలో కుప్పకూలిపోగా వెంటనే అతన్ని మలక్‌పేట్‌లోని యశోద ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి వెంటనే గుండె చికిత్స చేయాలని చెప్పడంతో కొంత డబ్బు కట్టారు. చికిత్స అనంతరం కొద్ది రోజుల పాటు అత్యవసర విభాగంలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. శనివారం వైద్యులు జనరల్ వార్డుకు మార్చి సాయంత్రనికి డిశ్చార్జ్ చేయవచ్చని కానీ, మొత్తం రూ.7 లక్షలు కట్టాలని చెప్పారు. ఆ మొత్తాన్ని కుటుంబ సభ్యులు చెల్లించిన అనంతరం వైద్యులు రాజు చనిపోయాడన్న కబురు మెల్లగా

తరువాయి 6లో

# కుటుంబంలో ముగ్గురి హత్య

వ్యసనాలకు బానిసై తండ్రిని, ఇద్దరు సోదరులను హతమార్చిన పెద్ద కొడుకు

నాగర్‌కర్నూల్ జిల్లా మామిళ్లపల్లి గ్రామంలో దారుణం

హత్యలు చేసి పారిపోతూ మామకు ఫోన్‌లో సమాచారం

పరిసర గ్రామాల్లో కలకలం

తరలివచ్చిన వేలాదిమంది



**మన తెలంగాణ**/ ఉప్పునుంతల : వ్యసనాలకు బానిసగా మారిన ఒక యువకుడు తండ్రితో సహా ఇద్దరు సోదరులను కడతేర్చిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం సామ భాస్కరయ్యకు ముగ్గురు కొడుకులు. పెద్ద కుమారుడైన సామ మల్లేశ్ (28) చెడు అలవాట్లకు బానిసయ్యాడని, జల్సా జీవితాన్ని కోరుకునేవాడని, ఎలాంటి పనిచేయకుండా తండ్రితో, ఇద్దరు సోదరులతో తరచుగా గొడవ పడుతుండేవాడని తెలిపారు. వారికి ఉన్న మూడెకరాల్లో తనకు రావల్సిన ఎకరా భూమి ఇవ్వాలని తరుచూ గొడవపడుతుండేవాడన్నారు. కుటుంబ తగాదాలు భరించలేక భాస్కరయ్య భార్య తన పుట్టినిల్లైన వంగూరు మండలం అన్నారం గ్రామంలో ఉంటుంది. కాగా, ఆదివారం తెల్లవారు జామున మల్లేశ్ ఒకరికి తెలియకుండా మరొకరిని తండ్రిని, ఇద్దరు సోదరులను బండరాళ్ళతో తలపై కొట్టి హత్యచేశాడు. మెదటిగా పెద్ద తమ్ముడైన సామ శ్రీశైలం(22)ను పొలం వద్ద పైపులు మార్చలాంటూ తీసుకుపోయి హత్యచేశాడు. తరువాత రెండో సోదరుడైన సామ రామాస్వామి(16)ని కూడా అలాగే చెప్పి తీసుకెళ్లి కూరగాయలు కోసే కత్తితో ఛాతిలో పోడవడంతో రామాస్వామి అక్కడి నుంచి తప్పించుకొని పరుగెత్తుతుండగా బండరాయితో తలపై బలంగా బాదాడు. అనంతరం తండ్రి సామ భాస్కరయ్య(50)ని పొలంలో బోరు పాయింటు చూడటానికి

తరువాయి 6లో

కుంచెపోటు




నాన్న చెప్పే జిఎస్‌టి మోడీది.. అమ్మ చెప్పే జిఎస్‌టి వర్మది.

# ఫసల్‌బీమా అమలు చేయకపోవడం బాధాకరం: దత్తాత్రేయ



**మన తెలంగాణ**/హైదరాబాద్: రైతులకు ఎంతో మేలుచేసే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా అమలు చేయకపోవడం బాధాకరమని ఎంపి బండారు దత్తాత్రేయ ఆరోపించారు. ఈ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. 506, 507 సెక్షన్ల సవరణ పూర్తిగా అప్రజాస్వామికమని, ఇది రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ దోరణికి నిదర్శనమని, కెసిఆర్ అభద్రతా భావానికి ఇది అద్దం పడుతోందని వ్యాఖ్యానించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో బిజెపి నేతలు కపిలవాయి దిలీప్‌కుమార్, డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, సుధాకర్‌శర్మతో ఆయన మాట్లాడారు. ఫసల్ బీమా పథకాన్ని కేవలం 15 శాతం మాత్రమే అమలు చేశారని, తద్వారా రైతులు తమ పంట నష్టాన్ని క్లెయిమ్ చేసుకోలేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలు కొనసాగడం ఆందోళన కరమన్నారు. మేడారం జాతరను జాతీయ ఉత్సవంగా గుర్తించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోందన్నారు. ఒబిసి కమిషన్ బిల్లును రాజ్యసభలో అమోదం పొందేలా రాష్ట్ర కాంగ్రెస్ నేతలు తమ అధిష్టానాన్ని ఒప్పించాలని సూచించారు. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరాకు కేంద్రం అధిక నిధులను విడుదల చేసిందన్నారు. నల్లగొండ మున్సిపల్ చైర్మన్ భర్త శ్రీనివాస్ హత్యను దత్తాత్రేయ ఖండించారు.

## బిసి విద్యానిధి పథకం దరఖాస్తుల చివరి తేదీ 31

**మన తెలంగాణ**/హైదరాబాద్: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు మహాత్మా జ్యోతిబా పూలే బిసి ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. జనవరి 31వ తేదీలోగా అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని బిసి సంక్షేమ శాఖ సూచించింది. ఈ పథకం కింద బిసి విద్యార్థులకు రూ.20 లక్షలు ఆర్థిక సహాయం అందుతుంది. http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ నుండు విద్యార్థులుదరఖాస్తు చేసుకోవాలని సూచించింది. విదేశీ యూనివర్శిటీలలో పిజి కోర్సులు చదివేందుకు విద్యార్థులు సంబంధిత సబ్జెక్టుల్లో డ్రిగీ స్థాయిలో కనీసం 60 శాతం మార్కులు పొంది వయస్సు 35 ఏళ్లు లోపు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షల లోపు ఉండాలి. విదేశీ విశ్వవిద్యాలయం నుండి అడ్మిషన్‌కు సంబంధించిన ఆఫర్ లెటర్ పొంది ఉండాలి. అభ్యర్థుల దరఖాస్తులను బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ పరిశీలించనుంది. ఎంపికైన విద్యార్థులకు రెండు విడతల్లో యూనివర్శిటీ ఫీజును బట్టి ఆర్థిక సహాయాన్ని మంజూరవుతుందని స్పష్టం చేసింది. అభ్యర్థులు విమాన చార్జీలను కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది.

## నేడు టిడిపి నేతల సమావేశం

**మన తెలంగాణ**/హైదరాబాద్: రాష్ట్ర టిడిపి నేతలు సోమవారం ఎన్‌టిఆర్ భవన్‌లో సమావేశం కానున్నారు.టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ ఆధ్వర్యంలో జరిగే ఈ భేటీకి పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర, రాష్ట్ర, జిల్లా కమిటీల సభ్యులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా పల్లె పల్లెకు తెలుగుదేశం కార్యక్రమంపై చర్చించనున్నారు. అలాగే పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు చేసిన వ్యాఖ్యలపై మరోమారు నేతల అభిప్రాయాలు తీసుకోనున్నట్లు తెలిసింది. ఈ సమావేశానికి మోత్కుపల్లి కూడా హాజరుకానున్నట్లు సమాచారం.



# ఆశాజనకం!



- 5 లక్షల టన్నులు పెరిగిన ఆహార ధాన్యాల దిగుబడి
- యాసంగిలో వరి దిగుబడి 10 లక్షల టన్నులు అధికం
- అర్థగణాంక శాఖ రెండో ముందస్తు అంచనాల్లో వెల్లడి

**మన తెలంగాణ**/హైదరాబాద్: రాష్ట్రంలో ఆహార ధాన్యాల దిగుబడి ఆశాజనకంగా ఉంది. వ్యవసాయ శాఖ నిర్దేశించుకున్న లక్ష్యంలో 5 లక్షల టన్నులు పెరిగింది. ఇందులో అధికంగా యాసంగి ఉత్పత్తి అంచనానే అధికంగా ఉండటం గమనార్హం. అర్థగణాంక శాఖ 2017– 18 వానకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించి రెం డో ముందస్తు అంచనా నివేదికల్లో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఆ నివేదిక ప్రకారం.. ఈ ఏడాది వానకాలం, యాసంగిల్లో 90.89 లక్షల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి లక్ష్యంగా పెట్టుకోగా, 95.01 లక్షల టన్నలు దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇందులో వానకా లంలో 54.60 లక్ష్యానికి గాను 50.29 లక్షల టన్నులు, యాసంగిలో 36.28 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 44.72 లక్షల టన్నుల దిగుబడి రానుందని అంచనా వేశారు. మొత్తంగా వరి దిగుబడి లక్ష్యం 58.11 లక్షల టన్నులు కాగా, దిగుబడి అంచనా 65.58 లక్షల టన్నులు వస్తుందని నివేదికలో పేర్కొన్నారు. వానకాలంలో వరి ఉత్పత్తి లక్ష్యం 32.47 లక్షల టన్నులు కాగా, దిగుబడి కేవలం 30.42 లక్షల టన్నులుగా ఉంది. అలాగే యాసంగికి వచ్చేసరికి లక్ష్యంగా 25.64 లక్షల టన్నులు ఉండగా ఏకంగా 35.16 లక్షల టన్నుల దిగు బడి వస్తుందని అంచనా నివేదించారు. కేవలం ఒక్క యా సంగిలోనే వరి దిగుబడి దాదాపు 10 లక్షల టన్నులు పెరగడం గమనర్హాం. ఇక పప్పుధాన్యాల దిగుబడి ల క్ష్యం 4.69 లక్షల టన్నులు కాగా 50వేల టన్నులు అధికంగా వచ్చి 5.13 లక్షల టన్నులకు పెరగనుందని అం చనా. ఇక కంది దిగుబడి లక్ష్యం 2.03 లక్షల టన్నులు కాగా 2.84 లక్షలకు చేరింది. పెసర 74 వేల టన్నుల దిగుబడి లక్ష్యానికి గాను 65 వేల టన్నుల దిగుబడి వ స్తుందని అధికారుల అంచనా. మొక్కజొన్న వానకాలం, యాసంగి దిగుబడి లక్ష్యం 27.01 లక్షల టన్నులు కా గా 23.55 లక్షల టన్నులే వచ్చే అవకాశం ఉందని అర్థగణాంక శాఖ పేర్కొంది. రెండు సీజన్‌లకు కలిపి నూ నె గింజల దిగుబడి లక్ష్యం 6.80 లక్షల టన్నులు ఉండ గా, 5.77 లక్షల టన్నలు దిగుబడి వస్తుందని నివేదికలో పొందుపర్చారు.

**వానకాలం, యాసంగిలో ఆహారధాన్యాల ఉత్పత్తి లక్ష్యం, దిగుబడి అంచనా (లక్షల టన్నుల్లో)**

| పంట | లక్ష్యం | దిగుబడి అంచనా |
|---|---|---|
| వరి | 58.11 | 65.58 |
| కంది | 2.03 | 2.84 |
| మొక్కజొన్న | 27.01 | 23.55 |
| పెసర | 0.74 | 0.65 |
| జొన్న | 0.87 | 0.62 |

### దోమపోటుతో 2 లక్షల టన్నులు నష్టం

వరికి దోమపోటు కారణంగా ఈసారి అధికంగా నష్టం వాటిల్లిందని జయశంకర్ వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. వానకాలం సీజన్‌లో 18.85 లక్షల ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం నమోదైంది. ఇందులో దాదాపు 8 లక్షల ఎకరాల వరకు దోమపోటు బారిన పడి దిగుబడి పడిపోతుందని శాస్త్రవేత్తలు నివేదించారు. అర్థగణాంక శాఖ 2 లక్షల టన్నులు వరి దిగుబడి తగ్గినట్లు నివేదికలో పేర్కొనడం గమనార్హం. వాస్తవానికి మొదటి ముందస్తు అంచనా నివేదికలో అర్థగణాంక శాఖ ఏకంగా 17 లక్షల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి తగ్గుతుందని వెల్లడించింది. అయితే ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉండటం గమనార్హం. అలాగే ప్రస్తుతం యాసంగిలో వరినాట్లు 13.14 లక్షల ఎకరాల్లో వేశారు. ఇది ఇంకా పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు యాసంగిలో 79 శాతం పంటల సాగు నమోదైంది. పత్తి విష యానికొస్తే 43.32 లక్షట టన్నులుగా ఉంది. అయితే మార్కెట్‌లో ఆ స్థాయిలో పత్తి కనిపించకపోవడం గమనార్హం.

## జైళ్ల సూపరింటెండెంట్ల బదిలీలు

**మన తెలంగాణ**/హైదరాబాద్: చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రం జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఉన్న అర్జున్‌రావును చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న వై.రాజేష్‌ను చర్లపల్లి వ్యవసాయ క్షేత్రం జైలు సూపరింటెండెంట్‌గా నియమించారు. ఇక వరంగల్ సెంట్రల్‌జైలు సూపరింటెండెంట్‌గా అటాచ్‌మెంటులో ఉన్న మురళీబాబును పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌గా నియమించారు. వై.రాజేష్ చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టి ఆరు నెలలు గడవకముందే ఆయనపై బదిలీ వేటు వేయడం గమనార్హం. ఇటీవల రిమాండ్ ఖైదీగా ఉన్న మందకృష్ణ మాదిగకు ములాఖత్ ఇష్టం వచ్చినట్లు ఇవ్వడం వల్లనే ప్రభుత్వం రాజేష్‌పై ఆగ్రహంగా ఉందనే ప్రచారం సాగుతుంది. వరంగల్ రేంజ్ డిఐజిగా విధులు నిర్వహిస్తున్న కేశవనాయుడు ఈ ఏడాది మే 18న పదవీ విరమణ చేయనున్నారు. అయితే చర్లపల్లి వ్యవసాయ క్షేత్రం సూపరింటెండెంట్‌గా బదిలీ అయిన రాజేష్ ఇక్కడ బాధ్యతలు చేపట్టడానికి ఆసక్తి చూపడం లేదని సమాచారం. ఇక రాయలసీమ రేంజ్ జైళ్ల శాఖ డిఐజిగా వరప్రసాద్‌ను తాజాగా నియమించారు. వరప్రసాద్ గతంలో నిజామాబాద్, చంచల్‌గూడ సికాసలో విధులు నిర్వహించారు.

## దిగ్విజయంగా పల్స్ పోలియో

**మన తెలంగాణ**/హైదరాబాద్: పల్స్‌పోలియో కార్యక్రమం ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా జరిగింది. వైద్యారోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డితో పాటు ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంవత్సరం మొదటి విడతగా ఆదివారం నిర్వహించగా ఫిబ్రవరి 11న తిరిగి రెండవ విడతగా జరగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి నుంచే రైల్వే స్టేషన్లు, బస్టాండ్లతో పాటు రద్దీ ప్రదేశాల్లో పోలియో చుక్కల ఏర్పాట్లు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 22,768 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు మేడారం జాతరకు లక్షల్లో జనం హాజరవుతున్న నేపథ్యంలో అక్కడ ఓ పోలియో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందు కోసం జాతర ప్రాంగణంలో 787 మొబైల్ బృందాలు, ప్రయాణాల్లో ఉన్న వారి కోసం 737 ప్రత్యేక బృందాలను కూడా అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నెల 30 వరకు రైల్వే స్టేషన్లు, బస్టాండ్లతో పాటు మేడారం జాతరలో పోలియో చుక్కలను వేయనున్నారు. రెండవ విడత ఫిబ్రవరి 11వ తేదీ కార్యక్రమం ముగిసిన తర్వాత ఇంటింటికీ వెళ్లి చుక్కలను వేయనున్నారు. మూడు రోజుల పాటు ప్రతి ఇంటికి వెళ్లి చిన్నారులు ఉన్న ఇళ్లల్లో పోలియో చుక్కలు వేయనున్నారు. ఆ తర్వాత అంగన్ వాడీ సెంటర్లలో పోలియో చుక్కలను వేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతో రాష్ట్రంలో 95 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. జిల్లాలకు పూర్తిస్థాయిలో పోలియో వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచారు. వైద్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది, వలంటీర్లు, మహిళా మండలి పంఘాల సభ్యులు, ఆశా వర్కర్లు, మేప్మాతో పాటు నర్సింగ్ విద్యార్థులు, టీచర్లు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.

# పట్టణ వసతులకు పల్లెలు దూరం

- సర్వేలకే పరిమితమైన 'రూర్బన్' పథకం
- అంచనా వ్యయం రూ.1600 కోట్లు
- వచ్చింది రూ.23 కోట్లు

**మన తెలంగాణ**/హైదరాబాద్: పట్టణాల్లో లభ్యమవుతున్న వసతులను పల్లెలకూ కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రం ప్రవేశపెట్టిన రూర్బన్ (శ్యాం ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్) పథకం ఆశించిన ఫలితాలను సాధించలేక పోయింది. రాష్ట్రంలో ఎంపికైన పదహారు క్లస్టర్లకు వంద కోట్ల రూపాయల చొప్పున మొత్తం రూ. 1600 కోట్ల మేరకు ప్రణాళికలు పంపితే కేంద్రం నుంచి విడుదలైంది మాత్రం కేవలం రూ. 23 కోట్లే. ఈ పథకం ప్రారంభమై రెండేళ్లు కావస్తున్నా వసతుల కల్పన కేవలం సర్వేలకే పరిమితమైంది. పట్టణాలకు గ్రామీణుల వలసలను తగ్గించడంతో పాటు పల్లెల్లో మౌలిక సదుపాయాలు పెంచాలనే ప్రధాన ఉద్దేశ్యంతో కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా యేటా వంద క్లస్టర్లను ఎంపిక చేసి అక్కడ అవసరమైన వసతులు కల్పించాల్సి ఉంది. మూడేళ్లలో **300** క్లస్టర్లను ఎంపిక చేసి పట్టణ తరహా వసతులు కల్పించాలి. తొలి విడతలో మన రాష్ట్రం 18 క్లస్టర్లను ప్రతిపాదించింది. కేంద్రం కేవలం నాలుగింటిని మాత్రమే ఎంపిక చేసింది. వీటిలో అక్కడక్కడా ఎల్ఇడి దీపాల వంటివి ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. తర్వాత రెండు, మూడు దశల్లో మరో 12 క్లస్టర్లకు కేంద్రం ఆమోదం తెలిపింది. మొత్తం ఈ పథకం కింద రాష్ట్రంలో ఎంపికైన క్లస్టర్ల సంఖ్య 16కు చేరింది. ఒక్కో క్లస్టర్‌లో ఎంపిక చేసిన పనులకు అయ్యే ఖర్చులో **30**శాతం లేదా **30** కోట్ల రూపాయలు (ఈ రెండింటిలో ఏది తక్కువైతే అది) కేంద్రం భరిస్తుంది. మిగతా ఖర్చును ఆయా పనులను బట్టి రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. గిరిజన క్లస్టర్ అయితే కేంద్రం రూ.25కోట్లు ఇవ్వనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో క్లస్టర్‌లో దాదాపు వంద కోట్ల రూపాయలకు పైగా వ్యయం అయ్యే ప్రణాళికలను తయారు చేసింది. ఈ విధంగా రాష్ట్రం నుంచి ఎంపికైన 16 క్లస్టర్లలో కల్పించాల్సిన వసతులకు అయ్యే వ్యయం దాదాపు 1600 కోట్ల రూపాయలు దాటింది. కేంద్రం మాత్రం ఇప్పటి వరకు కేవలం 23 కోట్ల రూపాయలను మాత్రమే ఇచ్చింది. ఈ పథకం అమలుపై కేంద్రం పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ పథకం ద్వారా కుటుంబ సర్వే నిర్వహించడానికి ఒక్కో క్లస్టర్‌కు రూ.35లక్షలను కేంద్రం ఇస్తుంది. కుటుంబ సర్వే నిర్వహించి వారి వివరాలను, పేర్లను కంప్యూటరీకరించాలి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాగారం క్లస్టర్‌లో ఇప్పటికీ సర్వే పనులే పూర్తి కాలేదు. నల్గొండ జిల్లా కొండ భీమనపల్లి క్లస్టర్‌లోని 21గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. ఇక మొదటి విడత ఎంపికైన నాలుగు క్లస్టర్లలో ఒకటైన సంగారెడ్డి జిల్లా రాయికల్ క్లస్టర్ పరిధిలో 27 పంచాయతీల్లో కొన్ని గ్రామాల్లో ఎల్ఇడి దీపాలు అమరుస్తున్నారు. అక్కడక్కడా సిసి రోడ్ల నిర్మాణం జరుగుతోంది. ఈ క్లస్టర్‌లో రూపొందించిన ప్రణాళిక మేర పనులను పూర్తి చేయడానికి 137కోట్ల రూపాయలు అవసరం. కేంద్రం తన వాటా కింద 30 శాతం నిధులు ఇవ్వాల్సి ఉండగా, కేవలం 5.40 కోట్ల రూపాయలను మాత్రమే ఇచ్చింది. మొదటి విడతలో ఎంపికైన అల్లాపూర్, జుక్కల్‌లకు సైతం కేంద్రం ఒక్కో దానికి 5.40కోట్లు మాత్రమే ఇచ్చింది. మరో క్లస్టర్ చిర్రగుంటకు రూ.2.70 కోట్లు ఇచ్చింది.

## వర్గీకరణ అంశంపై నేడు అఖిలపక్షం

**మన తెలంగాణ**/హైదరాబాద్: ఎస్‌సి వర్గీకరణ అంశంపై హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. తాము అధికారంలోనికి రాగానే వంద రోజుల్లో వర్గీకరణ బిల్లు పెడు తామని హామీనిచ్చిన బిజెపి, 1500 రోజులు గడుస్తున్నప్పటికీ బిల్లు పెట్టకుండా కాలయాపన చేస్తోందని ఆయన ఆదివారం పేర్కొన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధాని మోడీని ఒప్పించాల్సిన బాధ్యతను సిఎం కెసిఆర్ విస్మరిస్తున్నారని ఆరోపించారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని అసెంబ్లీ వేదికగా హామీనిచ్చి 80 రోజులు కావస్తుందని గుర్తుచేశారు. వర్గీకరణ సాధనకు ఉమ్మడి ఉద్యమ కార్యాచరణపై చర్చిస్తామన్నారు.



## శ్రీనివాస్ హత్యపై టిఆర్ఎస్ అసత్య ప్రచారం : విహెచ్

**మన తెలంగాణ**/హైదరాబాద్: బొడ్డేపల్లి శ్రీనివాస్ హత్యపై టిఆర్ఎస్ ఎంఎల్ఎ గాదరి కిశోర్, ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్‌లు అసత్య ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హనుమంతరావు ఆరోపించారు. ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. కోమటిరెడ్డిని తిడితేనే టిఆర్ఎస్‌లో చేరాలని బొడ్డేపల్లి శ్రీనివాస్‌పై ఎంఎల్ఎ వేముల వీరేశం ఒత్తిడి తెచ్చాడన్నారు. దానికి ససేమిరా అన్నందుకే బొడ్డేపల్లి శ్రీనివాస్‌ను చంపారని ఆరోపించారు. బొడ్డేపల్లి శ్రీనివాస్ అయ్యప్ప స్వామి భక్తుడని, గురుస్వామి పాపం ఊరికే పోదన్నారు. ఈ పాపం కెసిఆర్ కుటుంబ సభ్యులకు తగులుతుందన్నారు. డిజిపికి పది రోజుల గడువు ఇస్తున్నామని, ఈ విచారణ నిగ్గు తేల్చాలని, లేదంటే ఈ కేసును సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. విచారణ సరిగ్గా జరిపించకపోతే కెసిఆర్ ప్రభుత్వం పడి పోతుందన్నారు. ఇప్పటికైనా ఎంఎల్ఎ వేముల వీరేశంను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఎల్ఎకు ఒక రూలు, నయీమ్ వంటి వారికి మరో రూలా అని విహెచ్ ప్రశ్నించారు. తెలంగాణలోని బిసిలంతా సిఎం కెసిఆర్‌కు గుణపాఠం చెబుతారన్నారు. కాళేశ్వరం పేరు మార్చి ప్రాజెక్టు అంచనాలను రూ.35 వేల కోట్ల నుండి రూ. 80 వేల కోట్లకు పెంచారని విహెచ్ ఆరోపించారు. ఈ అంచనాలు ఏ విధంగా పెరిగాయో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు.



## మేడారం భక్త జనసంద్రం

- భారీగా తరలివచ్చిన భక్తులు



**మన తెలంగాణ**/మేడారం: మేడారం జాతరకు భక్తులు పోటెత్తారు. ఆ దివారం సెలవు దినం కావడంతో రాష్ట్ర నలుమూల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులతో మేడారం గద్దెల ప్రాంగణం కిటకిటలాడింది. జంపన్నవాగులోకి లక్నవరం సరస్సు నీటిని విడుదల చేయడంతో భక్తులు ఆనందోత్సవాలతో జంపన్నవాగులో పుణ్యస్నానాలను చేసి తల్లులను దర్శించుకున్నారు. జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన కల్యాణకట్టల వద్ద భక్తులు తల్లులకు తలనీలాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. అమ్మవార్ల గద్దెల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఏటూరునాగారం వద్ద గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణం చేయడంతో చత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు.

**వన్‌వేతో భక్తుల ఇబ్బందులు:** జాతర పూర్తిస్థాయిలో ప్రారంభం కాక ముందే పోలీసులు అత్యుత్సాహన్ని ప్రదర్శిస్తున్నారు. హన్మకొండ, ములుగు, పస్రా, నార్లాపూర్ మీదుగా వచ్చే వాహనాలను తిరుగు ప్రయాణంలో భూపాలపల్లి మీదుగా పంపించడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా కరీంనగర్, భూపాలపల్లి ప్రాంతాల భక్తులు బయ్యక్కపేట మీదుగా కాకుండా గణపురం, జంగాలపల్లి మీదుగా మళ్లించడం వల్ల భక్తులు అవస్థలు పడుతున్నారు.

## ఎన్‌డిఎ హయాంలో దళితులపై ఆగని దాడులు : చాడ వెంకటరెడ్డి



**మన తెలంగాణ**/హైదరాబాద్: దళితులపై జరుగుతున్న దాడులను నిలువరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో ఆదివారం జరిగింది. డిహెచ్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి బరిగెల సాయిలు అధ్యక్షతన జరిగిన వర్క్‌షాపులో చాడ వెంకటరెడ్డితో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుండ మల్లేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి దళితులు, మైనార్టీలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు రాజ్యాంగాన్ని తూట్లు పొడిచేలా ఉన్నాయని విమర్శించారు. ముడెకరాల భూమి పేరుతో సిఎం కెసిఆర్ దళితులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం దారి మళ్లిస్తోందన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో అన్ని సామాజిక వర్గాల ప్రజలు దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పనిచేస్తున్న నేటి పాలకులు చట్టసభలు, న్యాయవ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య సంఘటన కూటమిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దళితుల సమస్యలపై డిహెచ్‌పిఎస్ మరింత విస్తృతంగా పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, బాలనర్సింహ, కె. యేసురత్నం, ప్రభాకర్, పి.గెల్వయ్య, గణేశ్ పాల్గొన్నారు.

## డల్లాస్‌లో సిద్దిపేట వాసి మృతి

**మన తెలంగాణ**/సిద్దిపేట: డల్లాస్‌లో సిద్దిపేట వాసి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సిద్దిపేట పట్టణం ప్రశాంత్‌నగర్‌కు చెందిన వెంకన్నగారి కృష్ణచైతన్య డల్లాస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. డల్లాస్‌లో ఒక ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటున్న కృష్ణ చైతన్య గత శుక్రవారం నుంచి తన రూంలోంచి బయటకు రాకపోవడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆదివారం గది తలుపులు తీసి చూడగా బెడ్‌పై కృష్ణ చైతన్య మృతి చెంది కనిపించాడు. మూడున్నరేళ్ల క్రితం కాగ్నిజెంట్ సంస్థ ఆన్‌సైట్‌పై అమెరికా వెళ్లిన కృష్ణచైతన్య మూడు నెలల క్రితమే డల్లాస్‌లోని సౌత్ వెస్ట్ ఎయిర్‌లైన్స్ సంస్థలో చేరి అక్కడే ఒక ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటున్నాడు. మృతదేహాన్ని స్వస్థలానికి పంపడానికి తెలంగాణ ఎన్ఆర్ఐ విభాగం ఆధ్వర్యంలో గోలి మోహన్, శ్రీధర్ మాధవనేని ఏర్పాట్లు చేస్తుండగా మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకుని తెలంగాణ ప్రభుత్వం తరఫున ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మృతదేహం గురువారం హైదరాబాద్‌కు చేరుకోనున్నట్టు సమాచారం.

## ఈయనది 'గోల్డెన్ బ్లడ్'



ఆస్ట్రేలియాకు చెందిన జేమ్స్ హారిసన్ ప్రపంచంలో అత్యధికసార్లు రక్తదానం చేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. హారిసన్ రక్తాన్ని గోల్డెన్ బ్లడ్ అంటారు. ఎందుకంటే ఆయన ఇలా రక్తం ఇచ్చి దాదాపు 20 లక్షలమంది చిన్నారులను కాపాడారు. గర్భిణులకు వచ్చే రీసస్ వ్యాధిని నిరోధించేందుకు ఈయన రక్తం నుంచి యాంటీ డి అనే ఇంజెక్షన్ తయారు చేసి గర్భిణులకు అందిస్తున్నారు. ఏటా 17శాతం మంది గర్భిణులకు ఈ వ్యాధిసోకి గర్భస్రావాలు అవుతున్నాయట. పుట్టబోయే పిల్లలను కాపాడాలనే ఉద్దేశంతోనే హారిసన్ వెయ్యిసార్లకుపైగా రక్తదానం చేశారు.

# ఎలాంటి ఇబ్బంది రానీయం

- మేడారం జాతర ఏర్పాట్లు పూర్తి
- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి
- కోటి 20లక్షల మంది భక్తులు వస్తారని అంచనా

**మన తెలంగాణ**/వరంగల్: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఉప ముఖ్యమంత్రి, కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం ఆయన మేడారంలో చేపట్టిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాతరలో కాలినడకనే కలియ తిరిగారు. అనంతరం సాయంత్రం ఐటిడిఎ అతిథి గృహంలో జాతర ఏర్పాట్లు, నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. మహా జాతరకు రాష్ట్ర నలుమూల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తారని, అందుకు తగినట్లుగా ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం కల్పించిందని చెప్పారు. దానికి తగ్గట్లుగా ఏర్పాట్లు చేశామని, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు రానీయమన్నారు. అధికారులు కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జాతరకు కోటి 20 లక్షల మందికిపైగా భక్తులు వస్తారని అంచనా వేయడం జరిగిందని, ఇందుకోసం ప్రభుత్వం రూ.80 కోట్లు వెచ్చించి శాశ్వత ప్రాతిపదికన పనులను చేపట్టి పూర్తి చేసినట్లు వివరించారు.

### నిరంతరాయంగా తాగునీరు

జాతరకు వచ్చే భక్తులకు నిరంతరాయంగా తాగునీటిని 24 గంటలపాటు అందించే విధంగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. మరుగుదొడ్లు, విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరలో భక్తుల భద్రతపై పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గద్దెల వద్ద తల్లులను భక్తులు దర్శించుకునే సందర్భంలో ఎలాంటి తొక్కిసలాట జరుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గద్దెల ప్రాంగణంలో భక్తులు నిలబడకుండా వరుసలు త్వరితగతిన ముందుకు కదిలేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.





## తల్లులను దర్శించుకున్న ఎంపిలు, ఎంఎల్ఎలు



సమ్మక్క, సారలమ్మలను ఆదివారం ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి దర్శించుకున్నారు. ఆయనతో పాటు ఎంపిలు ప్రొ. అజ్మీరా సీతారాం నాయక్, పసునూరి దయాకర్, విశ్వేశ్వర్‌రెడ్డి, బాల్క సుమన్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, బిబి పాటిల్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌సిలు కొం డా మురళీధర్‌రావు, పూల రవీందర్, శ్రీనివాసరెడ్డి, ఎంఎల్ఎలు, జడ్‌పి చైర్మన్ పద్మ, వరంగల్ మేయర్ నన్నపునేని నరేందర్, కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, రాష్ట్ర మహిళా చైర్మన్ సుధారాణి, రాష్ట్ర గొర్రెలు, మేకల కార్పొరేషన్ చైర్మన్ రాజయ్యయాదవ్ తదితరులున్నారు.

## మూడు రంగాలు.. వేయి కోట్ల పెట్టుబడులు

- మంత్రి కెటిఆర్ సమక్షంలో బిఆర్ఎస్ సంస్థ ఒప్పందం



**మన తెలంగాణ**/హైదరాబాద్: అమెరికాకు చెందిన బిఆర్ శెట్టి గ్రూప్ కంపెనీ అయిన బిఆర్ఎస్ రాష్ట్రంలో మూడు రంగాల్లో సుమారు వేయి కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు మంత్రి కెటిఆర్ సమక్షంలో బిఆర్ శెట్టి గ్రూప్ ప్రతినిధితో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఎంవోయూ ప్రకారం.. బిఆర్ఎస్ సంస్థ తెలంగాణలో సుమారు 20 ఎకరాల్లో ఫార్మాస్యూటికల్ మ్యానిఫ్యాక్చరింగ్ అండ్ ఆర్అండ్‌డి యూనిట్ ఏర్పాటు చేయనుంది. అంతేకాకుండా దయాలసిస్ మిషన్లు, మెడికల్ ఏయిడ్, హాస్పిటల్ ఫర్నీచర్ తదితర ఎక్విప్‌మెంట్‌కు సంబంధించిన మెడికల్ డివైస్ మ్యానుఫాక్చరింగ్ యూనిట్‌ను హైదరాబాద్ సమీపంలోని సుల్తాన్‌పూర్‌లో ఏర్పాటు చేయనుంది. ఈ కంపెనీ మరో 50 ఎకరాల్లో మెడికల్ ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ సంస్థల ఏర్పాటు, 20 ఎకరాల్లో 500 పడకల సామర్థ్యపు గ్రీన్ ఫీల్డ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయనుంది. మూడు నుండి ఐదేళ్ల కాలంలో తెలంగాణలో మొత్తంగా రూ. వేయి కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపింది. బిఆర్ శెట్టి గ్రూప్ యూఏఈలో హెల్త్‌కేర్, హాస్పిటాలిటీ, ఫార్మాస్యూటికల్స్ రంగంతో పాటు ఐటి, ఫైనాన్సియల్ సర్వీసులు, ఫుడ్, రిటైల్, ట్రేడింగ్ రంగాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది.

### 2500 కోట్ల పెట్టుబడులకు..

రాష్ట్రంలో రిటైల్ అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలో సుమారు రూ. 2500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు యూఏస్ కంపెనీ లూలూ గ్రూప్ అంగీకారం తెలిపింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వంతో మంత్రి కెటిఆర్, జయేష్ రంజన్‌ల సమక్షంలో ఎంఒయూను కూడా కుదుర్చుకుంది. 1.8 మిలియన్ల చ. అడుగుల విస్తీర్ణంలో మెగా షాపింగ్ మాల్, పండ్లు, కూరగాయలలకు సంబంధించిన ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్, లాజిస్టిక్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ఎగుమతుల ప్రాసెసింగ్ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు అబుదాబిలో మంత్రి కెటిఆర్ సమక్షంలో జయేష్ రంజన్, లూలూ గ్రూప్ హెడ్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా లూలూ గ్రూప్ చైర్మన్ యూసుఫ్ అలీ మాట్లాడుతూ కంపెనీ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా తెలంగాణపై దృష్టి సారించినట్లు తెలిపారు.

## నేడు సిఎస్ బడ్జెట్ సమీక్ష

**మన తెలంగాణ**/హైదరాబాద్: వివిధ శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలపై ప్రధాన కార్యదర్శి ఎస్పి సింగ్ సోమవారం సమీక్ష జరపనున్నారు. సచివాలయంలో జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల నుంచి ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు హాజరుకావాల్సిందిగా ఇప్పటికే సమాచారం అందించారు. అన్ని శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనల్లో 20% నుంచి దాదాపు 35 శాతం వరకు అంచనాలు పెంచాలన్న విజ్ఞప్తులు ఉన్నాయి. ఆర్థిక వృద్ధి రేటు 18 శాతంగా ఉన్నందున ఆయా శాఖలు కోరినట్లుగా భారీ స్థాయిలో అంచనాలను పెంచడం సాధ్యం కాకపోవడంతో ఈ అంశాలపై ఆయా శాఖల కార్యదర్శులుతో సిఎస్ చర్చించనున్నారు. ఆచరణాత్మక అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆయా శాఖలు చేసిన ప్రతిపాదనల్లో ఏయే అవసరాలకు ఎంతమేరకు పెంచడం సాధ్యమవుతుందో వివరించి అంచనాలను సవరించాల్సిందిగా కోరే అవకాశం ఉంది. ఇప్పటికే పలు శాఖల అధికారులతో జరిగిన సమావేశాల్లో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఈ విషయాన్ని స్పష్టం చేశారు. సిఎస్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వచ్చే వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపుతారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ ఈ సమీక్షా సమావేశం జరిగే అవకాశం ఉంది.

## పంచాయతీ చట్టంపై అసెంబ్లీ అనుమానమే!

- అవసరమైతే ప్రభుత్వం 'ఆర్డినెన్స్' బాట!

**మన తెలంగాణ**/హైదరాబాద్: పంచాయతీ రాజ్ చట్టానికి సవరణలు చేస్తూ ప్రభుత్వం రూపొందించే బిల్లుపై చర్చించడానికి ప్రత్యేక అసెంబ్లీ సమావేశం దాదాపు ఉండకపోవచ్చని అధికారవర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఎలాగూ ఓటర్ల తుది జాబితా తయారీకి ఎన్నికల ప్రధానాధికారి మార్చి నెల 24 వరకు గడువు విధించినందువల్ల ఈలోపు ఎన్నికలు సాధ్యం కాకపోవచ్చని, అందువల్లనే పంచాయతీ చట్టానికి సవరణలు చేసే బిల్లుపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉండకపోవచ్చని వివరించాయి. ఒకవేళ ప్రభుత్వం అవసరమని భావిస్తే ఆర్డినెన్స్ ద్వారా కూడా అడుగులు వేయవచ్చని, ప్రత్యేక సెషన్ అవసరం ఉండదని ఆ వర్గాలు సూచనప్రాయంగా తెలిపాయి. ఎలాగూ మార్చి నెలలో బడ్జెట్ సమావేశాలు ఉన్నందున అప్పుడే ఈ బిల్లుపై చర్చించవచ్చని, ఇప్పటికిప్పుడు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి కొత్త చట్టానికి ఆమోదం పొందినా ఎన్నికలు జరిగే అవకాశం లేదుగదా అని ఆ వర్గాలు వివరించాయి. తొలుత ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను ఏర్పాటు చేయవచ్చని, ఆ తర్వాత 28, 29 తేదీల్లో జరిపే అవకాశం ఉందని వార్తలు వచ్చినా ప్రభుత్వం మాత్రం ఎన్నికల ప్రధానాధికారి ప్రకటన తర్వాత ప్రత్యేక సెషన్ అవసరం లేదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. మరోవైపు తాండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయడం, కొన్ని గ్రామ పంచాయతీలను మేజర్ పంచాయతీలుగా, నగర పంచాయతీలుగా మార్చడానికి సంబంధించి అన్ని జిల్లాల కలెక్టర్ల నుంచి ఈ నెల 25వ తేదీకే నివేదిక కోరినా దాన్ని ఈ నెల 31వ తేదీ వరకు సిఎం పొడిగించారు. రెండు రోజుల తర్వాత కలెక్టర్ల నుంచి వచ్చే నివేదికలకు అనుగుణంగా ప్రభుత్వం తదుపరి నిర్ణయం తీసుకోనుంది.



## హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

**మన తెలంగాణ**/హైదరాబాద్: హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని ఇరిగేషన్ శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆవిష్కరించారు. జలసౌధలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు టి.వెంకటేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ మధుసూధన్‌రెడ్డి, అధ్యక్షులు సి.మహేందర్, ప్రధాన కార్యదర్శి కె.చక్రధర్, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సలహాదారు వై.శేఖర్‌రెడ్డి, చీఫ్ ఇంజనీర్ హరిరాం, ఎస్ఇలు వేణు, రాజశేఖర్, డి.సిఇలు చంద్రశేఖర్, నరహరి బాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాప్కోస్ ఐదోసారి!

- రూ.3,200 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు

**మన తెలంగాణ**/హైదరాబాద్: నార్లాపూర్ నుంచి డిండికి నీటి మార్గంపై వ్యాప్కోస్ ఐదోసారి ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇచ్చింది. రూ.3,200 కోట్ల అంచనాతో తాజా అలైన్‌మెంట్‌ను వ్యాప్కోస్ సూచించింది. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతానికి సాగు, తాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకానికి ఆరంభం నుంచి వరుస కష్టాలు వస్తున్నాయి. ఇప్పటికే నాలుగు సార్లు అలైన్‌మెంట్ మార్చగా, తాజాగా ఐదో ప్రతిపాదన ప్రభుత్వం ముందుకు వచ్చింది. కరవు జిల్లాలో కల్వకుర్తి పరిసర ప్రాంతాలకు దశాబ్దాలుగా ఎదురుచూసిన నీరు వచ్చి, సంతోషంగా ఉన్న తరుణంలో డిండి నీటి కోసం తమ ఆయకట్టును వదులుకోమంటూ స్థానికుల అభ్యంతరాలతో అలైన్‌మెంట్ ఖరారులో ఆలస్యం జరిగింది. స్థానికుల అభ్యంతరాలు, భూసేకరణ, అటవీ భూముల నుంచి వెళుతున్న కారణంగా పాత ప్రతిపాదనలన్నీ తెరమరుగయ్యాయి. ఇప్పటివరకు వ్యక్తమైన అభ్యంతరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటూ వీలైనంత మేర వాటికి తావు లేకుండా కొత్త అలైన్ మెంట్ ప్రతిపాదనలు ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. గతంలో 4,500 నుంచి 5,000 వేల ఎకరాల మధ్యలో భూసేకరణ అవసరం ఉండగా, తాజా ప్రతిపాదనలతో 1000 ఎకరాల్లోపే భూమి సేకరించాల్సి వస్తుంది. దీనికి తోడు గతంలో రూ.3500 కోట్ల అంచనా వ్యయంతో అలైన్‌మెంట్ ఇవ్వగా, తాజాగా రూ.3,200 కోట్లతో ప్రతిపాదనలు ఇచ్చారు. దీంతో రూ.300 కోట్లు వ్యయం తగ్గింది. కల్వకుర్తి ఎత్తిపోతల ఆయకట్టుకు ఇబ్బంది లేకుండా వీలైనంత మేర టన్నెల్ మార్గంలోనే నీటిని తీసుకెళుతున్నారు. నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు వచ్చే మెయిన్ కెనాల్ 8వ కిలోమీటర్ వద్ద నీటి మళ్లింపు ఉంటుంది. మొత్తం 52 కిలోమీటర్ల మేర మార్గం ఉంటే, ఇందులో 20 కిలోమీటర్ల ఓపెన్ కెనాల్, మరో 22 కిలోమీటర్ల టన్నెల్ ఉంది. మిగతాదంతా ప్రస్తుతం దుంధుభి నదికి సహజ సిద్ధంగా ఉన్న ప్రవాహ మార్గమని అధికారులు స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలం వద్ద ఉన్న ఆలేరు గ్రామ సమీపం వరకు నీటిని తీసుకువచ్చి, వాగులోకి మళ్లించాలన్నది వ్యాప్కోస్ ప్రతిపాదన. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా డిండికి నీరు వెళుతుంది. అయితే డిండి రిజర్వాయర్‌కు 12 కిలోమీటర్ల ఎగువన ఉన్న ఉల్పర వద్ద బ్యారేజి నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నాయి. డిండి రిజర్వాయర్‌కు నీరు వెళ్లకుండా ఎగువన ఉల్పర నుంచే నీటిని పాత డిండి అలైన్‌మెంట్ 10వ కిలోమీటర్ వద్దకు మళ్లిస్తారు.

అక్కడి నుంచి యధావిధిగా పాత అలైన్‌మెంట్ ఉంటుంది. మధ్యలో గోకారం, ఎర్రవల్లి వద్ద రెండు చెరువులను కలిపి ఒక రిజర్వాయర్‌గా మారుస్తున్నారు. 3.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటితో పాటు సమీప గ్రామాల ప్రజలకు తాగునీరు ఇవ్వాలన్నది డిండి ఎత్తిపోతల ప్రతిపాదన. డిండి నుంచి నీరు వెళ్లే మార్గంపై ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. కానీ భూసేకరణ సమస్యలతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.



కలం

## గిరిజన కుంభమేళా



తురుష్క ముష్కర దురాక్రమణ దోపిడీ పర్యవసానం
కాకతీయ రాజ్యంపై మోయలేని కప్పం భారం
కరువు కాటకాలతో కప్పం కట్టలేక కునారిల్లిన గిరిజనం
కోయరాజులు కోయసైన్యం తిరుగుబాటుగా పరిణామం
కాకతీయ సైన్యం దండుగా విజృంభణం
కోయసైన్యాలు కకావికలై పడిగిద్దరాజు జంపన్నల అమరత్వం
సమ్మక్క సారక్కల అస్థిత్వ పోరాటం
అమరులైన గిరిజనుల వీరత్వ స్మృతులకై జాతర
వీరపూజగా విప్లవ వ్యాఖ్యాతల తల రాత
ఎనిమిది వందల యేళ్ళ ఆగని ప్రవాహం
క్రమక్రమంగా కోయేతరులు,
గ్రామీణులు పురావాసులు మమేకం
దక్షిణ మధ్యోత్తర తూర్పు భారత సంగమం
గిరిజన కుంభమేళాగా ఆవిర్భావ సన్నాహం
డిక్లాసిపై అయి సమాజాన్ని విప్లవీకరించాలని ఆ ''వసంతగీతం''
ఎదురుదెబ్బలు ఒడుదుడుకులు
చర్య ప్రతిచర్యల మధ్య అడ్జస్ట్ కాబడ్డ ''సతమతం''
తాగుడు వూగుడు వాగుడుగా పరిణామం
ఏళ్లయినా అదే క్రమం అభివృద్ధిపై అవగాహనాలపై సమీక్ష పూజ్యం
నదులు అడవులు సంస్కృతి నాగరికతలకు అభివృద్ధిలకు ఆలవాలం
అన్నింటినీ దోపిడీ చేస్తున్న ఆధునిక పారిశ్రామిక భీభత్స ఆగడం
పర్యావరణ హితంగా జన ఆవరణ వైవిధ్యాల్ని
కాపాడుకునే దశ దిశగా మార్పుకై ఆరాటం
తరాలు మారినా అంతరాలు పోవాల్నని ఆగక సాగుతున్న పోరాటం

**డా॥ కాసర్ల రంగారావు, 9866837741,**

# 'జలవద్గీత'గా సాగిన 'జలగీతం'



కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి
9948774243


నిప్పులా జ్వలిస్తూ, నీరులా ప్రవహిస్తూ అంతర్గత అగ్నిని నిద్రలేపుతూ జ్ఞాన ప్రవాహమై సాగుతున్న కవి డా॥ యన్.గోపి. వీరు జీవితంలో ఒక లక్ష్యాన్ని మార్గాన్ని సుస్థిర పరచుకున్న కవి. తనదైన గొప్ప ధ్యేయాన్ని అధిగమించేందుకు ఎంతో పరిశ్రమించి సృజనాత్మకమైన కవిత్వాన్ని తన మార్గంగా ఎన్నుకున్న కవి ఈయన. వీరు ఏది రాసినా, జాతి ప్రయోజనాన్ని, దేశాభివృద్ధిని, మానవీయతా విలువల్ని, ప్రాపంచిక దృక్పథాన్ని దృష్టిలో పెట్టుకొని అంతర్ముఖీనమైన భావాల్ని కవిత్వంగా వెలువరిస్తారు. అందుకే వీరి కవిత్వంలో అనుభవసారం రసప్రవాహమై సాగిపోతూ పాఠకుల అభిలాష దాహాన్ని తీరుస్తుంటుంది. ఏ వస్తువును ముట్టుకున్నా దాని మూల సారాన్ని గ్రహించకుండా, నేటి కాలమాన పరిస్థితుల్లో దాని పరిణామ క్రమాన్ని పరిశీలించకుండా దాని అంతరాత్మను పరిశోధించకుండా, దాని వైజ్ఞానిక భూమికపై మొలచిన తాత్త్వికతను అవగాహనించుకోకుండా ఆ వస్తువును కవితారూపంలోకి తెచ్చి పాఠకుల ముందు పెట్టడీకవి. అందుకే వీరి కవిత్వం పదునెక్కిన పదచిత్రాలతో లోతైన భావాలతో వస్తు విశ్లేషణతో పఠితల్లో వస్తువు యెడల అవగాహన స్పృహను కలిగిస్తూంటుంది. వీరి దీర్ఘకవిత 'జలగీతం' పరిశీలించినట్లయితే ఈ కవి జలాత్మను కవితాత్మకంగా మార్చిన తీరు వీరి కవితా ప్రజ్ఞను పట్టిస్తూంటుంది. పఠితల్లో జలస్పృహను కలిగిస్తూంటుంది.

'జలగీతం' దీర్ఘకవితలో భూగోళం మీద సంతులనం సన్నగిల్ల దానికి గల కారణాల్ని, వైజ్ఞానిక భూమికను ఆధారంగా చేసుకొని తాత్త్విక, మానవీయ దృక్పథంతో ఈ కవితను నడిపారు. నీటి అనంత యాత్రా ప్రక్రియని అద్భుతంగా ఆవిష్కరించిన దీర్ఘకవిత జలగీతం. ''నీటి పేరు వింటేనే నిలువునా తడిసిపోతాం!..నీటితనంతో ప్రాణులం/విద్యాతేజో విరాజితులమౌతాం'' అంటూ పాఠకుల మనో సాగరం మీద ఓ కవితా తరంగాన్ని సృష్టిస్తాడు కవి. భూమిని జలచర్మ ధారిణిగా మార్చిన వైనాన్ని ఎత్తిచూపుతూ ''నువ్వు స్పృశించగానే/వసుంధర నిత్య బాలింతగా మారింది/నువ్వు నిండిన ప్రతి జలాశయం/ఒక గర్భాశయమయ్యింది/ఏ సుదూర గగనాలు పంపిన/ఉపహార ప్రకాశానివి నువ్వు?'' అంటూ నీటి విహారంతోనే భూమి జలచర్మధారిణిగా మారింది అంటారు.

సముద్రాన్ని చూస్తూ/పర్వతాలు దిగులు మొగం పెట్టాయి/అచలంగా పడివున్న/ మా సంగతేమిట'నీ గీపెట్టాయి'' అప్పుడు జలమాత హృదయం ద్రవించి ''మేఘాలను పైకి విసిరేసింది/కదలని రాతి శిఖరాలకు/తలపాగాల్లా అమిరాయి మేఘాలు''. అంటే నీటి విహారం నేల నింగిమీదే కాదు, కొండ కోనల్లమీద కూడా వాయు రూపంలో వుంది అనేది కవి భావన.

నీరుని నిత్య చైతన్యశీలిగా అభివర్ణిస్తూ ''నీటి మార్పులు నిరుపమానాలు../ఆకాశం కాన్వాసు మీద/ అందమైన చిత్రాలన్నీ/నీటి చిత్రాలే/నీటికి మరణం లేదు/ స్వేచ్ఛగా కదిలే జలం/మంచు పలకల్లో బందీ అయ్యింది/విముక్తి ఎప్పుడో?/కాని ఇది నీటికి నిర్బంధం కాదు/ పరుల ఉపకారం కోసమే/ ఈ అవతారం'' నీరు ఎన్ని విధాలుగా రూపాంతరం చెందుతుందో వివరిస్తాడు కవి.

పంచ భూతాల నిర్మితమైన సమన్వితమైన ఈ ప్రపంచం సృష్టికి మాతృకగా భావిస్తూ ''నీరంటే నీరా/ఈ ధాతువు/మిగతా మిత్రుల మధ్య సేతువు/మేఘాల కళ్ళనుండి రాలే/ద్రవీభూత భాష్పాలే/నీటి పుష్పాలు/విద్యుత్ కాంతల విన్యాసాల సందుల్లోంచి/జారిపడే తేజఃపుంజాలు/నీటిలో నిప్పు నిక్షిప్తమంటే




యిదే!'' అగ్ని కూడా నీటి రూపంలో వున్న తీరు వివరిస్తాడు కవి. భూమికి పురుడు పోసేది నీరు. నింగికి వాయు రూపంలో వలసబోయిన నీరు వర్షం రూపంలో ఇంటికిఅంటే భూమిని తాకి ఆనంద పడుతుంది. పంటలు పండడానికి కారణభూతమవుతుంది.

''భూమి పొరల్లో/నీళ్లు చచ్చినట్లు పడివుండవు/ఎక్కడైనా/ప్రవాహం దానికి నైసర్గికం/నదీనదాలై/అడ్డంకుల్ని చీల్చుకొని పరుగెడతాయి/నిలువనీయనితనం నీటి గమ్మత్తు'' అంటూ నీటికి వున్న ప్రవాహ శీలతను వ్యక్తీకరిస్తాడు కవి.

మనిషి చేసే కాలుష్యం వలన ''ఈనాడు/నీరు కలత కలతగా రోదిస్తుంది/దళదళపరీత లేదనగా నినదిస్తుంది'' అంటారు. సకల సృష్టి సంగీతానికి/అపశ్రుతులు సమకూర్చుటేనా? ప్రగతి అంటారు. నింగి మనసు ఎడారిగా మారడం, మబ్బులు వాగ్దానాలు చేసి మాట తప్పడం, రైతు వర్షం కోసం ఆకాశానికి కళ్లతికించి కూర్చోవడం వర్ణిస్తూ కరువు కాటకాలకు నీటి యెద్దడే కారణంగా విశదీకరిస్తాడు కవి.

గాలి నీటి సఖ్యత వల్ల ఒక్కోసారి అనర్థాలు జరిగిపోతుంటాయి. తుఫాను పైశాచిక కృత్యానికి హద్దులు చెరిగిపోతుంటాయి. సముద్ర కెరటాలు తోకతొక్కిన త్రాచుల్లాగా బుసలు కొడుతూ ఊళ్లమీద విరుచుకుపడతాయి. చెలరేగిన తుఫాను శవాలకుప్పలకు కారణమవుతుంది. ప్రభుత్వాలు ప్రేక్షక పాత్ర వహిస్తాయి. నేరం ఎవరిది అయినా జీవజలం నిర్జీవజలంగా మారడాన్ని వివరిస్తాడు కవి. మనిషి చేస్తున్న అకృత్యాల వల్లే ప్రకృతి వైపరీత్యాలు జరుగుతాయి అనేది కవిభావన.

మనుషులు కలహాలతో విడిపోకముందే నదులను అనుసంధానం చేయడమే మంచిది అంటాడు కవి.

''గంగా''నది చారిత్రక జలాల్లో సాంస్కృతిక సౌధాలు ప్రతిఫలిస్తాయి/దాని అలల పొత్తిళ్లలో/జనించిన వీరగాథలు/ఉత్తేజాల వెలుగు వాదాలు'' అంటూ గంగానదిని వర్ణిస్తాడు కవి. మానవుని స్వార్థ తాడిత మయిన గంగ నిలువునా ఎండిపోతున్న తీరును వివరిస్తాడు కవి. ''ఇసుక బొంతలు కప్పుకొని/నిస్సత్తువతో మూల్గుతున్న గంగను గుర్తు చేస్తాడు కవి.

నేడు చెరువులు బాల్య స్మృతులుగా మారిపోతున్నాయి. చెరువులు నీళ్లు లేక కళేబరాలై పడివున్నాయి. చెరువంటే ''వర్షాధారలతో వేసిన/లక్షతానుల దుప్పటి కదా చెరువు'' అంటారు కవి.

నీటి పాటల్లో అపశ్రుతులు దొర్లబట్టే, నీటి గుండె కోతకు గురికావడం వల్లే పల్లెలు వలసబాట పట్టాయి. ''అనగనగా ఒక పల్లె/దశాబ్దాల తర్వాత వెళ్లి చూస్తే/అదిప్పుడు అక్కడ లేదు/లేదంటే లేదనికాదు/ ఊరుంది జనం లేరు/ఇళ్లకు తాళాలు/నిర్మానుష్య వీధులు/కూలిపోతున గోడలు/ ఈ నిశ్శబ్దం విషమంత భయానకమైంది'' అంటారు. ''దుర్భిక్షానికి సుభిక్షానికి మధ్యనున్న వ్యత్యాసమే నీటి విలువ కనుక నీటిని ధనంతో లెక్కించడం అమానుషం'' అంటారు కవి.

ప్రాణికోటి సొత్తయిన జలాలమీద స్వార్థం నీడలు పడుతున్నాయి. గుత్తాధిపతులకు నీటిని ధారాదత్తం చేస్తున్న ప్రభుత్వవైఖరిని ఖండిస్తాడు కవి. ''జలానికి గోడలు కడితే/జనం వేడెక్కుతుంది జాగ్రత్త!'' అంటూ హెచ్చరిస్తాడు కవి.

జలాన్ని కలుషితం చేయడం, అంగడి సరుకుగా మార్చడం చూస్తున్నాం. మనిషి ఇకనైనా మేల్కోవాలి, జలాదర్శాన్ని చాటి చెప్పే స్వచ్ఛ భాగస్వాంతులు కావాలి. జలశక్తిని వెలిగించాలి. అంతటా జలజీవకళలు వెల్లివిరియాలి. జలం విలువ తెలుసుకోవాలి. ప్రతిక్షణం జలక్షణం కావాలి, ప్రతి నిమిషం జలోన్మేషం కావాలి, ప్రతిక్రతువూ జలరుతువుగా జలభేరి మ్రోగించాలి. అదే మనిషి భవితకు దారిగా భావించాలి. భగవద్గీతలా జలవద్గీతతో జలరక్షణకు పూనుకున్న కవి యన్.గోపి. వీరి జలగీతం సుదీర్ఘకవితగా వైజ్ఞానిక భూమికగా తాత్త్విక చింతనతో మానవీయ కోణంతో సాహిత్యరంగంలో మొలిచిన అద్భుతమైన హరిత కవితా ప్రవాహంగా భావించవచ్చును. ●

**(నేడు ఎన్.గోపి ''జైనీ ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి జైనీ లక్ష్మీనారాయణ అవార్డు అందుకుంటున్న సందర్భంగా..)**

# వైవిధ్యాల కథానికలు



డాక్టర్ రాయారావు
సూర్యప్రకాశ్ రావు
9441046839

కాళోజీ అవార్డు గ్రహీత డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ కథానికలను కూడా రచించారు. మూసధోరణిలో కాకుండా వైవిధ్యభరితంగా వాటిని తీర్చిదిద్దడం విశేషం. చదువుకునే దశ నుండి ఆయన కథానికలు రాస్తున్నారు. తొమ్మిదో తరగతి చదివేటప్పుడు చందమామ పిల్లల పత్రికలో ప్రచురణార్థం 'రాజు కథ' అనే కథ రాశారు. అయితే ఆ కథ అచ్చురూపం లోకి రాలేదు.

వేణుగోపాల్ రాసిన కథానికల్లో వస్తువైవిధ్యం కనబడుతుంది. స్నేహితుడిని మోసం చేసిన డబ్బులతో వ్యాపారం ప్రారంభించడం, తనను గుర్తుపట్టకుండా ఉండడం కోసం అతడిని మరో ప్రాంతానికి పంపే ప్రయత్నం చేయడం 'వంచన' కథావస్తువు. కేర్‌టేకర్ కావాలన్న ప్రకటనకు స్పందించి, దరఖాస్తు చేసుకున్న యువకులు అమ్మాయికి కేర్‌టేకర్‌గా ఉండొచ్చని ఆశ పడితే ఆఖరికి కుక్కకు కేర్‌టేకర్‌గా ఉండడం ఆ ఉద్యోగం అని తెలిసి నివ్వెరపోవడం 'పూవులో ముళ్లు' కథానికలో వస్తువు. మానవ సంబంధాలను ఆర్థిక సంబంధాలు ఏ విధంగా ప్రభావితం చేస్తాయో విస్పష్టంగా చెప్పిన కథానిక 'పిచ్చితల్లి'. ప్రలోభాలకు గురై వెళ్ళిపోయిన భార్యను భర్త తిరిగి స్వీకరించడం 'విలువలు' కథానిక వస్తువు. అత్తగారింటి హింసలకు కోడలు బలైన సంఘటనను 'పువ్వురాలు కాలం' కథానిక చిత్రించింది.

ఈ కథానికల్లో పాత్రలను చిత్రించిన తీరు అబ్బురపరుస్తుంది. ఆయా పాత్రలను సమగ్రంగా మలచడం కనబడుతుంది. 'వంచన' కథానికలో నారాయణ తను పనిచేసిన హెల్ యజమానిని, గోవిందును మోసం చేస్తాడు. కుంతి వీరప్పను ప్రలోభపరిచి గోవిందును అడ్డం తప్పించేందుకు పావుగా వాడుకుంటాడు. 'పిచ్చితల్లి' కథానికలో అవ్వ మానసిక వ్యాధికి లోనవుతున్న దశను పట్టిచూపే యత్నం సమర్థవంతంగా చేశారు. తొమ్మిదేళ్లు పెంచి పెద్ద చేసిన అనంతరం మనవరాలు చూపిన ప్రేమరాహిత్యాన్ని అవ్వ తట్టుకోలేక పోతుంది. ఆ అవ్వ మానసిక చిత్రణ కథానికకు చక్కటి రూపునిచ్చింది. మొక్కలను పీకేయడం, కుండలోని నీళ్లను తనమీద గుమ్మరించుకుని కుండ పగులగొట్టడం ఆమె మానసిక వ్యాధి లక్షణాలను చూపించే ఘటనలు. అవసానదశలో తనకు లక్ష్మి సహాయంగా ఉంటుందని దొరసాని ఆ పాపను ప్రలోభపర్చడం, ఆ ప్రలోభాలకు లక్ష్మి లోనుకావడం మనుష్యుల స్వార్థ చింతనకు దృష్టాంతాలు.



డా.అమ్మంగి వేణుగోపాల్
సాహిత్య స్వర్ణోత్సవం తేది. 3-02-2018

నిరుద్యోగం వల్ల మాధవరావు ఎదుర్కొన్న ఛీత్కారాలు, అతని మిత్రుడు విష్ణుమూర్తి టేక్ ఇట్ ఈజీ పాలసీ, కొత్తాపాతా తారతమ్యం లేని నళినీరావు కలుపుగోలుతనం చక్కగా చిత్రించిన కథానిక 'పూవులో ముళ్లు'.

కాలేజీ దశ నుండి రాజు లోని మంచితనాన్ని చూపే ప్రయత్నం చేసిన కథానిక 'విలువలు'. పెళ్ళి తర్వాత తన భార్య ప్రజ్ఞ తనను విడిచిపెట్టి వెళ్ళిపోవడం లోనూ తన తప్పు ఉందని చెప్పుకునే చక్కటి వ్యక్తిత్వం రాజు సొంతం. తనను వదిలివెళ్ళిన భార్యను తిరిగి స్వీకరించి, మంచితనానికి పరాకాష్ఠగా నిలిచాడు.

పూలను అమితంగా ప్రేమించే నైజం ఉన్న ఉమలోని సున్నిత మనస్సురాలిని చిత్రించిన కథానిక 'పువ్వురాలు కాలం'.గోడలో మొలిచిన గడ్డిమొక్కకు పూసిన నీలం రంగు పూలను ఉమ తదేకంగా చూడడం ద్వారా ఉమకు పూలపై ఉన్న పిచ్చి వ్యామోహం పాఠకులకు తెలుస్తుంది. కోడలిని హింసించే అత్త, రెండో పెళ్ళికి సిద్ధమైన భర్త శ్రీశైలం కుటిల స్వభావాలు కళ్లకు కట్టినట్టు చిత్రించారు రచయిత.

అమ్మంగి వేణుగోపాల్ కథానికల్లో వర్ణనలు వస్తు ప్రాధాన్యతను ఇనుమడింపజేస్తాయి. 'వంచన' కథానికలో నారాయణ హెల్ సమీపంలోని వంతెన, మురికి వాగుల వర్ణన ద్వారా అక్కడి వాతావరణాన్ని తెలియపరుస్తారు. గుడిసె నుండి మేడకు దారిని వివరించడమూ వస్తు ప్రాధాన్యతను పెంచేందుకు చేసే యత్నమే. 'పూవులో ముళ్ళు' కథానికలో వదినెపై మాధవరావు అభిప్రాయాలను చిన్న చిన్న వాక్యాలతో వర్ణించారు. 'బేబీ' అనే కుక్క అందాన్ని మిసెస్ నళినీరావుచే వర్ణింపజేశారు. ఈ వర్ణన 'బేబీ' అంటే అమ్మాయే అనేంత స్థాయిలో ఉండడం మాధవరావు, విష్ణుమూర్తిలతో పాటు ప్రేక్షకులను కూడా పక్కదారి పట్టించేందుకు వేణుగోపాల్ చేసిన ప్రయత్నమే. తద్వారా కథనంలో బిగిని ఏమాత్రం సడలనీయకుండా నడిపిస్తారు రచయిత. 'బేబీ' ఎవరనే సందేహంతో చివరివరకు పాఠకుడిని చదివింపజేస్తారు.

పర్యావరణంపై సానుకూల దృష్టి అమ్మంగి వేణుగోపాల్‌కు ఉంది. ఈ విషయం ఆయన రాసిన కథానికల్లో గమనించవచ్చు. పైన పేర్కొన్న కథానికల్లోనూ రెండింటి పేర్లలో పూలున్నాయి.'పువ్వురాలు కాలం', 'పూవులో ముళ్లు' అనే పేర్లు పెట్టడం పర్యావరణంపై ఆయనకు ఉన్న ప్రేమకు నిదర్శనం. పర్యావరణ ప్రేమికుడికి మొక్కలంటే అమిత ప్రేమ ఉంటుంది. వారి దృష్టిలో మొక్కలను పీకేయడమంటే మరణించినట్టే. ఈ ప్రతీకనూ తన కథానికల్లో ఉపయోగించుకున్నారు. 'పిచ్చితల్లి' కథానికలో మొక్కలను పీకేయడం ద్వారా అవ్వ దృష్టిలో లక్ష్మి మరణించినట్టేనని సమర్థవంతంగా చెప్పారు. 'పువ్వురాలు కాలం' కథానికలో మొక్కలను దున్నపోతు ధ్వంసం చేస్తుంది. దీని ద్వారా ఉమ మరణానికి ఆమె భర్తే కారకుడని చెప్పగలిగారు. 'పువ్వురాలు కాలం' కథానికలో పూలకు సంబంధించిన వివిధ పోలికలను వాడారు. ఈ విధంగా పర్యావరణానికి సంబంధించిన వివిధ అంశాలను తన కథానికల్లో వాడుకుని, తనకు పర్యావరణంపై ఉన్న ఆసక్తిని వెల్లడిచేశారు రచయిత.

కథానికలకు పేర్లు పెట్టడంలోనూ వేణుగోపాల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మోసం కథావస్తువుగా ఉన్న కథానికకు 'వంచన' అని నేరుగా కథావస్తువు ధ్వనించే పేరు పెట్టారు. పిచ్చిగా పిల్లలను ప్రేమించే సున్నిత మనస్కులు ఆ పిల్లలు మానసికంగా దూరమైతే ఎలా బాధపడతారో చెప్పే కథానికకు 'పిచ్చితల్లి' అనే పేరు తీసుకున్నారు. పువ్వులంటే అమితంగా ఇష్టపడే పువ్వులాంటి ఉమ నేలరాలిపోయే కథానికకు 'పువ్వురాలు కాలం' అనే పేరు పెట్టారు. 'విలువలు' అనే పేరు పెట్టడం ద్వారా విలువలను త్రికరణశుద్ధితో ఆచరించాలనే సందేశం కథానికలో ఉంటుందని తెలియజేస్తారు. అమ్మాయిలను పూలతో పోలుస్తారు. మంచి భావనలను సైతం పూలతో పోల్చవచ్చు. అందుకే అమ్మాయిగా భావించిన బేబీ చివరికి కుక్క అని తేలే సన్నివేశంతో కూడిన కథను 'పూవులో ముళ్లు' గా పేర్కొన్నారు.

చెప్పబోయే అంశాన్ని పాఠకులకు నెమ్మదిగా ఇంజెక్ట్ చేసేందుకు కథానికల ప్రారంభాన్ని ఉపయోగించుకుంటారు వేణుగోపాల్. 'పూవులో ముళ్లు' కథానిక ఆరంభంలోనే మాధవరావు తన ఇంజనీరింగ్ సర్టిఫికెట్‌ను ఆనందంగా చూసుకుంటుంటాడు. అతని పెద్దన్నయ్య అతని డిగ్రీ వృథా అని విమర్శిస్తాడు. దీంతో ఇది ఒక నిరుద్యోగికి చెందిన కథగా పాఠకులకు అవగతమౌతుంది. 'వంచన' కథానిక ఆరంభం వంతెన పరిసర ప్రాంతాలను వర్ణించి కథానిక స్థలాన్ని పాఠకుడికి పరిచయం చేస్తుంది. 'పిచ్చితల్లి' కథానిక ఆరంభం వర్షాలతో నీటిమయమైన గుడిసెను, అందులోని అవ్వ, పాపల పరిస్థితిని వివరిస్తుంది. తద్వారా వారి పేదరికాన్ని గురించి చెప్పడం రచయిత లక్ష్యం. పాప లక్ష్మి మనసు మారడం వెనుక అసలు కారణం పేదరికమే. 'విలువలు' కథానిక ఆరంభంలో ఎంతో కాలంగా వెతుకుతున్న పుస్తకం దొరకడాన్ని పేర్కొని, తర్వాత మిత్రుడు కలుస్తాడన్న సూచన చేస్తారు రచయిత. మంచి పుస్తకం ఉత్తమ స్నేహితుడితో సమానం కదా! 'పువ్వురాలు కాలం' కథానిక ఆరంభంలో ఉమ తరగతికి కొత్తగా వచ్చిన ఉపాధ్యాయుడు అటెండెన్స్ తీసుకుంటూ 'ఎస్.ఉమ' అనే పేరులోని అక్షరాల్ని కలిపేసి 'సుమ' అంటాడు. తద్వారా ఉమకు ఆ పేరంటే ఇష్టమని పేర్కొనడం రచయిత ఉద్దేశ్యం. పూవులన్నా, పూలకు సంబంధించినవేవైనా ఆమెకు ప్రాణమని రచయిత ఈ సన్నివేశం ద్వారా తెలియపరుస్తారు. ఈ విధంగా కథానికల ఆరంభం కథాంశానికి చక్కని పునాదిని ఏర్పర్చడం అమ్మంగి వేణుగోపాల్ కథానికల స్వభావం.

అమ్మంగి వేణుగోపాల్ కథానికల్లో తప్పకుండా చెప్పుకోవలసిన అంశం ముగింపు. ముగింపులో మెలికలు గానీ, ప్రతీకలుగానీ తప్పనిసరిగా ఉంటాయి. కరుణ రసమో,హాస్యరసమో తొణికిసలాడుతుంది.

'పిచ్చితల్లి' కథానిక లక్ష్మికి అవ్వ దూరంగా వెళ్ళడంతో ముగుస్తుంది. 'పండు రాలిపోతే రాలిపాయె, పూతను రాలగొట్టకు పుణ్యముంటది' అని తాను చనిపోయినా మనవరాలికి ఏమీ కాకూడదని మొదట్లో దేవుడిని ప్రార్థించిన అవ్వ కథానిక చివరికొచ్చేసరికి తద్భిన్నంగా ప్రవర్తిస్తుంది. లక్ష్మి చనిపోయినట్టుగా భావిస్తుంది. కథానిక ముగింపు ప్రతీకాత్మకంగా ముగుస్తుంది. ఈ ముగింపులో అక్కడక్కడా ఉన్న చిన్న చిన్న మొక్కలను అవ్వ పీకేస్తుంది. మూకో నీళ్ల కుండ ఉంటే తన తల మీది నుండి నీళ్లు గుమ్మరించుకొని, ఖాళీ కుండను నేలకేసి కొడుతుంది. చెల్లాచెదురైన కుండ పెంకులను ఏరి తనగంతలో కట్టుకుంటుంది. ఈ ప్రతీకల ద్వారా లక్ష్మి ఇక తన దృష్టిలో చనిపోయినట్టేనని అవ్వ చెప్పకనే చెప్పినట్టు పాఠకునికి తెలిసిపోతుంది. ఆ విధంగా లక్ష్మికి నీళ్ల వదిలింది అవ్వ.


'వంచన' కథానిక ముగింపులో తనమనస్సు పూర్తిగా తేలికపడిందని, తన మోసాన్ని గుర్తించే గోవిందు బాధ ఇక లేదని నారాయణ సంతృప్తిపడతాడు. ఈ విషయాన్ని 'ఆ రోజు ఎంత గిరాకి అయిందో తెలుసుకోడానికి నోట్లు లెక్కపెట్టసాగాడు' అనే వాక్యంతో ప్రతీకాత్మకంగా చెప్పారు రచయిత.

'పూవులో ముళ్లు' కథానిక చక్కటి మెలికతో ముగుస్తుంది. మాధవరావు, విష్ణుమూర్తి సహా పాఠకులు కూడా 'బేబీ' అంటే మిసెస్ నళినీ రావు కూతురే కావచ్చనుకుంటారు. కథానిక చివరికొచ్చేసరికి కుక్క అని తెలిసి ఆశ్చర్యంలో మునిగిపోతారు పాఠకులు. 'విలువలు' కథానిక గార్డు పచ్చజెండా ఊపడం అనే ప్రతీకతో ముగుస్తుంది. రాజుప్రజ్ఞల కొత్త జీవితానికి ఊపిన పచ్చజెండాయే అది.

'పువ్వురాలు కాలం' కథానిక కూడా ప్రతీకలతోనే ముగుస్తుంది. అత్తగారింటికి శ్రీశైలం వెళ్ళినప్పుడు దున్నపోతు మల్లెపందిరిని నేలమట్టం చేస్తుంది. ఇతర పూలమొక్కలపై కూడా ప్రతాపం చూపిస్తుంది. ఆ మల్లె పందిరి ఉమ. దున్నపోతు శ్రీశైలం. అతను చేసిన జీవన విధ్వంసాన్ని ప్రతీకాత్మకంగా చెప్పారు రచయిత. అతను తన భార్య ఉమ అంత్యక్రియలు చేయడంతో విషాదాంతంగా ముగుస్తుంది ఈ కథానిక.

అమ్మంగి వేణుగోపాల్ రచించిన కథానికల్లో వైవిధ్యం సుస్పష్టంగా కనబడుతుంది. ఆయన సాహిత్య స్వర్ణోత్సవం ఫిబ్రవరి మూడున జరుగనున్నది. ఈ సందర్భంలో ఆయన సాహిత్య సృజనను ఒకసారి అవలోకిస్తే విభిన్న ప్రక్రియల్లో విస్తృతంగా కృషి చేసిన అమ్మంగి కథానిక రచనపై పెద్దగా దృష్టి పెట్టకపోవడం లోటుగా కనబడుతుంది. కథానిక రచనపై ఆయన దృష్టి కేంద్రీకరిస్తే జాతీయ స్థాయి అవార్డుల కథకుడు మనకు లభించేవారు. ●

## ఎవుసమంటే



ఎవుసమంటే బక్కాయిటి తోటి దున్నటం కాదు
ఎవుసమంటే ఒక్క పంట పండించటం కాదు
ఎవుసమంటే మనం బతికి నలుగురికి బతుకు నివ్వటం
పలువురిని సాకి సవరించటం సబ్బండ వర్గాల మంచి చెడ్డ
సకల జీవుల సమాదరణ అన్నింటి మనుగడ
సమాజం దొడ్డికి పనుగడి పెట్టి
అన్నింటికీ అందరికి సమపాల్లలో మేతేయడం
పట్టుగూడుపు పిల్లలు అనాథ
జెల్లలు అరువందం కాకుండా చూడడం
దొంగాయిటికి మెడలో గంట కట్టడం
దుంకి దుమికి పొడిచి తన్ని ఉన్నదంతా
తినేవాటికి లెంకపీట కట్టడం
పనగడి ఇరుగదొక్కి పంటలన్నీ
పాడుచేసే వాటికి కాలుమెడకి పెట్టడం
మోరుదోపు వాటికి ముక్కుతాడేయడం ఎద్దేయటం
బుద్ధిచెప్పటం
కోడేకారుకి పని నేర్పడం
ఎత్తుపడ్డ మెత్తగాల్ల బక్కాయిటికి ఆసరా ఇవ్వటం
పక్కాగా నిక్కచ్చిగా నిజం చెప్పాలంటే
మల్ దాదా ఒరవడితో ఊరు ఊరంతా చెమ్మదిగిది ఆడించి
ఆరోగ్యం పంచి ఆయుస్సు పెంచి పాడి పంటలతో
అలరించటం

**గులాబీల మల్లారెడ్డి 9440041351**

## భావ భవిత లేని కవిత

భావ సారం లేని శాలువా
కోసమో ఆత్మీయత లేని
సన్మానం కోసమో చేసే
అక్షర సేద్యం
అడవి గాసిన వెన్నెలనే
ఆ అక్షరం శోకిస్తుంది...

పేరు కోసమో ప్రశంసాపత్రం
కోసమో
మట్టి జీవుల కష్టాలు పట్టని,
ప్రజాపక్షం వహించని కలం
సముద్రాన కురిసిన వర్షమే
కలం కన్నీరు పెడుతోంది...

ఆన్నార్థులను ఆదుకోని
అవార్డుల కోసమో
అభిమాన తీపి లేమి
అభినందనల కోసమో
రాసే కవితలు బూడిదలో
పోసిన పన్నీరే
కవిత కలవర పడుతోంది

చరిష్మా కోసమో
జీవం భావం లేని బలవంత
మొహమాటపు
చప్పట్ల కోసమో చేసే రచనలు
ఐశ్వర్యమున్నా
అనుభవించలేని సాహితీ
అనారోగ్య గ్రస్థుడు
సాహిత్యం స్వీయహత్యకు
పూనుకుంటోంది...

రివార్డుల కోసమో రికార్డుల
రిమార్కుల కోసమో పుస్తక
పుటలు పెంచుకోవటానికి రాసే
రాతలు
నీరు లేనిబావి వంటిదే
మోడువారిన చెట్టు లాంటిదే
రాతలు గుండె
కోతలవుతన్నయి

మైకు పట్టటానికో ఫేసుబుక్కులో
లైకు కొట్టటానికో
చేసే కవితా గానం
మూగ జీవుల మధ్య చేసే
అరణ్యరోధనే
తిట్ల దండకానికో
సిగపట్లతో చండాడటానికో
పదబందాలను బంధించటం
పద వదనం చిన్న బోతుంది

**యాదయ్య కొప్పోలు**
**9494273703**

## 'అమోహం'కు ఉమ్మడిశెట్టి పురస్కారం

ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న ఉమ్మడిశెట్టి సాహితీ పురస్కారం 2017సం॥నకు గాను శ్రీ సుధ మోదుగు రాసిన 'అమోహం' కవితా సంపుటి ఎంపికైంది. ఈ పురస్కారాన్ని మూడు దశాబ్దాలనుండి వరుసగా ఇస్తున్నారు. ఈ సంవత్సరపు ఎంపికలో న్యాయనిర్ణేతలుగా కొప్పర్తి వెంకట రమణమూర్తి, మేడిపల్లి రవికుమార్, ఆర్.సీతారాం వ్యవహరించారు. అనంతపురంలో నిర్వహించబోయే సభలో ఈ అవార్డు ప్రదానం చేస్తారు.


## నోరి నరసింహశాస్త్రి పురస్కారాలు

ఆచార్య అనుమాండ్ల భూమయ్యకు నోరి నరసింహశాస్త్రి ఛారిటబుల్ ట్రస్టు వారందించే నోరి నరసింహశాస్త్రి పురస్కారం ఫిబ్రవరి 6న హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా నోరి యువ రచయిత ప్రోత్సాహక పురస్కారాన్ని డాక్టర్ బోచ్కర్ ఓం ప్రకాష్‌కు అందిస్తారు.

## అక్షరాల తోవ కథల పోటీ

అక్షరాలతోవ – ఖమ్మం వారు ఉగాది సందర్భంగా జాతీయ స్థాయి కథల పోటీని నిర్వహిస్తున్నారు. తెలుగు వారి నేపథ్యంగల కథ ఎ–4 సైజు పేపర్‌లో ఐదు పేజీలకు మించకుండా హామీపత్రం జతపరచి పంపాలి. ఎంపికైన 4కథలకు వరుసగా రూ.4వేలు, 3వేలు, 2వేలు, ఒక వేయి బహుమతులు వుంటాయి. ఫిబ్రవరి 10లోపు ఈ చిరునామాకు కథలు పంపాలి. దాసరాజు శ్రీనివాస్, #11–9–166/1, లెనిన్ నగర్, అసాధారణ హస్పిటల్ వెనుక, ఖమ్మం–507001, సెల్:9010972169

## కొంగు బంగారాలు గిరిజన దైవాలు



గిరిజన దైవాలు
అనంత సంప్రదాయాలు
సమ్మక్క సారలమ్మలు
వనదేవతా మూర్తులు
పన్నెండుకు కట్టాలని
పౌరుషాగ్నిని రగిలించిన
లేడి సింహాలు
యుద్ధభూమి కోసం సిద్ధపడిన
గిరిసింహ కేతనాలు వాళ్ళు
ఓరుగల్లును పోరుగల్లు చేసింది ఆ సమరం
ఆ రణరంగంలో రక్తం
జంపన్నవాగై పారించినరు
కప్పంకోసం కుప్పకూలిన
ఆ వీరవనితల రక్తం
అక్కడి మట్టినంతా తడిపింది
తడిసిన ఆ రక్తమే అక్కడ
కొత్త రూపమై మొలకెత్తింది
ఆ ప్రాంత చెట్లకు పౌరుషాన్ని నేర్పింది
అక్కడి మట్టి అణువణువుకు
భక్తిని ముక్తిని ప్రసాదించింది
శిస్తును ధిక్కరిస్తూ
దివికెగిసిన ఆ మండే అగ్నికీలలు
రెండేళ్ళకొకసారి ఉదయకాంతులై వస్తామన్నారు
అందుకే జనం అక్కడికి తండోపతండాలుగా పోతరు
కష్టాలు, సుఖాలు కలబోసుకొని ఆ అమ్మలకు యాదిజేస్తరు
మొక్కిన ముడుపులను అప్పజెప్తరు
సల్లంగా తల్లులు దీవించి సాగనంపుతరు

**బైరపాక స్వామి, సెల్ : 9951828781**



# వాట్స్‌యాప్ గుప్పెట్లో ప్రపంచం

**క్యాపిటల్, మార్కెట్ వంటివి లేకున్నా విజయాన్ని సొంతం చేసుకోవచ్చునని నిరూపించారు వాట్స్‌యాప్ రూపకర్తలు జాన్‌కాన్, బ్రియాన్ ఆక్టన్‌లు. ఎంతో మంది యువకులకు ఆదర్శంగా నిలచారు. ప్రొడక్ట్, సర్వీసెస్ కరెక్ట్‌గా ఉంటే ఎటువంటి పబ్లిసిటీ లేకుండా ప్రజలు మన దగ్గరకు వస్తారని రుజువుచేశారు. ప్రపంచంలో కోట్లాది మందికి ఇప్పుడు వాట్స్‌యాప్ లేకుంటే గంట కూడా గడవని పరిస్థితి. అసలు వాట్స్‌యాప్‌ను ప్రపంచానికి అందించినవారి సక్సెస్ స్టోరీ తెలుసుకుందాం...**



బ్రియాన్ ఆక్టన్

జాన్‌కాన్

ఒక చిన్న మొబైల్ యాప్‌తో కమ్యూనికేషన్ రంగంలో పెద్ద సంచలనమే సృష్టించారు జాన్‌కాన్, బ్రియాన్ ఆక్టన్‌లు. వీరు స్థాపించిన కంపెనీయే ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో వాడుతున్న వాట్స్‌యాప్. ప్రస్తుతానికి వాట్స్‌యాప్ నెలకు 1.2 బిలియన్ యాక్టివ్ యూజర్స్‌తో ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ 30 బిలియన్ మెసేజ్‌లను చేరవేస్తోంది. రూపకర్తల్లో ఒకరైన జాన్ 1976 ఫిబ్రవరి 24న యుక్రెయిన్‌లోని గ్రామీణ ప్రాంతంలో జన్మించాడు. ఆర్థికంగా కష్టాలు ఎదుర్కొంటున్న జాన్, తన తల్లితో కలిసి 1992లో కాలిఫోర్నియాలోని మౌంట్‌వ్యూకి చేరుకున్నాడు. అక్కడ వారికి ఒక సోషల్ సపోర్ట్ ప్రోగ్రాం సహాయం అందించింది. వారి సాయంతో జాన్ ఒక డబుల్ బెడ్‌రూం ఫ్లాట్‌ను పొందాడు. ఉద్యోగ వేట ప్రారంభించాడు. అతడికి ఓటమి కొత్తేమీ కాదు. పెద్ద పెద్ద కంపెనీలన్నీ తనను రిజక్ట్ చేశాయి. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాడు. ఆ సమయంలోనే తనకు ఇష్టమైన కంప్యూటింగ్ నెట్‌వర్క్‌ను నేర్చుకోవడం మొదలుపెట్టాడు. మాన్యువల్స్‌ను చదువుతూ నాలెడ్జ్‌ను పెంచుకుంటూ పోయాడు. ఇల్లు గడవటం కోసం ఓ గ్రోసరీ స్టోర్‌లో క్లీనర్‌గా జాయినయ్యాడు. ఇంతలో తల్లి క్యాన్సర్ బారిన పడింది. అయినా కుంగిపోలేదు. కష్టాలే ఆయన్ని రాటుదేల్చాయి. రెండేళ్లలోనే కంప్యూటర్ గురించి బాగా ట్రైయిన్ అయిన జాన్ తన తర్వాతి టాస్క్‌ను సెట్ చేసుకోవాలనుకున్నాడు. అదే తనను ప్రోగ్రామింగ్ వైపునకు మళ్లించింది. ఈ అభిరుచితో శాన్‌జోస్ యూనివర్సిటీలో చేరాడు. ఓ పక్కన చదువుకుంటూనే మరో పక్క ఓ కంపెనీలో సెక్యూరిటీ టెస్టర్‌గా పనిచేశాడు. ఆరునెలలు పనిచేసిన తర్వాత జాన్‌కు యాహూలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీర్‌గా పెద్ద అవకాశం వచ్చింది. వెంటనే జాయినయ్యాడు. అప్పటికీ చదువుకుంటూనే ఉన్నాడు. యాహూ కంపెనీ కూడా మిగతా కంపెనీల్లాగా స్టార్టప్ పొజిషన్‌లోనే ఉంది. ఉద్యోగం రావడంతో చదువుకు మధ్యలోనే ఫుల్‌స్టాప్ పెట్టేశాడు. 2000లో తల్లి క్యాన్సర్‌తో కన్నుమూసింది. ఒంటరితనం అనుభవించేవాడు. ఆ సమయంలోనే స్నేహితుడైన బ్రియాన్ ఆక్టన్, జాన్‌ను తనతోపాటు సాకర్‌లాంటి ఆటలకు తీసుకెళ్లేవాడు. ఇద్దరూ యాహూలో 9ఏళ్లు కలిసి పనిచేశాడు . ఎంతో టెక్నికల్ నాలెడ్జ్ సంపాదించుకున్నారు. 2009 జనవరిలో ఐఫోన్ కొన్నాడు జాన్.

ఏడు నెలలు పాతదైన యాప్‌స్టోర్ పూర్తి రేంజ్ యాప్స్‌ను విడుదల చేయాలనే ప్రయత్నంలో ఉన్నారనే విషయాన్ని తెలుసుకున్నాడు. వెంటనే వాట్స్‌యాప్ ఆలోచనకు శ్రీకారం చుట్టాడు. తను రూపొందించే యాప్‌లో కొన్ని నిబంధనలు విధించుకున్నాడు. అవేమంటే తమ యాప్‌లో ప్రకటనలు ఉండకూడదు. ప్రజలను శాటిస్‌ఫై చేసేలా ఉండాలి. కస్టమర్ల ప్రైవసీకి ఎటువంటి ఇబ్బంది ఉండకూడదనేవి. అందుకే ఈ ప్రొడక్ట్ మెసేజ్‌లను సేవ్ చేసుకోకుండా తయారుచేశారు. అంతేకాకుండా ఎటువంటి ట్రిక్స్ లేకుండా ప్రొడక్ట్‌ను డెలివరీ చేశారు. ఫిబ్రవరి 24, 2009న తమ ప్రొడక్ట్‌కి వాట్స్‌యాప్ అని పేరు పెట్టారు. అంతలో యాప్‌లోని కొన్ని లోపాలను గమనించారు. వాట్సయాప్ క్రాష్ అవడం, ఒక్కోసారి స్టక్ అవ్వడం చూసి జాన్ నిరాశకు లోనయ్యాడు. కానీ బ్రియాన్ అండగా నిలబడి ధైర్యం చెప్పాడు. మరికొన్ని నెలలు ఇద్దరూ కల్సి పనిచేశారు దానిమీద. తర్వాత యాపిల్ నుంచి సహాయం అందింది. వారు పుష్ నోటిఫికేషన్‌లను వాట్స్‌యాప్‌నకు అందించారు. అప్పటికీ కూడా పెద్దగా గ్రోత్ కనిపించలేదు. జాన్ తన మిత్రుడు బ్రియాన్‌ను తన కంపెనీకి రమ్మని పిలిచాడు. బ్రియాన్ యాహూలో ఉన్న స్నేహితులతో కల్సి రెండు లక్షల యాభైవేల డాలర్లను ఫండింగ్‌గా తీసుకొచ్చాడు. ఇదే బ్రియాన్‌ను వాట్స్‌యాప్‌కు కోఫౌండర్‌ను చేసింది. అప్పటి నుంచి వీరికి తిరుగులేకుండా పోయింది. 2014లో వాట్స్‌యాప్ ఊహించని స్థాయికి వెళ్లింది.

ప్రపంచవ్యాప్తంగా ఈ మెసేజింగ్ సర్వీస్ కోట్లాదిమందిని సొంతం చేసుకుంది. ఇప్పటివరకూ వీరు ఈ యాప్ గురించి ఎక్కడా ప్రమోట్ చేయలేదు. ఎటువంటి ప్రచారం లేకుండా ప్రపంచం మొత్తం చేరుకుంది. 55 మంది ఉద్యోగులతో కోట్లాది మంది ప్రజలకు సేవ చేస్తున్నారు వీరు. అదే ఏడాది ఫేస్‌బుక్ వాట్స్‌యాప్‌ను కొంటున్నట్లు ప్రకటించింది కూడా. ప్రపంచంలోని అతిపెద్ద ఆక్విజేషన్లలో ఇది కూడా ఒకటి. 19 బిలియన్ డాలర్లకు ఈ యాప్‌ను ఫేస్‌బుక్ కొన్నది. అంతేకాకుండా జాన్‌కు ఫేస్‌బుక్ బోర్డ్ మెంబర్‌షిప్ లభించింది. ఫేస్‌బుక్ టేకోవర్ కాంట్రాక్ట్‌ను సిలికాన్‌వ్యాలీలోని ఒక అమ్యూజ్డ్ బిల్డింగ్‌లో సైన్ చేశాడు జాన్. ఒకప్పుడు తన తల్లి కోసం ఫుడ్ స్టాంప్స్ కోసం నిలబడ్డాడు. అదేచోట ఒక కంపెనీకి ఓనర్‌గా మారాడు జాన్. జీవితం వడ్డించిన విస్తరి కాదని, అవకాశాలు వెతుక్కుంటూ రావని అంటారు వీరు. కష్టపడటం ఒక్కటే జీవితంలో సెటిల్ అవడానికి మార్గమంటున్నారు. ఈ మార్గంలో నీతి, నిజాయితీలను మాత్రం వదలకూడదని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు జాన్‌బ్రియాన్‌లు.

# చెప్పులతో దిష్టి పోతుందట!!

అది మెహిదీపట్నం బస్‌స్టాప్ దగ్గర్లోని ఓ చిన్న చెప్పుల షాపు. చిన్న చిన్న చెప్పులు కుడుతూ హరికర్‌దమ్ కనిపిస్తుంటాడు. చాలా మంది ప్రయాణికులు అతని పనితనాన్ని ఆసక్తిగా గమనిస్తున్నారు. అంతగా అక్కడేం ఆకట్టుకుంటుందంటే... ముద్దుగా, అందంగా ఉండే లెదర్, చెక్క, రబ్బర్‌తో తయారుచేసిన చిన్నచిన్న చెప్పులు. ఆ చెప్పులు తయారుచేసే చెప్పుల షాపు యజమానిని మన తెలంగాణ పలకరించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన హరి కర్‌దమ్ హయత్‌నగర్‌లో ఓ కిరాయి ఇంట్లో కుటుంబంతో కల్సి ఉంటున్నాడు. తండ్రి కూడా ఈ వృత్తే కొనసాగించాడు. ఏడుగురు సంతానంలో హరి ఒకడు. ఇద్దరు చెల్లెళ్ల పెళ్లి చేయడానికి డబ్బు సంపాదించడం కోసం, ఉపాధి వెదుక్కుంటూ నగరానికి వచ్చాడు. ఇక్కడి ప్రభుత్వ సహకారంతో ఆధార్ కార్డు, రేషన్‌కార్డులను పొందాడని చెప్పాడు. ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగోలేక చదువుకోలేకపోయినట్లు, అందువల్ల ఈ వృత్తినే నమ్ముకున్నట్లు తెలిపాడు. బాబు సర్కారు బడిలో మూడో తరగతి చదువుతున్నట్లు చెప్పాడు. పాప చిన్నది. ఇంత చిన్న చెప్పులు తయారు చేయడానికి కారణమేంటని అడిగితే... " చిన్నతనంలోనే చదువు మానేసా.





దాంతో ఇదే వృత్తిలో ఏదైన కొత్తగా చేయలన్న ఆలోచనతో చిన్న చెప్పులు తయారు చేస్తున్నాను. వీటికి మార్కెట్లో చాలా డిమాండ్ ఉంది. లారీలు, బస్సులు ఇలా భారీ వాహనాలకు, కొత్తగా గృహ నిర్మాణాలు చేస్తున్నవారు వీటిని కొనుగోలు చేస్తుంటారు. ఎందుకంటే... వీటిని ఇల్లు, లారీ, బస్సుల ముందు భాగంలో కట్టడం ద్వారా నరదిష్టి తొలగిపోతుందని వారి నమ్మకం. వీటి ధర రూ.100 నుంచి రూ. 200 వరకు విక్రయిస్తాను. చిన్న పిల్లలు ఆడుకునే బొమ్మలకి, ఇంట్లో షోకేజ్‌లో పెట్టుకోవడానికి వీటిని కొంటుంటారు. ఒక రోజు మొత్తం కష్టపడితే రూ. 400 నుండి రూ. 500 వరకు సంపాదిస్తాను. అయినా ఇల్లు గడవటానికి చాలా ఇబ్బందిగా ఉంది. నేను చదువుకొని ఉంటే షుగర్, కీళ్లనొప్పులున్న వారికి ప్రత్యేకమైన పద్ధతిలో చెప్పులు తయారుచేయడానికి ఆలోచించేవాడిని" అని అన్నాడు.

# ప్రజాసేవే మాధ్యేయం



పెరుగుతున్న టెక్నాలజీతో పాటు యువత ఆలోచనలో కూడా చాలా మార్పులు వస్తుంటాయి వాటిలో నుంచి పుట్టిందే "వి మ్యాక్స్ ఈ సొల్యూషన్స్ ఇండియా" అనే ఐటి కంపెనీ . సామన్య ప్రజలకు ఉపయోగపడేలా వీరు ఏదైనా చెయ్యాలనే చిన్న ప్రయత్నం నుంచి వచ్చిందే ఈ వి–మ్యాక్స్ ఈ సొల్యూషన్స్ ఇండియా సంస్థ. దీని ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ సంస్థలకు, సాఫ్ట్‌వేర్ కంపెనీలకు సొల్యూషన్స్ అందించి వాటికి ఇంకా ఉపయోగపడే పలు వెబ్‌సైట్లను రూపొందించడం. వి – మ్యాక్స్ అంటే వాల్యు మ్యాగ్జిమమ్.

గత నాలుగు సంవత్సరాల నుంచి ఈ సంస్థ ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ద్వారా వెబ్ సర్వీసెస్, ఈ గవర్నెస్ సొల్యూషన్ సేవలను అందిస్తోంది. ముఖ్యంగా మున్సిపల్, రూట్ మ్యాప్, బల్క్ ఎస్ఎమ్ఎస్‌లు (Bulk SMS), మొబైల్ యాప్స్( mobile apps) వంటి సేవలను అందిస్తోంది. ప్రైవేట్ సంస్థలకు కూడా వీరు సేవలందిస్తున్నారని "వి–మ్యాక్స్" డైరెక్టర్ విశాల్ మంచాల, బత్తుల మధు చెప్పారు. వీరి స్వగ్రామం కోరుట్ల జగిత్యాల జిల్లా . గత సంవత్సరంలో ఈ కంపెనీకి స్కాచ్ గోల్డ్ అవార్డు వచ్చింది . భారతదేశంలోని 500 అత్యుత్తమ ఐటి కంపెనీల్లో ఉత్తమ కంపెనీగా అవార్డును గెలుచుకుంది.

గోదావరి పుష్కరాల సందర్భంగా రద్దీని నియంత్రించేందుకు భద్రాచలం శ్రీ రామచంద్రస్వామి సేవలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోడానికి ప్రత్యేకమైన వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లను కూడా ప్రవేశపెట్టారు. ఈ యాప్‌ను తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ప్రారంభించారు. ఈ సంవత్సరం పోలీస్ శాఖ కోరిక మేరకు మేడారం జాతర కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేశారు.

## మేడారం జాతర మొబైల్ యాప్

దీని ఆధారంగా ఈ నెల 31 న ప్రారంభం కానున్న తెలంగాణ కుంభమేళా మేడారం జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యార్థం ప్రత్యేక మొబైల్ యాప్‌ను వీరు రూపొందించారు. దీని ద్వారా మేడారం వచ్చే భక్తులకు తెలియవలసిన వివరాలు, ప్రయాణం, సూచనలు వంటి అంశాలు ఉంచారు. మొట్టమొదటి సారిగా అందరికి అర్థం అయ్యే విధంగా ఈ ఆప్ తెలుగు, ఇంగ్లీష్ భాషలలో సమాచారం అందుబాటులో ఉంచుతుంది. ఈ యాప్ లోని అంశాలు మేడారం జాతర విశిష్టత, చరిత్ర, జాతర కార్యక్రమ సరళి, తేదీలు, రోజువారీ కార్యక్రమాల వివరాలతో పాటు, జాతర జరిగే 4 రోజులలో ఉండే రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండడానికి సొంత లేదా ప్రైవేట్ వాహనాలకు, ఆర్టీసీ బస్సులకు వేరు వేరు మార్గాలు అలాగే రావడానికి, తిరిగి వెళ్ళడానికి వేరు వేరు మార్గాలను ఏర్పాటు చేశారు. ఏ మార్గం ద్వారా వచ్చిన వారు తిరిగి ఏ మార్గం ద్వారా తమ గమ్యస్థానం చేరుకోవచ్చు వంటి అంశాలను, దారిలో పాటించవలసిన సూచనలను, మ్యాప్‌లు , ప్రస్తుత స్థానం నుండి ప్రత్యక్ష గూగుల్ మ్యాప్ ద్వారా మేడారం చేరుకోవడానికి దారి సూచనలతో పాటుగా ఉంచారు. అలాగే మేడారం చుట్టుపక్కల ఉన్న 30కి పైగా పార్కింగ్ స్థలాలను భూ ఉపరితలానికు అనుసంధానం చేసి (జియో ట్యాగ్గింగ్) ఆప్ వాడే వారు తమ ఉన్న స్థలం నుండి అక్కడికి గూగుల్ మ్యాప్ ద్వారా చేరుకునే విధంగా సూచనలను అందించడం, పార్కింగ్ సామర్థ్యం, పార్కింగ్ స్థలం విస్తీర్ణత, ఇవే కాకుండా భక్తులు ఏవైనా ఇబ్బందులు లేదా సంఘటనలు ఎదురైతే వాటిని కూడా పోలీసువారికి ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. జాతర ప్రాముఖ్యత, రద్దీ దృష్ట్యా పౌరులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సవివరంగా ఇచ్చారు. ఒక్కసారి డౌన్లోడ్ చేసుకున్న తర్వాత ఇంటర్నెట్ సదుపాయం లేకపోయినా వీలైనంత ఎక్కువ సమాచారాన్ని చూడగలిగేలా యాప్‌ను రూపొందించారు. మేడారం ప్రవేశం,




నిష్క్రమణ చుట్టుపక్కల ప్రదేశాల మార్గాలు, రహదారులు సూచించే మార్గ సూచిక మ్యాప్, అత్యవసర సమాచారం ఎప్పటికప్పుడు పోలీసులు పౌరులకు నేరుగా సమాచారం అందించడానికి వీలుగా ప్రకటనలు, శీర్షిక కూడా చేర్చబడినది. ఈ యాప్‌ను మీరు మీ గూగుల్ ప్లే స్టోర్ కి వెళ్లి Guide to Medaram 2018 Police official అని టైపు చేసి డౌన్లోడ్ చేసుకోవచ్చు.

**విష్ణు చారి కాసోజు**

# వచ్చే నెల మొదటివారంలో 'సెట్'ల నోటిఫికేషన్లు!



**మనతెలంగాణ**/హైదరాబాద్ : రాష్ట్రంలో వివిధ వృత్తి, సాంకేతిక విద్య కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సెట్)లకు ప్రభుత్వం ఫిబ్రవరి మొదటి వారంలో నోటిఫికేషన్లు జారీ చేయనుంది. ఈ మేరకు సెట్ల కన్వీనర్లు కసరత్తు చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి పిఇసెట్ మినహా ప్రవేశ పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లో జరుగనున్న నేపథ్యంలో ముందుగా నోటిఫికేషన్లు జారీ చేసి, ఆయా సెట్ల వెబ్‌సైట్లలో మాక్ టెస్టులు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రవేశ పరీక్షలన్నీ మే నెలలో జరుగనున్నాయి. మే 2వ తేదీన ఎంసెట్ పరీక్ష, మే 31న ఎడ్‌సెట్ పరీక్ష జరుగనుంది. పాతిక వేల కంటే ఎక్కువ మంది విద్యార్థులు హాజరయ్యే పరీక్షలను రోజుకు రెండు సెషన్లుగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సారి మేలో పరీక్షలు పూర్తి కాగానే వారం పది రోజుల్లో ఫలితాలు ప్రకటించి, జూన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏఐసిటిఇ నిబంధనల ప్రకారం జూన్ 30లోగా ప్రవేశాల ప్రక్రియ పూర్తయి, జూలై 1 నుంచి 2018–19 విద్యాసంవత్సానికి సంబంధించిన తరగతులు ప్రారంభం కావాలి. అందుకే వచ్చే విద్యాసంవత్సరం షెడ్యూల్ ప్రకారం సకాలంలో తరగతులు ప్రారంభం అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రవేశ పరీక్షలన్నీ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్న నేపథ్యంలో వాటిపై అవగాహన పెంచేందుకు ఇంటర్ విద్యార్థులకు మాక్ టెస్టులు నిర్వహించనున్నారు.

## మేడారం భక్తులకు ఫ్రీవైఫై సేవలు

**జయశంకర్ భూపాలపల్లి:** మేడారం జాతర కోసం బిఎస్ఎన్ఎల్ సంస్థ విస్తృత ఏర్పాట్లు చేసింది. బిఎస్ఎన్ఎల్ సేవల వివరాలను పలు మీడియా సంస్థల ద్వారా పిజిఎం నరేంద్ర వెల్లడించారు. వరంగల్ నుంచి మేడారం వరకు 22 టవర్ల ద్వారా 2జి,3జి, 4జి సేవలు అందిస్తామని తెలిపాడు. మేడారంలో ప్రత్యేకంగా 17 తాత్కాలిక టవర్లు ఏర్పాటు చేశామని, సిసిటివి కెమెరాల పర్యవేక్షణ కోసం ప్రభుత్వానికి ప్రత్యేక లీజ్‌లైన్ సేవలను ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎన్‌పిడిసిఎల్, మీడియా కోసం ప్రత్యేక లీజ్‌లైన్ సేవలు వినియోగిస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ సౌజన్యంతో భక్తులందరికీ వైఫై సేవలు అందిస్తామన్నారు. బిఎస్ఎన్ఎల్ సహా ఇతర ఆపరేటర్ల వినియోగదారులందరికీ వైఫై సేవలు ఇస్తామని, వైఫై సేవల కోసం 20 హాట్ స్పాట్‌లు, 80 యాక్సెస్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారుడు రోజుకీ 500 ఎంబిపిఎస్ వరకు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పిస్తామన్నారు. భద్రత కోసం ట్రాయ్ నిబంధన ప్రకారం ఒటిపి ద్వారా వైఫై సేవలు విస్తరిస్తున్నామని, ఒకేసారి 20 వేల మంది, 24 గంటల్లో 3 లక్షల మంది వైఫై సేవలు వినియోగించుకోవచ్చని వెల్లడించారు. రోజుకీ మూడు లక్షల మంది వైఫై సేవలు వినియోగించుకునేలా పరికరాలు ఏర్పాటు చేశామని తెలియజేశారు. స్మార్ట్ ఫోన్ వినియోగదారులకు మేడారం పరిధిలో వైఫై సేవలుంటాయని వివరించారు.

## గూడ్స్ రైలులో అగ్ని ప్రమాదం

**గుంటూరు** : తాడేపల్లి సమీపంలో గూడ్స్ రైలులో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. రైలులోని బొగ్గు నుంచి మంటలు రావడాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది రైలును ఆపివేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసింది. ఈ ఘటనతో ఈ మార్గంలో గంట పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రమాదం జరిగిన సమయంలో గూడ్స్ రైలు ఒడిశా నుంచి చెన్నయ్‌కు వెళుతోంది. ప్రమాదాన్ని సకాలంలో గుర్తించడంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు.

## విదేశీ పర్యటనకు రైల్వే ఉద్యోగులు

**మన తెలంగాణ**/హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వేలో పనిచేస్తున్న 100 మంది ఎంపిక చేసిన ఉద్యోగులు సింగపూర్, మలేషియా పర్యటనకు వెళ్లారు. సిబ్బంది సంక్షేమ నిధి నుంచి భారీ సబ్సిడీ ఇచ్చి నాన్ గెజిటెడ్ ఉద్యోగులను విదేశీ పర్యటనకు పంపించారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి రైల్వే ఉద్యోగులు ఆదివారం నాడు బయలుదేరి వెళ్లారు. ఖర్చులో 75 శాతం సంక్షేమ నిధి నుంచి ఇస్తామని, 25 శాతం ఖర్చును ఉద్యోగులు భరిస్తారని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటన విడుదల చేశారు.

## మిర్చి బండి గొడవే!

(మొదటిపేజీ తరువాయి)

మిర్చి బండి వద్దకు రావాలని చెప్పాడు. అక్కడికి రాంబాబుతో పాటు శరత్, చక్రి, మల్లేష్, దుర్గయ్యలు బండి వద్దకు చేరుకున్నారు. దీంతో మిర్చిబండిని ఎందుకు ధ్వంసం చేశారని గోపికి, రాంబాబుకు మధ్య వాగ్వాదం జరిగింది. ఒక్కసారిగా రాంబాబు మెరుగు గోపిపై తిరగబడ్డాడు. నీ పెత్తనం ఏంది.. నాకు చెప్పడానికి నీవెవడవు.. అంటూ బూతులు తిట్టాడు. నీతో పాటు నీకు అండగా ఉన్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త శ్రీనివాస్ అంతు కూడా చూస్తానని బూతులు తిట్టాడు. దీంతో అక్కడనుంచి వెళ్లిపోయిన మెరుగు గోపి జరిగిన విషయాన్ని బొడ్డుపల్లి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి తనను విచక్షణరహితంగా కొట్టారని, నిన్ను కూడా తిట్టారని చెప్పాడు. దీంతో ఆవేశానికి లోనైన శ్రీనివాస్ రాత్రి 11 గంటల ప్రాంతంలో తన అనుచరుడైన మోహన్‌ను ఇంటికి పిలిపించుకొని ద్విచక్రవాహనంపై మెరుగు గోపి ఉన్న ప్రాంతానికి బయలుదేరాడు. గాంధీనగర్ చౌరస్తాలో తనకు ఎదురుపడిన రాంబాబు, మల్లేష్, శరత్‌లను శ్రీనివాస్ ఆపి మెరుగు గోపిని ఎందుకు కొట్టారని, నన్ను ఎందుకు తిట్టారని అడిగాడు. ఈ క్రమంలో మాటా మాటా పెరిగి శ్రీనివాస్ రాంబాబుపై చేయి చేసుకున్నాడు. దీంతో రాంబాబు, అతని వెంట ఉన్నవారు శ్రీనివాస్‌పై తిరగబడి రాయితో తలపై కొట్టారు. తలకు గాయమైన శ్రీనివాస్ తనను కొట్టిన ప్రతి ఒక్కడిని బ్రతకనివ్వనని అనడంతో బయపడ్డ మల్లేష్, రాంబాబు, శరత్, దుర్గయ్యలు శ్రీనివాస్‌ను మురికికాల్వలోకి నెట్టి తలపై పెద్ద పెద్ద బండరాళ్లతో మోది హత్య చేశారని ఎస్పీ చెప్పారు. ఈ కేసులో మొత్తం 11 మందిని నిందితులుగా గుర్తించామన్నారు. వారిలో ఏ1గా చింతకుంట్ల రాంబాబు, ఏ2 మంద్ర మల్లేష్, ఏ3 శరత్‌రాజ్, ఏ4 బాషపాక దుర్గయ్య, ఏ5 కత్తుల చక్రి, ఏ6 దమనూరి సతీష్, ఏ7 మాంద్ర మహేష్(పరారీ), ఏ8 మిట్టపల్లి సాయి(పరారీ), ఏ9 ప్రసాద్ (పరారీ), ఏ10 కౌన్సిలర్ కౌసల్య కుమారుడు మెరుగు గోపి, ఏ11 మాతంగి మోహన్‌లుగా గుర్తించినట్లు తెలిపారు. అందులో ముగ్గురు పరారీలో ఉండగా మిగతా 8 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు ఎస్పీ చెప్పారు.

### పోలీసులవన్నీ కట్టుకథలు : లక్ష్మీ

తన భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసులో జిల్లా ఎస్పీ డివి.శ్రీనివాస్‌రావు, పోలీసు సిబ్బంది మీడియా సమావేశంలో చెప్పిన విషయాలన్నీ అవాస్తవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు లొంగిపోయి కేసును పక్కదోవ పట్టించేందుకు కట్టుకథలు అల్లారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం శ్రీనివాస్ నివాసంలో లక్ష్మిని పరామర్శించేందుకు వచ్చిన ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలసి ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడారు. పోలీసులు తన భర్త శ్రీనివాస్ హత్య కేసులో నిజనిజాలు వెలికితీసేంతవరకు నిరాహార దీక్ష చేపడుతానని, అవసరమైతే తన ప్రాణాలు తెగించి మరీ నిజాల కోసం పోరాడుతానన్నారు. కావాలనే అధికార పార్టీ నాయకులు శ్రీనివాస్‌ను హత్య చేశారని ఆమె ఆరోపించారు. పోలీసులు తన నివాసంలో ఉన్న సీసీ కెమెరాల రికార్డులను, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సమయంలో సీసీకెమెరాలను పరిశీలించి, శ్రీనివాస్ ఫోన్ కాల్ డేటాను ఎంక్వేరీ చేయించి వాస్తవాలు వెలికి తీయాలని ఆమె డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో విలేకరుల అడిగిన ప్రశ్నలకు ఎస్పీ సమాధా నాలు చెప్పలేకపోవడాన్ని రాజకీయ ఒత్తిళ్లకు నిదర్శనమన్నారు. తన భర్త కనిపించడం లేదంటూ ఆమె ఫిర్యాదు చేసినంత వరకు పోలీసులకు తెలియదని చెప్పడం అవాస్తవమన్నారు. తన భర్త మరణించిన రోజు డీఎస్పీ సుధాకర్ చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల్లో ఉండగా హత్య జరిగిన విషయాన్ని తెలుసుకొని తను ఫిర్యాదు చేయకముందే నల్లగొండకు చేరుకున్నారని ఆమె ఆరోపించారు. శ్రీనివాస్ మృతదేహం వద్దకు తీసుకువెళ్లిన సమయంలో తనను శ్రీనివాస్ మృతదేహాన్ని చూడనివ్వకుండా గంట పాటు వివిధ ప్రశ్నలతో విసిగించారని ఆరోపించారు.

## పేషంట్ డెడ్!



(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. వైద్యులు చెప్పిన మాట విన్న కుటుంబ సభ్యులు, భార్య అక్కడిక్కడే కుప్పకూలిపోయారు. విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు హాస్పటల్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఆపరేషన్ విజయవంతమైందని చెప్పిన వైద్యులని అతను ఎలా మరణిస్తాడన్ని, కేవలం డబ్బుల కోసమే హాస్పటల్ యాజమాన్యం నాటకాలాడిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇలాంటి ఘటనలు పురావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసుల సహాయంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లి దహన కార్యక్రమాలు నిర్వహించారు.

# వేగంగా 'ప్రతి ఇంటికీ నల్లా' పనులు

- 'అమృత్' పట్టణాలకు నీటి మీటర్లు
- జాప్యం లేకుండా అధికారుల చర్యలు



**మన తెలంగాణ**/హైదరాబాద్ : మున్సిపాలిటీలలో ''ప్రతి ఇంటికీ నల్లా'' కార్యక్రమాన్ని డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. దీనికి సంబంధించిన ప్రక్రియను మరింత వేగం చేస్తోంది. నల్లా కనెక్షన్లు లేని ప్రాంతాలను గుర్తించి కొత్త పైపులైన్ పనులను, అలాగే ఇదివరకు ఉన్న పాత పైపులైన్‌ను పూర్తిగా అధ్వాన్న పరిస్థితులో ఉంటే వాటిని కూడా మారుస్తున్నామని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వ పథకమైన ''అమృత్''లో ఎంపికైన పట్టణాలలో మాత్రం కొత్త కనెక్షన్లకు మీటర్లను ఏర్పాటు చేయనున్నారు. అమృత్ మార్గదర్శకాల ప్రకారం ఈ మీటర్లను ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు. మిషన్ భగీరథ పనుల్లో భాగంగా పురపాలక శాఖ పరిధిలోని 61 స్థానిక సంస్థలలో ''ప్రతి ఇంటికీ నల్లా'' కార్యక్రమ పనులను సుమారు13 ఏజెన్సీలకు అప్పగించారు. ఇందులో సుమారు 43 స్థానిక సంస్థల పరిధిలో చేపడుతున్న నల్లా పనులను మాత్రం 'ఎనివీటి' పద్ధతిన పనులను అప్పగించారు. ఈ విధానం ద్వారా పనులు పూర్తయిన తర్వాత ఏడేళ్ల కాలపరిమితిలోపు కాంట్రాక్ట్ డబ్బులను చెల్లించేలా మున్సిపల్ శాఖలోని పబ్లిక్ హెల్త్ ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ విధానం ద్వారా పనులు త్వరితగతిన పూర్తి కావడంతో పాటు ఎక్కడ లోపాలు జరిగినా తిరిగి ఆ కాంట్రాక్ట్ ఏజెన్సీనే పూర్తి బాధ్యత వహించే అవకాశం ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కాగా సుమారు 6 నుంచి పదిలోపు స్థానిక సంస్థల పరిధిలో ఒక్కో పనిని ఒక్కో ఏజెన్సీకి అప్పగించారు. ఈ పనులకు సుమారు ఆరు మాసాల క్రితమే టెండర్ పక్రియను పూర్తి చేయగా వాటికి సంబంధించిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మున్సిపల్ శాఖ సదరు కాంట్రాక్ట్ ఏజెన్సీలకు స్పష్టం చేసింది. ఈ పనులను నిత్యం పర్యవేక్షించాలని స్థానిక సంస్థలను ఆదేశించింది. ప్రతి ఇంటికీ నీరు అందించకపోతే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు అడగబోమని గతంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల సమయం నాటికే నల్లా పనులు పూర్తి చేసేలా మున్సిపల్ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందులో భాగంగానే ఇటీవల మంత్రి కె.తారక రామారావు మిషన్ భగీరథ పనులపై సమీక్ష నిర్వహించి, పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో పబ్లిక్ హెల్త్ విభాగం కూడా నల్లా పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. మరోవైపు నల్లా పనుల్లో జాప్యం లేకుండా నిత్యం పర్య వేక్షించాలని, శాఖాధికారులు సమన్వయంగా వ్యవహారించాలని మున్సిపల్ శాఖ ఆదేశించింది.

### పెరగనున్న నల్లా కనెక్షన్లు

ప్రస్తుతం 61 స్థానిక సంస్థల పరిధిలో సుమారు 6 లక్షలకు పైగా మంచినీటి కనెక్షన్లు ఉన్నాయి. తాజాగా మిషన్ భగీరథ పనులను పూర్తి చేస్తే అదనంగా మరో ఏడు లక్షల వరకు కొత్త కనెక్షన్లు వస్తాయని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే కొత్త కనెక్షన్లకు మీటర్లను బిగించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. కాని ప్రస్తుతం నల్లా పనులు జరుగుతున్న ''అమృత్'' పట్టణాల్లో మాత్రం మీటర్లను బిగించాలని నిర్ణయించారు.

## అనుయాయులకు నామినేషన్లు... వక్ఫ్ ఆదాయానికి గండి

### బోర్డు నిర్వాకం పై విమర్శల వెల్లువ

**మన తెలంగాణ** / హైదరాబాద్ : ఆదాయాన్ని సమకూర్చే వక్స్ సంస్థలు కొందరికి కాసులు పండిస్తూ బోర్డు ఆదాయానికి మాత్రం గండి కొడ్తున్నాయి. దర్గాల కేర్‌టేకర్ల నియామకానికి సంబంధించి వక్ఫ్‌బోర్డు పాలకవర్గం తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. వక్ఫ్‌బోర్డుకు భారీ ఆదాయం సమకూరే నాంపల్లి యూసుఫేన్ దర్గా, జహంగీర్ పీర్ దర్గా, వరంగల్‌లోని అన్నవరం దర్గా, నల్గొండ దర్గా, సూర్యాపేటలోని అర్వేపల్లి దర్గాలకు కేర్‌టేకర్‌లను నియమించే విషయంలో వక్ఫ్‌బోర్డు పాలకమండలి వ్యవహరించిన తీరుతో కోట్లాది రూపాయల గండి పడుతోంది. గతంలో ఒపెన్ టెండర్ల ద్వారా దర్గాలకు కేర్‌టేకర్‌ల నియామకం జరిగేది. దీని వల్ల వక్ఫ్‌బోర్డుకు ఆదాయం సమకూరేది. తెలంగాణ వక్ఫ్‌బోర్డు కొత్త పాలకవర్గం కొన్ని దర్గాల కేర్‌టేకర్లను నామినేషన్ పద్ధతిలో నియమించింది. దీంతో వక్ఫ్‌బోర్డు గణనీయంగానే ఆదాయాన్ని కోల్పోయింది. గతేడాది ఒపెన్ టెండర్ల ద్వారా జహంగీర్ పీర్ దర్గా కేర్‌టేకర్‌ను ఎంపిక చేయగా వక్ఫ్‌బోర్డుకు రూ. కోటి 62 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది నామినేషన్ ద్వారా రూ.90 లక్షలు మాత్రమే వచ్చింది. వక్ఫ్‌బోర్డుకు రూ.72 లక్షల ఆదాయానికి గండి పడింది. అన్నవరం దర్గా కేర్‌టేకర్‌కు గతేడాది టెండర్ల ద్వారా రూ.80 లక్షలు వస్తే ఈ ఏడాది రూ.20 లక్షలకు నామినేషన్‌పై నియామకం జరిగింది. రూ. 60 లక్షల నష్టం వాటిల్లింది. జాన్‌పాడ్ దర్గా విషయంలోనూ వక్ఫ్‌బోర్డు దాదాపు 60 లక్షల ఆదాయాన్ని కోల్పోయిందని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటి పేర్కొంది. హైదరాబాద్ యూసుఫేన్ దర్గా ద్వారా వచ్చే ఆదాయానికి కూడా కేర్ టేకర్ గండికొడ్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. గతంలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారనే కారణంతో కేర్‌టేకర్ (ముతవల్లీ)ను వక్ఫ్‌బోర్డు తొలగించింది. నామినేషన్ల నియామకాలపై విమర్శలు రావడంతో వారిని తొలగిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయినా ఇప్పటికీ వక్ఫ్‌బోర్డు ఎలాంటి చర్య తీసుకోలేదని, వక్ఫ్‌బోర్డు పాలకవర్గం అక్రమార్కులకు సహకరిస్తోందని మైనారిటీ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. యూసుఫేన్ దర్గా ముతవల్లీపై చర్య తీసుకోవాలని 'సేవ్ వక్ఫ్ ప్రాపర్టీస్' సంస్థ ప్రధాన కార్యదర్శి ఇఫ్తెఖార్ హుస్సేన్ వక్ఫ్ బోర్డు సిఇఓ దృష్టికి తీసుకెళ్ళారు.

## కొత్త మిలటరీ ట్రైనింగ్ మాన్యువల్ ముద్రించిన చైనా ఆర్మీ

బీజింగ్: ప్రపంచంలో అతి పెద్ద సైన్యం గల చైనా కొత్త మిలటరీ ట్రైనింగ్ మాన్యువల్‌ను ముద్రించింది. ప్రపంచ స్థాయిలో శక్తివంతమైన సైన్యంగాతీర్చిదిద్దేందుకు అధికారికంగా ఆమోదించిన మాన్యువల్‌ను అధ్యక్షుడు జి జిన్‌పింగ్ నాయకత్వంలోని సెంట్రల్ మిలటరీ కమిషన్ ఆమోదించింది. చైనాలో శక్తివంతమైన నేతగా ఎదిగిన జిన్‌పింగ్ వాస్తవ యుద్ధం పరిస్థతులలో లైవ్ ఫైరింగ్‌ల సన్నాహాలను ఆయన ప్రత్యక్షంగా నిర్వహిస్తున్నారు. శాస్త్రీయ, సాధారణ శిక్షణతో పాటు పిఎల్ఎ పోరాట సామర్థ్యం ఉమ్మడి శిక్షణలో మిలటరీ శిక్షణపై దృష్టి పెడుతుందని చైనా ప్రభుత్వ అధికారిక పత్రిక జినుహ పేర్కొంది. వివిధ స్థాయిల్లో వివిధ రంగాల్లో ఆధునిక యుద్ధ అవసరాలకు అనుగుణంగా ప్రమాణిక వ్యవస్థను రూపొందించింది.

# ఈ ఊరు ఏ జిల్లాలో?

(మొదటిపేజీ తరువాయి)

మండలం నుంచి దీన్ని తొలగించే పని మాత్రం జరిగిపోయింది. ఎక్కడ తేడా వచ్చిందో తెలియదుగానీ ఫారూక్‌నగర్‌లో మాత్రం కలవలేదు. 2016 దసరా పండుగ నుంచి ఈ గ్రామం అటు పాత జిల్లాలో లేక, ఇటు కొత్త జిల్లాలో చేరలేక గాలిలో వేలాడుతూ ఉంది. కాగితాలపై ఈ గ్రామం ఊసే లేకుండా పోయింది. ఫలితంగా ఈ గ్రామంలోని 285 కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు దూరంగానే ఉన్నారు. గ్రామ సర్పంచ్ శంకరమ్మ, జడ్చర్ల ఎమ్ఎల్ఏ అయిన మంత్రి లక్ష్మారెడ్డి ఈ గ్రామాన్ని కొత్త జిల్లాలో చేర్చాల్సిందిగా ప్రభుత్వానికి విన్నవించారు. సర్పంచ్ శంకరమ్మ నిరహారదీక్ష కూడా చేశారు. కానీ ఏడాదిన్నర అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మిగిలిపోయింది. సర్పంచ్‌తో పాటు మంత్రి లక్ష్మారెడ్డి, పొరుగున ఉన్న షాద్‌నగర్ ఎమ్ఎల్ఏ అంజయ్య యాదవ్ ఇటీవల సచివాలయానికి వచ్చి రెవిన్యూ అధికారులకు మొరపెట్టుకున్నారు. తాజాగా రెవిన్యూ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ఈ గ్రామం సంగతి తేల్చండంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం 'నోట్‌ఫైల్' దశలో ఉంది.

జిల్లాల పునర్ వ్యవస్థీకరణకు పూర్వం సూరారం గ్రామం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలో ఉండేది. ఆ గ్రామ ప్రజలంతా రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వెళ్ళే ఫారూక్‌నగర్‌కు వెళ్తామని గ్రామ సభ ద్వారా తీర్మానం చేశారు. ఫారూక్‌నగర్ మండలమైతే రంగారెడ్డి జిల్లాలో చేరిందిగానీ ఈ గ్రామం మాత్రం ఫారూక్‌నగర్ రికార్డుల్లోకి ఎక్కలేదు. ప్రభుత్వ నోటిఫికేషన్‌లో సైతం ఈ గ్రామం ఏ జిల్లాలోనూ కనిపించకుండా గల్లంతైంది. కానీ గ్రామ ప్రజలు మాత్రం కొత్త జిల్లాలోకి చేరిపోయామని సంబురపడ్డారు. రెండు నెలల తర్వాత విద్యార్థుల కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం తదితర అవసరాలకు ఫారూక్‌నగర్ మండల కేంద్రానికి వెళ్ళిన తర్వాత వారికి అసలు విషయం తెలిసింది. ప్రభుత్వం ఫారూక్‌నగర్ మండలంలోకి చేర్చలేదని అధికారులు ఈ గ్రామ ప్రజలకు తేల్చి చెప్పారు. దీంతో ప్రజలంతా సర్పంచ్ శంకరమ్మకు మొరపెట్టుకున్నారు. ఆమె జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్ళారు. అసలు విషయాన్ని గ్రహించిన కలెక్టర్ తాత్కాలిక ఏర్పాటుగా పాత మండల (బాలానగర్) అధికారులే అవసరమైన అన్ని ధృవీకరణ పత్రాలు మంజూరు చేస్తారని సెలవిచ్చి ఆ మేరకు తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. అంతవరకు బాగానే ఉందిగానీ కొన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందడానికి ఆన్‌లైన్ ద్వారా జరిగే రిజిస్ట్రేషన్ల దగ్గర చిక్కు వచ్చిపడింది. దీంతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర పథకాలు ఈ గ్రామ ప్రజలు పొందలేకపోయారు.

ఇక విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీఇంబర్స్‌మెంట్, ఎస్సీ కార్పొరేష్, బిసి కార్పొరేషన్‌ల ద్వారా లబ్ధిదారులు పొందే సబ్సిడీ రుణాలు... ఇలాంటివన్నీ ఏడాదిన్నరగా అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి. కారణం ఆన్‌లైన్‌లో ఈ గ్రామం పేరు ఏ జిల్లాలో లేకపోవడమే. ఇక భూ రికార్డుల ప్రక్షాళన ఈ చట్టపరమైన చిక్కు కారణంగానే ఈ గ్రామంలో తాత్కాలికంగా నిలిచిపోయింది. త్వరలో రైతు పెట్టుబడి పథకం కింద ఎకరానికి నాలుగు వేల రూపాయల ఆర్థిక సాయం అందనుండడం, పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయాల్సి వస్తుండడంతో గ్రామ ప్రజల్లో ఆందోళన పెరిగింది. మూడు రోజుల క్రితం షాద్‌నగర్ ఎమ్ఎల్ఏ అంజయ్య యాదవ్ సైతం రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్ తివారీని కలిసి ఇప్పటికైనా సూరారం గ్రామ సంగతి తేల్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతానికి 'నోట్‌ఫైల్' ప్రక్రియ జరుగుతూ ఉంది.

### మా గోడు ఎవరికి చెప్పుకోవాలి : సర్పంచ్


జిల్లాల పునర్ వ్యవస్థీకరణ సందర్భంగా ఈ గ్రామ ప్రజలంతా ఫారూక్‌నగర్‌లోకి వెళ్ళాలని కోరుకున్నారు. కానీ ఈ ఏడాదిన్నర కాలంగా పడిన కష్టాల తర్వాత బాలానగర్‌లోనే ఉండాలని కోరుకుంటున్నారు. రెండేండ్లు వెనక్కి వెళ్ళిపోయినట్లయింది. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందడంలో మాత్రం ఏడాదిన్నరగా అన్యాయం జరిగింది. గ్రామసభల్లో చర్చించాం. పంచాయతీ సాధారణ సమావేశంలోనే చర్చించాం. కలెక్టర్‌ను కలిశాను. సచివాలయానికి వెళ్ళి కార్యదర్శుల్ని కలిశాను. ఫలితం మాత్రం ఏమీ లేదు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కేంద్రం నుంచి వచ్చే నిధులు, రాష్ట్రం వాటా నిధులు రావడంలేదు. సిమెంటు రోడ్ల నిర్మాణం నిలిచిపోయింది. సూరారంతో పాటు కొత్త సూరారం కాలనీ, శంకరాయపల్లి తాండ, బీసీ కాలనీల ప్రజలంతా ఇప్పుడు బ్యాంకు, హైస్కూల్ తదితరాలు తొమ్మిది కి.మీ. దూరంలో ఉన్న బాలనగర్‌లో ఉన్నందువల్ల యధావిధిగా పాత జిల్లాలోనే ఉండాలని కోరుకుంటున్నారు. ఫారూక్‌నగర్18 కి.మీ. దూరంలో ఉన్నందున వద్దని ఇప్పుడు భావిస్తున్నారు.

### ఏం చేసినా ప్రభుత్వమే చేయాలి : షాద్‌నగర్ ఎమ్ఎల్ఏ

సూరారం గ్రామానికి జరిగిన అన్యాయం గురించి మంత్రి లక్ష్మారెడ్డికి తెలుసు. నేను స్వయంగా రెవిన్యూ కార్యదర్శి రాజేశ్వర్ తివారీని కలిసి వివరించాను. వీలైనంత త్వరగా చిక్కు తొలగించాలని కోరాను.త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటివరకైతే ఏమీ పురోగతి వచ్చినట్లు నాకు సమాచారం లేదు.

## కుటుంబంలో ముగ్గురి హత్య

(మొదటిపేజీ తరువాయి)





కొందరు ఊరు నుండి వచ్చారని తమ్ముళ్ళు కుడా అక్కడే ఉన్నారని నమ్మించి తండ్రిని వేరే దారిలో తీసుకుపోయి ఒక నిర్జన ప్రదేశంలో ఉంచి తమ్ముళ్ళను తీసుకువస్తానని నమ్మించి అక్కడ పడుకోబెట్టి కొద్దిసేపటి తర్వాత వచ్చి తండ్రి తలపై బలంగా రాయితో కొట్టి హత్య చేశాడని తెలిపారు. అనంతరం నిందితుడు పరారవుతూ తన మామకు ఫోన్‌చేసి తాను నాన్నను, తమ్ముళ్ళను చంపానని తెలిపాడని చెప్పారు. దీంతో మామిళ్ళపల్లి గ్రామంలోని బంధువులకు విషయం తెలియజేయగా వారు వెళ్ళిచూసారని తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ దామోదర్ పోలీసులకు సమాచారన్ని అందించారని. పోలీసులు రంగప్రవేశం చేసి వెంటనే తెల్కపల్లి పోలీసులకు సమాచారం అందించారు. టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ చేస్తుండగా నిందితున్ని అదుపులో తీసుకున్నామని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పి సన్‌ప్రిత్‌సింగ్ ఘటానా స్థలా నికి చేరుకుని మూడు మృతదేహాలను పరిశీలించారు. అదుపులో ఉన్న నిందితుని నుండి పూర్తి సమాచారాన్ని తీసుకుంటామాని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాలను అచ్చంపేటలోని ప్రభుత్వ దవాఖానకు తరలించామని. ఒకేసారి మూడు హత్యలు జరిగేవరకు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు వేలాదిసంఖ్యలో అక్కడకి చేరారని తెలిపారు.


## పార్లమెంట్ బడ్జెట్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

జరిగింది. ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత కమార్, సహాయ మంత్రి విజయ్ గోయల్‌తో పాటు వివిధ పార్టీల ఫ్లోర్ లీడర్లు హాజరయ్యారు. టిడిపినుంచి తోట నర్సింహ్మం, దేవేందర్ గౌడ్, సిఎం రమేష్‌లు హాజరు కాగా, టిఆర్ఎస్ నుంచి జితేందర్ రెడ్డి, కేశవ రావు, వైఎస్ఆర్‌సిపి నుంచి మేకపాటి రాజమోహన్ రెడ్డి, విజయసాయిరెడ్డిలు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుండి మల్లిఖార్జున ఖర్గే, జ్యోతిరాదిత్య సిందియా, సిపిఎం నుండి కరుణాకరన్, సిపిఐ నుండి డి.రాజా, అప్నా దళ్ నుండి అనుప్రియ పాటిల్, అకాలీదళ్ నుండి నరేష్ గుజ్రాల్, సమాజ్ వాదీ నుండి ములాయం సింగ్, నరేష్ అగర్వాల్‌లు హాజరు కాగా, ఆర్‌జెడి నుండి జె.పి. యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నుండి డిరెక్ ఓబ్రాయిన్, సుదీప్ బంధోపాధ్యాయలు, ఎల్‌జెపి నుండి రామచంద్ర పాశ్వాన్, ఎన్‌సిపి నుండి తారిక్ అన్వర్, ఎఐడిఎంకె నుండి కనిమొళిలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ సజావుగా సాగడానికి ప్రతిపక్షాలు సహకరించాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈ బడ్జెట్ సమావేశాల్లో ట్రిపుల్ తలాక్ బిల్లు, బిసి కమిషన్‌కి రాజ్యాంగ హోదాతో పాటు 33 కీలక బిల్లులను 6 విభాగాలుగా విడదీసి వాటిని ఆమోదింప చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. అయితే ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వివాదం, కర్ణిసేన దాడులు, సరిహద్దులో పాకిస్థాన్ కాల్పుల ఉల్లంఘనతో సహా ఇతర అంశాల పై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడం ద్వారా ఇరకాటంలో పెట్టాలని ప్రతిపక్షాలు వ్యూహ రచన చేస్తున్నాయి. మరోవైపు జిఎస్‌టి అమలులోకి వచ్చిన తర్వాత తొలి బడ్జెట్.. ఎన్నికలకు ముందు రానున్న ప్రజాకర్షక బడ్జెట్.. ఇలా ఎన్నో ప్రత్యేకతలను సొంతం చేసుకున్న బడ్జెట్ 2018 మరో మూడు రోజుల్లో ప్రజల ముందుకు రానుంది. ఆనవాయితీ ప్రకారం ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించడంతో నేడు (సోమవారం) బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతాయి. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 9 వరకు మొదటి విడత, మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు రెండో విడతగా పార్లమెంట్ భేటీ కానుంది. సమావేశం అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి అనంతకుమార్ మీడియాతో మాట్లాడుతూ... ఈ సారి సమావేశాలలో ట్రిపుల్ తలాక్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందుతున్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గతంలో జిఎస్‌టి బిల్లు ఆమోదం పొందిన విధంగానే, ట్రిపుల్ తలాక్ బిల్లుకు విపక్షాలు ఆమోదం తెలుపుతాయని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బడ్జెట్ సమావేశాలు చాలా విలువైనవని ప్రధానమంత్రి భావిస్తున్నారని, ప్రభుత్వం సమావేశాలు సజావుగా సాగడానికి విపక్షాలు ఇచ్చే సలహాలు, సూచనలను స్వీకరించడానికి సిద్ధంగా ఉందని అఖిలపక్ష సమావేంలో స్పష్టం చేశారని పార్లమెటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్ వెల్లడించారు. అనంతరం ఆర్‌జెడి నేత జయప్రకాష్ నారాయణ్ యాదవ్ మాట్లాడుతూ ఈసారి సమావేశాలలో దేశంలో నిరుద్యోగం పెరిగిపోవడాన్ని విపక్షాల తరపున ఉభయ సభలలో ప్రస్తావిస్తామని తెలిపారు. దేశంలో శాంతి, సామరస్యాలకు భంగం కలగడమే కాకుండా దేశ వ్యాప్తంగా హింస పెచ్చుమీరి పోతున్నదని ఈ విషయాన్ని కూడా ఈ బడ్జెట్ సమావేశాలలో ప్రత్యేకంగా లేవనెత్తుతామని వెల్లడించారు. కోరేగావ్ నుండి నందన్ గావ్ వరకు అక్కడి నుండి బక్సార్ వరకు దళితులపై జరుగుతున్న దాడులపై రెండు సభలలో లోతైన చర్చజరగాలని పట్టుబడామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహిళలపై నిత్యం పెరుగుతున్న అత్యాచారాల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ విషయాన్ని పార్లమెంట్ ఉభయసభలలో లేవనెత్తాలని తమ పార్టీ భావించినట్లు పేర్కొన్నారు.

### కేంద్రంతో తాడో పేడో : జితేందర్ రెడ్డి

కేంద్రం ప్రవేశ పెట్టే ఆఖరి పూర్తి బడ్జెట్ సమావేశాలు ఇవే కానుండడంతో, తమ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్ర ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల ఎంపిలు సిద్ధం అవుతున్నారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఆదివారంనాడిక్కడ అఖిలపక్ష సమావేశాల అనంతరం టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ జితేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధుల కేటాయింపే తమ ప్రధాన ఎజెండా అని కేంద్రానికి తేల్చి చెప్పామన్నారు. ఇప్పటికే చాలా కాలం గడిచిపోయింది, ఇక హామీలతో శాంతించేది లేదని స్పష్టం చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరు రాష్ట్ర ప్రభుత్వానికి అర్థమైందన్నారు. బిజెపివి మాటలే తప్ప ఇప్పటి వరకు రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. మూడున్నరేళ్లుగా కేంద్ర ప్రభుత్వం హామీల్తోనే సరిపెడుతోందని ఆయన దుయ్యబట్టారు. ఇప్పటి వరకు దాదాపు 5 వేలకోట్ల రూపాయల కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి సూచించామని తెలిపారు.



## కాంగ్రెస్ సీనియర్ నాయకులు గురువులుగా వ్యవహరించాలి

**కోల్‌కతా** : కాంగ్రెస్ సీనియర్ నాయకులు గురువులుగా వ్యవహరించాలి తప్ప, హింసించే వారుగా కాదని పార్టీ అగ్రనేత జైరాం రమేష్ సూచించారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందుగానే యువ నాయకులు బాధ్యతలు స్వీకరించేలా పార్టీ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆదివారం ఇక్కడ జరిగిన టాటా స్టీల్ కోల్‌కతా లిటరరీ మీట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గుజరాత్ ఎన్నికల తర్వాత పార్టీకి పూర్వ వైభవం రాబోతున్నదన్న సంకేతాలు వచ్చాయని, ఈ ఎన్నికల తర్వాత రాహుల్ గాంధీ పూర్తి స్థాయి రాజకీయ నాయకునిగా అవతరించారని చెప్పారు. పార్టీలోని సీనియర్ నాయకులు ఇప్పుడు గురువుల పాత్రల్లో వ్యవహరించాల్సివుందని, అంతేకాని హింసించేవారుగా కాదని హితవు పలికారు. సలహాలు, సూచనలు ఇస్తూ మార్గదర్శకం చేయాలని అన్నారు. వీరు ప్రపంచాన్ని చూశారని, పార్లమెంటులో కీలకపాత్ర పోషించారని, ఇప్పుడు యువతకు కూడా అవకాశాలు దక్కాలని అన్నారు. 2019 ఎన్నికల ముందు సీనియర్ నాయకులు బయటకు వచ్చేయాలని, సచిన్ పైలెట్, జ్యోతిరాదిత్య సింధ్యా, గౌరవ్ గొగోల్, సుస్మిత దేవ్ వంటి నాయకులను ప్రోత్సహించాల్సి వుందని అన్నారు. యువతను ప్రోత్సహించడం ద్వారా ప్రజల్లో ఆదరణను మరింతగా పొందే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు.

## ముగ్గురు మావోయిస్టు కొరియర్లు అరెస్ట్

### పరారీలో మరో ఇద్దరు, ఒక రివాల్వర్ స్వాధీనం

**మన తెలంగాణ** / కొత్తగూడ : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గంగారం గ్రామ సమీపంలో మావోయిస్టు కార్యకలాపాలు కొనసాగించేందుకు ముగ్గురు అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు స్థానిక ఎస్ఐలు బి.సతీష్, బాలకృష్ణలు పోలీసు సిబ్బందితో అక్కడకు చేరుకోగా ముగ్గురు వ్యక్తులు అనుమానస్పదంగా తప్పించుకునేందుకు ప్రయత్నించగా వరిని పట్టకున్నారని, వారు మావోయిస్టు పార్టీ కొరియర్లుగా గుర్తించామని మహబూబాబాద్ డిఎస్పీ ఎ.నరేశ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డిఎస్పీ నరేశ్ కుమార్ మాట్లాడుతూ గంగారం మండలం నర్సిగూడెం గ్రామానికి చెందిన ఈసం నాగేశ్వర్‌రావు, గంగారానికి చెందిన పర్శిక వీరస్వామి, ఖమ్మం జిల్లా కారెపల్లి మండలం పేరెపల్లికి చెందినవేమునూరి అశోక్‌లను ఆదివారం తెల్లవారు జామున పట్టుకున్నామన్నారు. రివాల్వార్‌తో పాటు తొమ్మిది రౌండ్లు దొరికాయన్నారు. జోగు రామయ్యకు మధ్యవర్తిగా మదగూడ రగామానికి చెందిన మరో వ్యక్తి బీరబోయిన లింగస్వామి, రివాల్వర్ అమ్మిన రామయ్యలు పరారయ్యారన్నరు. పరారీలో ఉన్న ఆ ఇద్దరినీ త్వరలోనే పట్టుకుట్టామని అన్నారు. ఈ సమావేశంలో గూడూరు సిఐ రమేశ్ నాయక్, ఎస్ఐలు బి సతీష్, బాలకృష్ణ, బాబురావు, రవి, యాకయ్యలతో పాటు పలువరు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అప్పుల బాధతో కౌలు రైతు మృతి

**మన తెలంగాణ**/చింతపల్లి : తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపం చెంది కౌలు రైతు ఉరేసుకొని మృతి చెందిన సంఘటన మండలంలోని గడియగౌరారం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నాగభూషనరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గడియగౌరారం గ్రామానికి చెందిన ఎస్ కె మౌలానా (68) గడియ గౌరారం శివారులో 7ఎకరాలు గాసిరాం తండాశివారులో 15 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకున్నాడు. కౌలుకు తీసుకున్న పొలంలో ఉనిమ్మతోటకు, మామిడితోటకు, పత్తి, మిర్చి పంటలకు గాను అప్పులు తెచ్చి పంట సాగు చేసాడు. వేసిన పంటలు సరిగ్గా పండక పోవడంతో తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలోనని తీవ్ర మనస్థాపానికి చెందిన మౌలానా శనివారం రాత్రి డ్రిప్ పైపుతో స్లాబ్‌కు ఉన్న కొండికి ఉరేసుకొని మృతి చెందినట్లు కుటంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. జానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తూ పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## రాఘవాపూర్‌లో దొంగల హల్‌చల్

### ఏడిండ్లలో చోరీలు, 11 తులాల బంగారు నగల అపహరణ

**మన తెలంగాణ**/సిద్దిపేట రూరల్ : సిద్దిపేట మండలం రాఘవాపూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు హల్‌చల్ సృష్టించారు. గ్రామంలోని ఏడు ఇండ్లలో చోరిచేసి బంగారు నగలు, నగదును ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన మహంకాళి ఇంటి తాళాలు పగులగొట్టి ఏడు తులాల బంగారం, 75 తులాల వెండి ఆభరణాలను, పరశురాములు ఇంటి నుంచి 11 తులాల వెండి, పర్శనేని రాజవ్వ ఇంటి నుంచి నాలుగు తులాల వెండి, రెండు వేల నగదు, సక్కరం లక్ష్మి ఇంటి నుంచి 20 వేల నగదు, 22 తులాల వెండి, ఐదు గ్రాముల బంగారం, పిట్ల వెంకటవ్వ ఇంటి నుంచి వెయ్యి రూపాయల నగదు, నల్లనాగుల శాంత ఇంటి లోంచి రెండు తులాల పుస్తెల తాడు, ఐదు వేల నగదును అపహరించగా, చాకలి బాబు ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనానికి ప్రయత్నించి వారు విఫలమైనారు. సిద్దిపేట రూరల్ ఎస్సై శ్రీనివాసరెడ్డి చోరీ జరిగిన ఇండ్లను పరిశీలించి కేసు నమోదు చేసుకుని క్లూస్ టీమ్‌ను రప్పించి పరిశోధన ప్రారంభించారు. అడిషనల్ డిసిపి నరసింహారెడ్డి చోరీ జరిగిన ఇండ్లను పరిశీలించి మాట్లాడుతూ క్లూస్ టీమ్ ఆధారాలతో కేసును పరిష్కరిస్తున్నామని దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

## రూ.50 లక్షల విగ్రహాల అపహరణ

**మన తెలంగాణ**/కామారెడ్డి: పురాతనమైన శ్రీ కృష్ణ, రుక్మిణి, సత్యభామ విగ్రహాల చోరి ఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పెద్ద బజార్‌లోగల త్రివేణి వేణు గోపాల స్వామి ఆలయంలో మూడు పురాతన పంచలోహ విగ్రహాలను గుర్తు తెలియన వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గోపాలస్వామి ఆలయ తాళాలు పగుల గొట్టి ఆలయంలోనికి ప్రవేశించిన దొంగలు ఆలయంలోని 50 లక్షలకు పైగా విలువగల పంచలోహ విగ్రహాలను దొంగిలించి పరారయ్యారు. పంచలోహ విగ్రహాలు చోరీకి గురైన విషయం తెలుసుకున్న ఎస్పీ శ్వేతారెడ్డి , డిఎస్పీ ప్రసన్నారాణి, సిఐ శ్రీధర్ కుమర్‌లు ఆదివారం సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌కూడా రప్పించి పరిశీలించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ శ్వేతారెడ్డి ఈసందర్భఃగా తెలిపారు.

## కుంటాల జలపాతంలో వ్యక్తి మృతి

**మన తెలంగాణ**/ నేరడిగొండ : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతం లో ఆదివారం మధ్యాహ్నం విహార యాత్రకు వచ్చి ప్రమాదవశాత్తు జలపాతంలో పడి స్టాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంజమామ్‌ఉల్ హాక్ (21) మృతి చెందాడు.ఎస్సై సాయిరెడ్డి వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి ఇంజమామ్ ఉల్ హాక్ తన తోటి 10 మంది సహఉద్యోగులతో కలిసి ఆదివారం సెలవు కావడంతో కుంటాల జలపాతానికి సందర్శనకు వచ్చారు.వీరంతా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. హైదరాబాద్ నుండి ఆకాశ్, అభిమన్యు, శ్యామ్,ఇంజామాల్‌ఉల్‌హక్, రోషిణీ, శివాణి, సాహితి, రమ్య, పూజ, పూజిత, హెమశ్రీలు కలిసి టెంపో వాహనంలో కుంటాల జలపాతం వద్దకు వెళ్లారు. జలపాతంలో ప్రమాదవశాత్తు జారి నలుగురు నీటిగుండంలో పడిపోయారు. మిగతా వారు ఈత రావడంతో బయటకు రాగా ఇంజమామ్‌ఉల్‌హక్ జలపాతంలో మునిగి మృతి చెందాడు.

## భారీగా గంజాయి పట్టివేత

### 88 కిలోల గంజాయి, 4 సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం



**మన తెలంగాణ**/ నిజామాబాద్ క్రైం: నిజామాబాద్ జిల్లాలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముఠా సభ్యులను పోలీసులు ఆదివారం అరెస్టు చేసి వారి వద్ద నుండి 10లక్షల విలువ చేసే గంజాయితో పాటు సెల్‌పోన్లు స్వాధీనం చేసుకొని, నిందితులు 5గురిని రిమాండ్‌కు తరలించినట్లు అసిస్టెంట్ కమిషనర్ శ్రీధర్ రెడ్డి తెలిపారు. రిమాండ్‌కు తరలించిన వారిలో ప్రముఖ గంజాయి స్మగ్లర్ మున్వర్ అలీ అలియాస్ గంజా మున్వర్, తూర్పు గోదావరి జిల్లా, రావులపాలెంకు చెందిన వాసిరెడ్డి పెద్దిరాజు, ఇదే జిల్లా మండపేటకు చెందిన షేక్ అహ్మద్, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన శ్రీనివాస్, నిజామాబాద్‌కు చెందిన మహ్మద్ జమాలుద్దీన్ ప్రధాన నిందితులుగా ఉన్నారని తెలిపారు. వారి వద్ద నుండి 88 కిలోల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాపై రెండు రాష్ట్రాల్లో ఇదివరకే కేసులు నమోదయ్యాయని అడిషనల్ ఎసిపి శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

# పసిప్రాయానికి పరిరక్షణ

- వీధి బాలల సంరక్షణకు ఈ నెలలో స్పెషల్ డ్రైవ్
- శిశు గృహాలు, బాల సదనాల తరలింపునకు ఏర్పాట్లు
- ఇందుకోసం ఏటా కనీసం రెండు పర్యాయాలు 'ఆపరేషన్ ముస్కాన్', 'ఆపరేషన్ స్మైల్'

పసిప్రాయాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం, మహిళా శిశు సంక్షేమ శాఖ నడుం బిగించాయి. పిల్లలు వివిధ కారణాలతో తప్పిపోవడం, లేదా ఇతర కారణాలతో వీధి బాలలుగా మారుతుండడాన్ని దృష్టిలో పెట్టుకుని వారిని సంరక్షించి వారికి విద్యాబుద్ధులు నేర్పించే బాధ్యతను చేపట్టాయి.




**మన తెలంగాణ** / హైదరాబాద్ : వీధి బాలల పరిరక్షణ కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ ఈ నెలలో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించనుంది. ఆడుకునే పసిప్రాయపు పిల్లలు వివిధ కారణాలతో తప్పిపోవడం, లేదా ఇతర కారణాలతో వీధి బాలలుగా మారుతుండడాన్ని దృష్టిలో పెట్టుకుని వారిని సంరక్షించి వారికి విద్యాబుద్ధులు నేర్పించే బాధ్యతను ప్రభుత్వం, మహిళా శిశు సంక్షేమ శాఖ చేపట్టింది. ఈ క్రమంలో ఏటా కనీసం రెండు పర్యాయాలు ఆపరేషన్ 'ముస్కాన్', 'ఆపరేషన్ స్మైల్ పేర్లతో వీధి బాలలను గుర్తించి వారిని శిశు గృహాలు, బాల సదన్‌లకు అప్పగిస్తోంది. చదువు, వసతి, భోజనం తదితర సౌకర్యాలన్నీ కూడా మహిళా శిశు సంక్షేమశాఖ చూస్తోంది. చిన్నారుల చేత వీధుల్లో భిక్షాటన చేయించడం నేరమని మహిళా శిశు సంక్షేమ శాఖ చెప్తున్నా స్పెషల్ డ్రైవ్‌లో వీధుల్లో చిన్నారులు ఏటా వేల సంఖ్యలోనే అధికారులకు దొరుకుతున్నారు. గడచిన మూడేళ్లలో ఇలా అధికారులకు లభిస్తున్న గణాంకాలను పరిశీలిస్తే.. 2014–15 ఆర్థిక సంవత్సరంలో 1757 మంది పిల్లలు, 2015–16 ఆర్థిక సంవత్సరంలో 8976 మంది పిల్లల్ని పట్టుకుని సంరక్షణా కేంద్రాలకు తరలించారు. 2016–17 ఈ సంఖ్య కొంత తగ్గి 6318గా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2017–18లో ఇప్పటి వరకు లభించిని వీధి బాలల సంఖ్య 2496గా నమోదైంది. రానున్న రోజుల్లోనూ ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్‌ను మరింత పకడ్బందీగా నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే ఈ నెలలోనూ మరో సారి హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లోనూ వీధి బాలలను శిశు గృహాలు, బాల సదనాలకు తరలించేందుకు మరో సారి స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**బీహార్ గ్యాంగ్‌ల పనేనా?**

పట్టుబడ్డ చిన్నారులు ఎక్కడి నుండి వచ్చారు? వారిని భిక్షాటన వృత్తిలోకి ఎవరు నెట్టారన్న విషయాన్ని అధికారులు ఆరా తీయగా పలు విస్మయపరిచే అంశాలు ఆ చిన్నారులు వివరించినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. తల్లిదండ్రుల పేర్లు గానీ, ప్రాంతం కానీ చెప్పలేని ఆ చిన్నారులు దళారుల వలలో చిక్కుకుంటున్నారని, ఏడాది రెండేళ్ల నుండి వారు ఈ వృత్తిలో ఉంటున్నట్లు తెలిసిందని అధికారులు పేర్కొంటున్నారు. చిన్నారులు అందిస్తున్న సమాచారం ఆధారంగా వారిని ఈ భిక్షాటన వృత్తిలోకి దింపుతున్న ముఠాలు, గ్యాంగ్‌లను పట్టుకునేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

## ప్రజావసరాల మేరకు పరిశోధనలు

### శాస్త్రవేత్తలు పరిశోధనలను ఆచరణలోకి తేవాలి : కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి సుజనా చౌదరి






**మన తెలంగాణ**/శామీర్‌పేట (మేడ్చల్ జిల్లా) : శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి వదలకుండా వాటిని ఆచరణలోకి తీసుకురావాలని కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన శాఖ సహాయ మంత్రి వై.సుజనా చౌదరి అన్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పరిధిలోని లియోనియా రిసార్ట్స్‌లో జరుగుతున్న కణజీవ శాస్త్ర అంతర్జాతీయ సదస్సులో భాగంగా ఆదివారం రాత్రి జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శాస్త్రవేత్తలు కాలానికి అనుగుణంగా కొత్త పరిశోధనలపై దృష్టి సారించాలని అన్నారు. ప్రయోగశాలలకు పరిమితం కాకుండా పరిశోధన ఫలితాలు ప్రజలకు అందేలా కృషి చేయాలని సూచించారు. గతంలో పరిశోధనలను పట్టించుకునే వారు కాదని, నేడు ప్రభుత్వాలు సైతం ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. అమెరికా లాంటి దేశాలలో పరిశోధనలను వ్యాపార దృక్పథంతో చూస్తుండటంతో భాగా ముందుకు సాగుతుందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని ప్రయోగాలు చేయాల్సిన అవసరం ఉందని, శాస్త్రవేత్తలకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఇలాంటి సదస్సులు మన దేశంలో జరగడం అభినందనీయమని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా పరిశోదనలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ దేశాల ప్రతినిధులు రఘు కల్లూరి, ఇపికె రెడ్డి, అశోక్ వెంకట రామన్, రామస్వామి, గాయత్రి, సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ హత్యలో పెద్దల హస్తం : భట్టి విక్రమార్క



.మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి: కాంగ్రెస్ జిల్లా నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే బట్టి విక్రమార్క ఆరోపించారు. ఆదివారం ఆయన శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషుల్ని కిరాతకంగా చంపుతుంటే పోలీస్ వ్యవస్థ ఏం చేస్తోందన్నారు. అసలు రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ వుందా.. అన్న అనుమానం కలుగుతోందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త శ్రీనివాస్ హత్యలో పెద్దల హస్తం వుందన్నారు. హత్య జరిగిన సంఘటనను బట్టి చూస్తే ఇంటిలో వున్న శ్రీనివాస్‌ను పథకం ప్రకారం బయటకు రప్పించి హత్య చేయడంలో రాజకీయ ప్రమేయం వుందని తెలుస్తోందన్నారు. పోలీసులు ప్రజల కోసం కాకుండా అధికార పార్టీ రక్షణ కవచాలుగా మారారని విమర్శించారు. శ్రీనివాస్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సంకు ధనలక్ష్మి, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు పోలె డేవిడ్ పాల్గొన్నారు.

**శ్రీనివాస్‌ది రాజకీయ హత్యే : ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి**

నల్లగొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ లక్ష్మి భర్త శ్రీనివాస్‌ది ముమ్మాటికి రాజకీయ హత్యేనని ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్ నాయకులకు గ్రామస్థాయి నుండి సైతం కార్యకర్తలు లేక కాంగ్రెస్‌లో ఉన్న బలమైన నాయకులను కొనుగోలు చేయడం లేదా బెదిరింపులు, హత్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. శ్రీనివాస్ ఫోన్‌కాల్ డేటాను పరిశీలించకుండా, సీసీ కెమెరాలను పరిశీలించకుండా ఎస్పీ శ్రీనివాస్‌రావు కేసును సాధారణ స్థాయిలో తీసుకోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనివాస్ చనిపోయిన రోజున తాను, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ నాయకులు గడియారం సెంటర్ వద్ద చేసిన ధర్నాలో మృతుడు శ్రీనివాస్ ఫోన్‌కాల్‌కు సంబంధించి డేటాను ఎంక్వైరీ చేయించాలని ఎస్పీతో డిమాండ్ చేస్తే గంటలోపే కాల్‌డేటాను ఇస్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించామన్నారు. ఐదు రోజులు గడిచినప్పటికీ కాల్‌డేటాను ఇవ్వలేకపోవడం వెనుక ప్రభుత్వ ఒత్తిళ్లు ఉన్నాయనేది అర్ధమవుతుందన్నారు.

## కోర్టులు న్యాయ సేవా కేంద్రాలు

- తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్‌కె జైస్వాల్



**మన తెలంగాణ**/జోగిపేట : కోర్టులంటే పేదలు, అర్హులకు న్యాయమందించే సేవా కేంద్రాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్‌కె జైస్వాల్ అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా, జోగిపేట పట్టణంలో నిర్మించిన మున్సిఫ్ కోర్టు నూతన భవనాన్ని ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు న్యామూర్తి జస్టిస్ కె.రజనితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కోర్టులు, న్యాయ వ్యవస్థ అనేవి సమాజానికి అతీతం కాదని, సమాజంలో అవి ఓ భాగమన్నారు. పేదలకు, అర్హులకు న్యాయం చేసే దిశగా న్యాయవ్యవస్థ, కోర్టులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు పనిచేయాలని సూచించారు. అలాగే కేసుల సత్వర పరిష్కారం కోసం న్యాయ వ్యవస్థతో పాటు పోలీసు, రెవెన్యూ శాఖలు కూడా సమన్వయంతో పని చేయాలన్నారు. కేసుల పరిష్కారం కోసం పోలీసులు, రెవెన్యూ అధికారులు తరుచుగా తమ పరిధిలోని న్యాయమూర్తులతో సమావేశమై ఆయా కేసుల గురించి చర్చించాలన్నారు. నెలలో ప్రతి మూడో శనివారం నాడు కోర్టుకు వెళ్లి కేసుల విషయమై న్యాయమూర్తితో సంప్రదించాలన్నారు. కేసుల పరిష్కారంలో ప్రస్తుత నూతన టెక్నాలజీలు ఎంతో ఉపయోగపడ్తాయని ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రజని అన్నారు. ఇటీవల పోలీసులు చాలా సునిశితంగా వ్యవహరిస్తున్నారన్నారు. స్థానిక న్యాయమూర్తి స్వాతిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా కోర్టు న్యాయమూర్తి కళ్యాణ్‌చక్రవర్తి, జిల్లా కలెక్టర్ మాణిక్‌రాజ్ కణ్ణన్, పాల్గొన్నారు.




## సిఎంగా కొనసాగే నైతిక అర్హత కెసిఆర్‌కు లేదు

- బతుకమ్మ బడ్జెట్‌తో రైతు ఆత్మహత్యలను నివారించొచ్చు
- టిజెఎసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం

**మన తెలంగాణ**/ఎన్‌జిఓస్ కాలనీ (వరంగల్ జిల్లా) : బంగారు తెలంగాణ అని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి మాయమాటలు చెప్పడమే కాని రైతు బతుకుల్లో బంగారం ఏమీ లేదని టిజాక్ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. ముఖ్యమంత్రిగా కెసిఆర్ కొనసాగే నైతిక అర్హత లేదని, రైతులు అభిప్రాయపడుతున్నారన్నాని ఆయన పేర్కొన్నారు. ఆదివారం హన్మకొండ నయీంనగర్‌లోని చైతన్య డిగ్రీ కళాశాలలో జరిగిన టిజెఎసి ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న 2019 ఎన్నికల్లో రైతులు కలిసి కట్టుగా ఉంటే ప్రభుత్వాన్ని మార్చవచ్చని అనుకూల ప్రభుత్వాన్ని ఎన్నుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విదేశాలలో బతుకమ్మ పండుగ కోసం ఖర్చు చేసిన డబ్బులతో రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలను నివారించవచ్చని తెలంగాణ జెఎసి చైర్మన్ కోదండరాం అన్నారు. 24 గంటల విద్యుత్ వల్ల ఏ ఒక్క రైతుకు లాభం చేకూరడం లేదన్నారు. ఫిబ్రవరి 4న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని టిజెఎసి నాయకులందరు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. అంబటి శ్రీనివాస్, పొట్ట భిక్షపతి మాదిగ, టిజెఎసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'టిఒడి' పేరుతో అదనపు బాదుడు వద్దు : పారిశ్రామికవర్గాలు

**మన తెలంగాణ**/హైదరాబాద్: పీక్ సమయాల్లో (సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు) వినియోగించే విద్యుత్‌పై అధిక చార్జీలు వసూలు చేయడాన్ని పారిశ్రామికవర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. 'టైం ఆఫ్ ద డే' (టిఒడి) చార్జీల పేరుతో సాధారణ చార్జీల కంటే అధికంగా డిస్కంలు వసూలు చేయడాన్ని తప్పుపడుతున్నాయి. గతంలో విద్యుత్ కొరత ఉన్న సమయంలో, లభ్యత తక్కువగా ఉండి, అధిక ధరలకు బయట నుంచి కొని సరఫరా చేస్తున్న నేపథ్యంలో పీక్ సమయాల్లో వినియోగంపై ఆంక్షలు విధించడం ఫర్వాలేదుగానీ దేశ వ్యాప్తంగా మిగులు విద్యుత్ ఉండి, విద్యుత్ ఉత్పత్తి సంస్థలే షట్‌డౌన్ చేస్తున్న సందర్భాల్లోనూ టిఒడి పేరుతో అదనపు బాదుడు సమంజసం కాదని పారిశ్రామిక వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. 'మీ కరెంటు ధర ఎక్కువ.. బయట తక్కువ ధరకు వస్తుంటే కొంటున్నాం.. దానిపైనా సర్‌చార్జి వేస్తున్నారు.. మీరిచ్చే కరెంటుపైనా ఇప్పటికే అధికంగా చార్జీలు ఉన్నాయి. దీనికి తోడు పీక్ సమయాల్లో వినియోగంపై అధిక చార్జీలెందుకు' అని పారిశ్రామికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన దక్షిణ మధ్య రైల్వే, బిఎస్‌ఎన్‌ఎల్ మొదలుకొని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు సంస్థల నుంచి డిస్కంలు 'టిఒడి' చార్జీలు వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే చార్జీలు అధికంగా ఉన్నాయని, దీనికి తోడు మళ్లీ టిఒడి చార్జీలేంటని పారిశ్రామిక వర్గాల్లో అంతర్గత చర్చ జరుగుతోంది. టిఒడి చార్జీలు ఎత్తివేయాలని, హెచ్‌టి కేటగిరీల్లో చార్జీలు భారీగా తగ్గించాలని పారిశ్రామిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు టిఎస్ఇఆర్‌సి ముందు బహిరంగ విచారణలో అభిప్రాయం వ్యక్తం చేయడానికి సన్నద్ధమవుతున్నాయి.

## విత్తన నిల్వకు నెదర్లాండ్స్ సహకారం

**మన తెలంగాణ**/హైదరాబాద్ : రాష్ట్రంలో విత్తన నాణ్యత, ఆహార ధాన్యాల నిల్వపై నెదర్లాండ్స్ ప్రతినిధి బృందం ప్రయోగాత్మకంగా సాంకేతిక సహకారం అందించడానికి ముందుకు వచ్చింది. నగరంలోని విత్తన, సేంద్రీయ ధృవీకరణ సంస్థ కార్యాలయాన్ని నెదర్లాండ్స్ బృందం ఆదివారం సందర్శించింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ కార్యదర్శి సి.పార్థసారధి, విత్తన ధృవీకరణ సంస్థ డైరెక్టర్ కె. కేశవులుతో తమ ఆలోచనలు పంచుకున్నారు. అనంతరం అఫ్లోటోక్సిన్ సంబంధిత ప్రాజెక్టులపై పనిచేయడానికి ఆసక్తిగా ఉందని, విత్తన, ఆహార పదార్థాల నిల్వపై సహకారం అందించాలని పార్థసారధి ప్రతిపాదించగా, ఆ బృందం తమ సంసిద్ధతను వ్యక్త పరిచింది. విత్తన నాణ్యత కాపాడడం, ఆహార గింజలలో ఆస్పిరగిలస్ అనే శిలీంధ్రం ఉత్పత్తి చేసే అఫ్లోటోక్సిన్ అనే రసాయనం లేకుండా చేయడంపై సహకారం ఇస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ త్వరలోనే విత్తనాల ఫోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీపై హైదరాబాద్‌లో ఓ సదస్సు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విల్లియమ్ ఎస్. పెరెల్, చెరిల్ ఈ. హ్యారిసన్, ఎస్ఆర్ఎన్ రెడ్డి, విత్తన ధృవీకరణ సంస్థ అధికారులు జి.సుదర్శన్, ప్రదీప్, అతుల్ తదితరులు పాల్గొన్నారు.

## అతనితో డ్యాన్స్ కష్టం

ఎన్టీఆర్ అంటే సమంతకు ఎంతో భయమట. అతనితో కలిసి నటించడాన్ని పూర్తిగా ఎంజాయ్ చేస్తానని... కానీ ఎన్టీఆర్ డ్యాన్సింగ్ టాలెంట్ చూస్తే మాత్రం భయపడిపోతానని చెబుతోంది సమంత. ''సౌతిండియాలోని బెస్ట్ డ్యాన్సర్లలో ఎన్టీఆర్ ఒకరు. అతనితో కలిసి డ్యాన్స్ చేసినప్పుడు స్టెప్స్ మ్యాచ్ కావాలంటే చాలా కష్టం. ఎన్టీఆర్ ఎంతో స్పీడుగా డ్యాన్స్ చేసేస్తాడు. ఎటువంటి డ్యాన్స్ అయినా అతను ఎంతో సులభంగా చేసేస్తాడు. పెద్దగా ప్రాక్టీస్ లేకుండానే కష్టమైన స్టెప్స్ కూడా వెంటనే చేసేసి అందరినీ ఆశ్చర్యపరుస్తాడు''అని సమంత చెప్పింది. ఇక తనకు వరల్డ్‌వైడ్ ఫేవరేట్ హీరో ఎడ్డీ రెడ్‌మేన్ అని పేర్కొంది. మలయాళంలో మాత్రం దుల్కర్ సల్మాన్ తన ఫేవరేట్ హీరో అని చెప్పింది. 'షాషంక్ రిడిప్షన్' సినిమా తన ఆల్‌టైమ్ ఫేవరేట్ ఫిల్మ్ అని చెప్పిన సమంత ప్యారిస్ తనకిష్టమైన హాలీడే ప్లేస్ అని వివరించింది.





'టచ్ చేసి చూడు' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో వి.వి.వినాయక్, రవితేజ, సీరత్‌కపూర్, రాశీఖన్నా, విక్రమ్ సిరికొండ, నల్లమలుపు శ్రీనివాస్, వల్లభనేని వంశీ తదితరులు

## రవితేజ వయసు తగ్గుతూ వస్తోంది

రవితేజ హీరోగా రాశీఖన్నా, సీరత్‌కపూర్‌లు హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'టచ్ చేసి చూడు'. బేబీ భవ్య సమర్పణలో లక్ష్మీ నరసింహ ప్రొడక్షన్స్ పతాకంపై నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ సంయుక్తంగా నిర్మించిన చిత్రమిది. విక్రమ్ సిరికొండ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తిచేసుకొని యు/ఎ సర్టిఫికెట్‌ను పొందింది. ఫిబ్రవరి 2న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో వి.వి.వినాయక్ సినిమా ఆడియో సీడీలను విడుదల చేశారు. అనంతరం రవితేజ మాట్లాడుతూ ''జామ్ 8 వండరఫుల్ మ్యూజిక్‌ను అందించారు. రామ్‌లక్ష్మణ్, వెంకట్, రవివర్మ, అన్బు అరివు, పీటర్ హెయిన్స్ అందరూ మంచి యాక్షన్ సీన్స్ కంపోజ్‌చేశారు. రాశీఖన్నా, సీరత్ కపూర్ ఎంత అందంగా ఉంటారో అంతే అందమైన నడవడిక ఉన్నావారు. మిరపకాయ్ చిత్రం నుండి విక్రమ్‌తో నాకు మంచి పరిచయం ఉంది. అతను సినిమాను అద్భుతంగా తీశాడు. వక్కంతం వంశీ మంచి కథను అందించాడు''అని అన్నారు. దర్శకుడు విక్రమ్ సిరికొండ మాట్లాడుతూ ''వినాయక్ నాకు ఫిల్మ్ గురు. చాలా మంచి విషయాలను ఆయన నుండి నేర్చుకున్నాను. వక్కంతం వంశీ అద్భుతమైన కథను అందించాడు. సంగీతాన్ని అందించిన జామ్ 8, నేపథ్య సంగీతాన్ని అందించిన మణిశర్మకు థాంక్స్. రాశీఖన్నా, సీరత్‌లు గ్లామర్‌తోనే కాదు నటనతోనూ మెప్పించారు. తన నుండి ఎనర్జీని మరొకరికి కూడా ఇచ్చే వ్యక్తి రవితేజ. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రంతో డైరెక్టర్‌గా పరిచయం కావడం నా అదృష్టం''అని తెలిపారు. వి.వి.వినాయక్ మాట్లాడుతూ ''ఈ సినిమా దర్శకుడు విక్రమ్ నాతో కలిసి పనిచేశాడు. సినిమాలో రెండు రీళ్లు చూశాను. సినిమాను విక్రమ్ ఎంతో అద్భుతంగా తీశాడు. రవితేజ వయసు తగ్గుతూ వస్తోంది. విక్రమార్కుడు సినిమా చూసి ఎలా ఫీలయ్యామో ఈ సినిమా చూసినప్పుడు కూడా అలాగే ఫీలవుతాం''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ, హరీశ్ శంకర్, జెమిని కిరణ్, కాసర్ల శ్యామ్, కొడాలి వెంకటేశ్వరరావు, మార్క్ కేడీ మ్యూజ్, కొడాలి వెంకటేశ్వరరావు, ఆకాష్‌సేన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## టిపికల్ క్యారెక్టర్‌లో నారా రోహిత్

రొటీన్‌కు భిన్నంగా వైవిధ్యమైన కథ, కథనాలను ఎంచుకుంటూ కథానాయకుడిగా తనకంటూ ఓ ప్రత్యేకమైన ఇమేజ్‌ను సొంతం చేసుకున్న నారా రోహిత్ తాజాగా ఈ.ఎం.వి.ఈ స్టూడియోస్ సంస్థలో ఓ సినిమాకు సైన్ చేశాడు. ఈ.ఎం.వి.ఈ స్టూడియోస్ ప్రొడక్షన్ నం.3గా తెరకెక్కనున్న ఈ చిత్రం ద్వారా ఎస్.డి.చక్రవర్తి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. వైవిధ్యమైన కథతో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మార్చి నుంచి ప్రారంభంకానుంది. వడ్డేపల్లి సత్యనారాయణ సమర్పణలో రూపొందనున్న ఈ చిత్రంలో నారా రోహిత్ క్యారెక్టరైజేషన్, గెటప్ చాలా టిపికల్‌గా ఉండబోతున్నాయి. ప్రస్తుతం తమ ప్రొడక్షన్‌లో రూపొందిన 'హౌరా బ్రిడ్జి' విడుదలలో బిజీగా ఉన్న ఫిల్మ్‌మేకర్స్.. ఆ సినిమా రిలీజ్‌కాగానే నారా రోహిత్ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి సాయికార్తీక్ సంగీతాన్ని అందించనున్నాడు.



నారా రోహిత్



లావణ్య త్రిపాఠి, సాయిధరమ్‌తేజ్, ప్రభాస్, వి.వి.వినాయక్, సి.కళ్యాణ్

## తేజు చిరంజీవిలా ఉన్నాడు

సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి హీరోహీరోయిన్లుగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి. పతాకంపై వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మిస్తున్న చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. భారీగా వ్యూస్ సాధిస్తూ ట్రెండింగ్ అవుతోంది. 'ఇక మీదట పేదోడికి ప్లాట్‌ఫామ్... ధర్మాభాయ్ డాట్‌కామ్' అంటూ సాయిధరమ్ తేజ్ చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్‌తోనే సినిమా ఏ రేంజ్‌లో ఉంటుందో అర్థమవుతోంది. ఎస్.ఎస్.తమన్ సంగీత దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలోని మొదటి పాటను స్టార్ హీరో ప్రభాస్ విడుదల చేశారు. 'లెట్స్ డు...' అంటూ వచ్చే ఈ పాటను చంద్రబోస్ రాశారు. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ ''ఈ సినిమాలో నా ఫేవరేట్ పాట 'చమకు చమకు ఛాం...'. చిరంజీవి పాటల్లో ది బెస్ట్ సాంగ్ ఇది. ఆ పాటను మెగాస్టార్ సూపర్బ్‌గా చేశారు. తేజు ఎలా చేశాడోనని ఆతృతగా ఎదురుచూస్తున్నాను. వినాయక్ బ్లాక్‌బస్టర్ మూవీ 'ఇంటిలిజెంట్'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు''అని అన్నారు. వి.వి.వినాయక్ మాట్లాడుతూ ''ప్రభాస్ అంటే స్నేహానికి నిలువెత్తు రూపం. ఇలాంటి మనిషి సినిమా ఇండస్ట్రీలో ఉండటం చాలా అరుదు. ఇక సినిమా టీజర్‌లో తేజు చిరంజీవిలా ఉన్నాడని అంటుంటే చాలా సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో తేజు ఇరగదీశాడు. లావణ్య తొలిసారి కమర్షియల్ హీరోయిన్ క్యారెక్టర్‌లో నటించింది''అని తెలిపారు. సాయిధరమ్‌తేజ్ మాట్లాడుతూ ''మా చిత్రంలోని తొలి పాటను ప్రభాస్ లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. లావణ్య మంచి క్యారెక్టర్‌లో నటించింది. అందరం ఎంతో కష్టపడి పనిచేశాం. ఫిబ్రవరి 9న ఈ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సి.కళ్యాణ్, ఆకుల శివ పాల్గొన్నారు.

## క్రేజీ కాంబినేషన్‌లో...



అల్లరి నరేష్, సునీల్

ప్రస్తుతం టాలీవుడ్‌లో కొందరు హీరోలకు వరుసగా ఫ్లాప్‌లు ఎదురవుతున్నాయి. వాళ్లు ఏ సినిమా చేసినా నిరాశ తప్పడం లేదు. ప్రస్తుతం హీరోలు అల్లరి నరేష్, సునీల్‌ల పరిస్థితి ఇలాగే ఉంది. ఒకప్పుడు కామెడీ సినిమా చూడాలంటే అల్లరి నరేష్ మాత్రమే ఛాయిస్‌గా ఉండేవాడు. ఇప్పటికి నరేష్ చేసిన సినిమాలు టీవీలో వస్తే చూసే ప్రేక్షకులు చాలానే ఉన్నారు. అలాంటి నరేష్ గత నాలుగేళ్లుగా హిట్ లేక సతమతమవుతున్నాడు. సీరియస్ జోనర్‌లోకి వెళ్లి 'బందిపోటు' చేసినా, లవ్‌స్టోరీతో 'మేడ మీద అబ్బాయి' చేసినా హార్రర్ మూవీ 'ఇంట్లో దెయ్యం నాకేం భయం' చేసినా ఏది హిట్ కాలేదు. ఇక సునీల్ పరిస్థితి సరేసరి. ఇటీవల వచ్చిన '2 కంట్రీస్' చిత్రం పరాజయం పాలైంది. ఇప్పుడు ఈ ఇద్దరు ఒక సినిమా కోసం కలిసి పనిచేస్తున్నారు. విడుదలకు సిద్ధంగా ఉన్న 'ఆచారి అమెరికా యాత్ర' దర్శకుడు జి.నాగేశ్వర్ రెడ్డి దర్శకత్వంలో ఓ తమిళ్ హిట్ మూవీ రీమేక్‌గా ఇది రూపొందుతోంది. తాజాగా షూటింగ్‌ను ప్రారంభించుకున్న ఈ చిత్రం అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందట. భీమినేని శ్రీనివాసరావు నిర్మిస్తున్న ఈ మూవీలో నందిని రాయ్ ఒక హీరోయిన్‌గా ఎంపికైంది. ఇది 'సుడిగాడు' సీక్వెల్ తరహాలో ఉంటుందని టాక్. మరి ఈ చిత్రమైనా ఈ ఇద్దరికి హిట్‌ను అందిస్తే కామెడీ శకం మళ్లీ మొదలైనట్టే.



'యు కథే హీరో' మోషన్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సుకుమార్. చిత్రంలో కొవెరా, మధు.

## కథే హీరోగా...

కొవెరా క్రియేషన్స్ బ్యానర్‌పై నూతన దర్శకుడు కొవెర దర్శకత్వం వహిస్తున్న 'యు కథే హీరో' చిత్రం మోషన్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు సుకుమార్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ ''ఈ సినిమా లైన్ వినగానే ఎంతగానో నచ్చింది. మోషన్ పోస్టర్‌ని కూడా కథానుగుణంగా చాలా వినూత్నంగా డిజైన్ చేశారు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను''అని అన్నారు. దర్శకుడు కొవెరా మాట్లాడుతూ ''యు మోషన్ పోస్టర్‌ను సుకుమార్ చేతులమీదుగా లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. నేను వి.రాజేంద్రప్రసాద్ దగ్గర పనిచేశాను. కొన్ని సినిమాలకు రచయితగా కూడా చేసి తొలి ప్రయత్నంగా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాను''అని తెలిపారు. స్క్రీన్‌ప్లే రచయిత మధు మాట్లాడుతూ ''ఈ సినిమా కథ చాలా కొత్తగా ఉంటుంది. అందుకే 'కథే హీరో' అని క్యాప్షన్ పెట్టాం. త్వరలో విడుదలకానున్న ఈ సినిమాలో కొత్త హీరో,హీరోయిన్‌లతో పాటు తనికెళ్లభరణి, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పూర్తిచేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది''అని చెప్పారు. కొవెర, హిమాన్షి కాట్రగడ్డ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో రాఘవ, నాగి, రోహిణి, సంధ్య, స్వప్నరావు, లహరి, దొరబాబు తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః రాకేష్‌గౌడ్, మ్యూజిక్ః సత్య మహావీర్, ఎడిటింగ్ః ప్రవీణ్ పూడి, డైలాగ్స్ః మహి ఇల్లింద్ర, కరుణ్ వెంకట్.

## మంచి కుటుంబ కథా చిత్రం



సుహాసిని, హేమలత, సుమన్

వీరభద్ర క్రియేషన్స్ పతాకంపై నూతన నటులు శ్రీకాంత్, హేమలత హీరోహీరోయిన్‌లుగా సుహాసిని, సుమన్, భానుచందర్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నిన్నే చూస్తు'. వి.ఎస్.ఫణీంద్ర దర్శకత్వంలో హేమలతా రెడ్డి నిర్మిస్తున్న చిత్రమిది. ఇటీవలే మొదటి షెడ్యూల్‌ను పూర్తిచేసుకొని ఇప్పుడు రెండవ షెడ్యూల్‌ను ప్రారంభించింది ఈ చిత్రం. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సందర్భంగా నిర్మాత హేమలతా రెడ్డి మాట్లాడుతూ ''మంచి కుటుంబ కథా చిత్రమిది. సీనియర్ నటులు సుహాసిని, సుమన్, భానుచందర్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. వారు నటించిన సన్నివేశాలు చాలా బాగా వచ్చాయి. సినిమా చాలా బాగా వస్తోంది. ఇప్పుడు రెండవ షెడ్యూల్‌ను మొదలుపెట్టాము. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్నాము. షూటింగ్ పూర్తిచేసి త్వరలోనే మా చిత్రాన్ని విడుదల చేస్తాము''అని అన్నారు. కిన్నెర, కాశీవిశ్వనాథ్, నిహాల్, వేణు, మహేష్, ఫణి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఫొటోగ్రఫీః ప్రసాద్ ఈదర, సంగీతంః రమణ్ రాథోడ్, ఎడిటింగ్ః వి.నాగిరెడ్డి, మాటలుః కరణ్ గోపి.



క్యాథరిన్

## కడుపుబ్బ నవ్వించే 'చెన్నై చిన్నోడు'

జి.వి.ప్రకాష్ కుమార్, నిక్కీ గల్రాని జంటగా నటించిన ఓ తమిళ చిత్రాన్ని తెలుగులో 'చెన్నై చిన్నోడు' పేరుతో విడుదల చేస్తున్నారు. శూలిని దుర్గా ప్రొడక్షన్స్ పతాకంపై వి.జయంత్‌కుమార్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. యశ్వంత్ సాయికుమార్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి ఎం.రాజేష్ దర్శకుడు. ఈ సినిమా టీజర్, ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని ఫిలింఛాంబర్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన నిర్మాత కె.వి.సత్యనారాయణ టీజర్, ఫస్ట్‌లుక్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ''తమిళ్‌లో పెద్ద హిట్ అయిన ఈ సినిమాను తెలుగులో చక్కని క్యాచీ టైటిల్‌తో జయంత్ అనువదిస్తున్నాడు. జయంత్ భవిష్యత్తులో పెద్ద నిర్మాతగా పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను. ఈ చిత్రంలో ప్రకాష్‌రాజ్ పాత్ర చాలా బాగుంటుందని అంటున్నారు. ఈ చిత్రం మంచి విజయం సాధించాలి''అని అన్నారు. నిర్మాత వి.జయంత్ కుమార్ మాట్లాడుతూ ''తమిళ సినిమా బాగా నచ్చడంతో ఇలాంటి మంచి సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందించాలన్న ఉద్దేశ్యంతో చేస్తున్న ప్రయత్నమిది. ఆద్యంతం కడుపుబ్బ నవ్వించే చక్కని కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. ప్రకాష్‌రాజ్ పోలీస్ పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. జి.వి.ప్రకాష్ చక్కటి నటనతో పాటు సినిమాకు మంచి సంగీతాన్ని కూడా అందించారు. అందమైన ఫారెన్ లొకేషన్లలో పాటలను చిత్రీకరించారు''అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎన్.కృష్ణ, పాటల రచయిత సి.హెచ్. పూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.



## ఆ పాత్రల కోసం ఎదురుచూస్తున్నా

గ్లామర్ పాత్రలకు తనను ఎక్కువగా వాడుకుంటున్నారని తెగ బాధపడుతోంది కథానాయిక క్యాథరిన్. టాలీవుడ్‌లో అంతగా రాణించలేకపోయిన ఈ భామ కోలీవుడ్‌లో గట్టిపోటీ ఉన్నా అవకాశాలను బాగానే రాబట్టుకుంటోంది. తెలుగులో ఒకటి, రెండు హిట్ చిత్రాల్లో మెరిసిన ఈ భామ తమిళ్‌లో మాత్రం గ్లామరస్ తారగా రాణిస్తోంది. తమిళ్‌లో ఆమె నటించిన కొన్ని చిత్రాలు విజయం సాధించినా వాటిలో ఈ అమ్మడు గ్లామర్ డాల్ పాత్రలకే పరిమితమైంది. దీంతో ఎంతో బాధ పడిపోతున్న క్యాథరిన్ తనను దర్శకనిర్మాతలు గ్లామర్ రోల్స్‌కే వాడుకుంటున్నారని తెగ బాధపడిపోతోంది. గ్లామర్ పేరుతో పొట్టి దుస్తులను ధరింపచేస్తున్నారని వాపోతోంది. గ్లామరస్ పాత్రలతో అభిమానులు పెరుగుతున్నారన్నది కాస్త సంతోషంగా ఉన్నా... మరీ అలాంటి పాత్రలకే తనను ట్రేడ్‌మార్క్‌గా మార్చేయడం బాధగా ఉందని పేర్కొంది. ఎన్ని చిత్రాలు చేశామన్నది కాకుండా... ఎంత మంచి పాత్రలు పోషించామన్నదే ముఖ్యమని చెప్పింది క్యాథరిన్. కెరీర్‌లో గొప్పగా నిలిచే పాత్రల కోసం ఎదురు చూస్తున్నానని ఈ భామ చెప్పింది. నటనకు అవకాశం ఉన్న పాత్రలు లభిస్తే తన సత్తాచాటుతానంటోంది ఈ బ్యూటీ.

## అనుష్క అంటే ఇష్టం

టాలీవుడ్‌లో యంగ్ హీరోయిన్‌గా రాణిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న భామ రాశీఖన్నా. ఆమె ఈమధ్య స్టార్ హీరోయిన్లతో సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటోంది. అయితే ఈమధ్య కాలంలో తాను చాలా సినిమాల్ని వద్దనుకున్నానని చెప్పింది రాశి. పాత్రలు నచ్చకే తాను అలా చేశానని చెబుతోంది ఈ ముద్దుగుమ్మ. ''నా పాత్రలకు ప్రాధాన్యం ఉండాలని కోరుకుంటా. ఊరికే పాటల్లో కనిపించి వెళ్లిపోవడం నాకిష్టముండదు. అయితే నిజం చెప్పాలంటే కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు ఈ తరహాలోనే ఉంటాయి. ఆ పాత్రలకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు. అయినప్పటికీ ఉన్నంతలో కాస్త మెరుగ్గా ఉన్న పాత్రల్ని ఎంచుకోవాలని ప్రయత్నిస్తా. ఏ ప్రత్యేకతాలేని పాత్రల్ని తిరస్కరిస్తా. ఇలా చాలా సినిమాలు వద్దనుకున్నా''అని చెప్పింది రాశీఖన్నా. ఇక తనకు టాలీవుడ్ హీరోయిన్లలో అనుష్క అంటే ఇష్టమని... ఆమె తనకు ఒకరకంగా రోల్ మోడల్ అని ఈ భామ చెప్పింది. ''అనుష్క అద్భుతమైన పాత్రలు చేసింది. తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకుంది. ఆమెలాగా ప్రత్యేకమైన పాత్రలు చేయాలని నాకు ఆశ ఉంది. హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాల ఆఫర్ చేస్తే తప్పకుండా చేస్తా''అని రాశీఖన్నా పేర్కొంది.




రాశీఖన్నా

## 'ఐకియా' వ్యవస్థాపకుడు ఇంగ్‌వర్ కాంప్రాడ్ కన్నుమూత



**స్టాక్‌హోమ్:** స్వీడన్‌కు చెందిన 'ఐకియా' ఫర్నిచర్ సామ్రాజ్య వ్యవస్థాపకుడు ఇంగ్‌వర్ కాంప్రాడ్ తన 91వ ఏట ఆదివారం కన్నుమూశారు. ఆయన అర్ధ శతాబ్దం కిందటే ప్రపంచవ్యాప్తంగా తన ఫర్నిచర్ సామ్రాజ్యాన్ని విస్తరించారు. తన 17వ ఏటనే 1943లో 'ఐకియా' సంస్థను స్థాపించారు. కానీ ఆయన కంపెనీ ఫ్లాట్–ప్యాక్ ఫర్నిచర్‌ను 1956లో ప్రవేశపెట్టేంత వరకు గుర్తింపు, ఆదాయం లభించలేదనే చెప్పాలి. ఒక సారి తన సంస్థ కార్మికుడు కస్టమర్ కారులో ఫిట్ చేసేందుకు టేబుల్‌పై నుంచి కాళ్లు తీసేయడంతో ఆయనకు ఐడియా పుట్టింది. 'చోటును ఆదా చేస్తే డబ్బునూ ఆదా చేయవచ్చు' అనే ఆలోచన ఆయనకు అప్పుడే కలిగింది. ప్రస్తుతం ఆయన ఫర్నిచర్ కంపెనీ ఐకియా సంవత్సరానికి 50 బిలియన్ల యూరోలు(62 బిలియన్ డాలర్లు) ఆర్జించే స్థాయికి చేరుకుంది. 20వ శతాబ్దంలో ఇంగ్‌వర్ కాంప్రాడ్ ఓ ప్రముఖ పారిశ్రామికవేత్తగా గుర్తింపు తెచ్చుకున్నారు. స్వీడన్‌లోని స్మాలాండ్‌లో ఉన్న తన స్వగృహంలో ఆయన జనవరి 27న కన్నుమూశారని ఐకియా కంపెనీ తెలిపింది. 1926 మార్చి 30న స్వీడన్‌లో జన్మించిన కాంప్రాడ్ తన ఐదేళ్ల వయస్సులోనే అగ్గిపెట్టెలు అమ్మేవారు. విత్తనాలు, క్రిస్మస్ చెట్టు అలంకారాలు, పెన్సిళ్లు, బాల్–పాయింట్ పెన్నులు అమ్మే దిశకు ఆయన మరలారు. కాంప్రాడ్ జీవితాంతం కష్టించి పనిచేశారు.

## జిఎస్‌టి విజయవంతం: జైట్లీ



**న్యూఢిల్లీ:** వస్తు, సేవల పన్ను(జిఎస్‌టి) అనతి కాలంలోనే విజయవంతమైందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. దీని వల్ల పరిధిని మరింత విస్తృతం చేసేందుకు అవకాశం కల్పించినట్లయిందని తెలిపారు. అంతే కాక భవిష్యత్తులో పన్ను రేట్లను హేతుబద్ధం చేసేందుకు ఇది సూచకం కానుందని జైట్లీ పేర్కొన్నారు. మరిన్ని వస్తువులపై జిఎస్‌టి రేట్లు మారే అవకాశం కనిపిస్తోందన్నారు. 'అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం' సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సూచనప్రాయంగా ఈ విషయం వెల్లడించారు. మిగతా దేశాలతో పోలిస్తే మన దేశంలో స్వల్పకాలంలోనే జిఎస్‌టి వ్యవస్థ గాడిన పడిందన్నారు. దీంతో పన్నుల వసూళ్లను మరింత విస్తృతం చేయడంతోపాటు భవిష్యత్‌లో పన్ను రేట్లను మరింత హేతుబద్ధం చేసేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. జిఎస్‌టి దేశ పరోక్ష పన్నుల వ్యవస్థని సమూలంగా మార్చేసిందని జైట్లీ చెప్పారు.

గత ఏడాది నవంబరులో జరిగిన సమావేశంలో జిఎస్‌టి మండలి 178 వస్తువులపై జిఎస్‌టిని అత్యధిక రేటైన 28 శాతం నుంచి 18 శాతానికి కుదించింది. మరో 13 వస్తువులను 18 శాతం నుంచి 12 శాతానికి, ఎనిమిది వస్తువులను 12 శాతం నుంచి ఐదు శాతానికి, ఆరు వస్తువులను 18 శాతం నుంచి ఐదు శాతానికి కుదించింది. గత ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో నీరసించిన జిఎస్‌టి వసూళ్లు డిసెంబరులో కొద్దిగా పుంజుకున్నాయి. దీంతో జిఎస్‌టి వసూళ్లపై ఆర్థిక మంత్రిలో నమ్మకం పెరిగిందని భావిస్తున్నారు. దీనికి తోడు మరో ఏడాదిలో లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. ఈలోపే సగటు మనిషికి మరింత చేరువయ్యేందుకు మోదీ సర్కార్ జిఎస్‌టి మండలి ద్వారా జిఎస్‌టి రేట్లు మరింత కుదించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

### ర్యాంకింగ్‌లో పెరుగుదల

ప్రపంచ బ్యాంకు ఏటా ప్రకటించే సులభతర వ్యాపార విధానాల(ఇఒబి) ర్యాంకింగ్‌లో మన దేశ ర్యాంకింగ్ మరింత పెంచేందుకు అన్ని ప్రభుత్వ విభాగాలు కలిసికట్టుగా కృషి చేయాలని జైట్లీ కోరారు. 'గత ఏడాది ఈ ర్యాంకింగ్‌లో మన దేశం ఒక్కసారిగా 130వ స్థానం నుంచి 100వ స్థానానికి ఎదిగింది. కలిసికట్టుగా ప్రయత్నిస్తే టాప్50 ర్యాంకింగ్‌లో మన దేశానికి చోటు దక్కుతుంది' అన్నారు. ఈ విషయంలో పన్ను వసూళ్ల అధికారులు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. సులభతర వ్యాపార విధానాల్లో తప్ప, అంతర్జాతీయ వాణిజ్యంలో మనకు ఎలాంటి ప్రత్యేక సౌలభ్యాలు లేవనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఇఒబి విషయంలో భారత్ మూడేళ్లలోనే 142వ స్థానం నుంచి 100వ స్థానానికి చేరిందన్నారు. 'మనం మొదటి 50 ర్యాంకింగ్స్‌లో చోటు సంపాదించాలని ప్రధాని ఇప్పటికే లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటికే 142వ స్థానం నుంచి 100వ స్థానానికి వచ్చాం. యాభైలోపు ర్యాంకింగ్‌లో స్థానం సంపాదించడం కొద్దిగా సవాలే' అని జైట్లీ చెప్పారు.

### కరెన్సీ మారక రేట్లు

| | |
|---|---|
| అమెరికన్ డాలర్ | 63.28 |
| యూరో | 76.12 |
| బ్రిటిష్ పౌండ్ | 85.87 |
| ఆస్ట్రేలియన్ డాలర్ | 49.75 |
| కెనెడియన్ డాలర్ | 50.98 |
| ఎమిరైట్ దిర్హామ్ | 17.23 |
| స్విస్ ఫ్రాంక్ | 64.89 |
| చైనీస్ యువాన్ | 9.75 |
| మలేషియన్ రింగిట్ | 15.83 |
| న్యూజిలాండ్ డాలర్ | 45.36 |
| హాంగ్‌కాంగ్ డాలర్ | 8.09 |
| జపనీస్ యెన్ | 0.56 |
| కువైట్ దినార్ | 209.96 |
| సౌతాఫ్రికన్ రాండ్ | 5.14 |

### బులియన్




### బంగారం ధర

| నగరం | ధర (రూ / 10 గ్రాములు) | | |
|---|---|---|---|
| | 22క్యారట్ | 24క్యారట్ | మార్పు(%) |
| చెన్నై | 29220 | 31251.34 | 0% |
| ముంబై | 29950 | 32032.09 | 0% |
| ఢిల్లీ | 29600 | 31657.75 | 0% |
| కోల్‌కతా | 30170 | 32267.38 | 0.03% |
| కేరళ | 28150 | 30106.95 | 0% |
| బెంగళూరు | 28650 | 30641.71 | –0.35% |
| హైదరాబాద్ | 29270 | 31304.81 | –0.17% |
| గల్ఫ్ | 1431.02 | 1530.50 | –0.65% |

### వెండి ధర (రూ./ కిలో)

| నగరం | బుధవారం | మంగళవారం | మార్పు (%) |
|---|---|---|---|
| చెన్నై | 42000.00 | 42000.00 | 0.00 |
| ముంబై | 42000.00 | 42000.00 | 0.00 |
| ఢిల్లీ | 42000.00 | 42000.00 | 0.00 |
| కోల్‌కతా | 42000.00 | 42000.00 | 0.00 |
| హైదరాబాద్ | 42000.00 | 42000.00 | 0.00 |




### కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 380 | విశాఖపట్నం | 402 |
| వరంగల్ | 382 | చిత్తూరు | 388 |
| విజయవాడ | 397 | చెన్నై | 395 |
| గోదావరి | 397 | బెంగళూరు | 390 |

## గ్రామీణ ఆర్థికవ్యవస్థ, వ్యవసాయంపై
# ఆర్థిక సర్వే దృష్టి

**న్యూఢిల్లీ:** బడ్జెట్ 2018–19 ప్రవేశపెట్టడానికి ముందే ఆర్థిక సర్వే 2017–18ని పార్లమెంటులో సోమవారం విడుదల చేయనున్నారు. అయితే ఈ ఆర్థిక సర్వే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయంపై దృష్టి సారించనుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. దీంతో ప్రభుత్వం రానున్న 2019 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. దేశంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభం కారణంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా కొట్టుమిట్టాడుతున్నది. అనేక పంటల ధరలు పతనం కావడంతో వాటిని ఎలా నిభాయించాలోనని కలవరపడింది. ముఖ్యంగా ఇటీవల ఉత్తర్ ప్రదేశ్‌లో ఆలుగడ్డల ధరలు పడిపోవడంతో గుజరాత్ ఎన్నికల్లో బిజెపి దెబ్బతింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పటీదార్ ఆందోళనను కాంగ్రెస్ బాగానే సొమ్ముచేసుకుంది. గుజరాత్ ప్రాంతంలోని వ్యవసాయ సమస్యలతో పటీదార్ ఆందోళనకు మూలాలున్నాయి.



### సర్వే రూపంలో మార్పు

సాంప్రదాయికంగా ఆర్థిక సర్వేను ప్రభుత్వం చేస్తుంటుంది. దీంట్లో గత 12 నెలల కాలంలో ఆర్థిక స్థితిగతులు ఎలా ఉన్నాయన్నది సారాంశంగా చెబుతుంది. స్వల్ప కాలంలో, మధ్యావధి కాలంలో ఆర్థిక తీరుతెన్నులు ఎలా ఉండనున్నాయన్నది బేరీజు వేస్తుంది. అవసరమైనప్పుడు కొన్ని సూచనలు కూడా చేస్తుంది. అయితే ఈ విధానాన్ని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్ 2014–15 సర్వేతో మార్చేశారు. సుబ్రమణ్యన్ పత్రాన్ని(డాక్యుమెంట్) రెండుగా విభజించారు. మొదటిది ఆర్థికాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాల గురించి వెల్లడిస్తుంది. ఇక రెండోది సాంప్రదాయిక రూపంలో ప్రభుత్వ ఆర్థిక స్థితిని ప్రతిబింబిస్తుంది.

2014–15 సర్వే సాంఘిక సంక్షేమ పథకాలకు వస్తు రూపేణ కాక ఆర్థిక రూపేణ ప్రయోజనాలు కలిగించాలని పేర్కొంది. ఈ విధానాన్ని సుబ్రమణ్యన్ 'జెఎఎం ట్రినిటి' అని అభివర్ణించారు. పేదలకు జన్‌ధన్ బ్యాంక్,



ఆధార్ విశిష్ట గుర్తింపు పథకం, మొబైల్లు అన్నది ఈ జెఎఎం ప్రస్తావిస్తుంది. జెఎఎం నడవలో మోడీ ప్రభుత్వం చాలా మెల్లగా కదిలింది. అయితే అన్ని సాంఘిక సంక్షేమ పథకాలకు నగదు లావాదేవీ బదిలీలుగా మార్చింది. ఆ సర్వే ప్రభుత్వ బ్యాంకులు ఎదుర్కొంటున్న మొండి బాకీలు గురించి కూడా ప్రస్తావించింది. స్వదేశీ ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం కల్పించే వ్యూహాలను రచించింది. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కోసం జాతీయ సమీకృత మార్కెటును ఏర్పాటు చేయాలని కూడా సూచించింది. 2016–17 సర్వే పెట్టుబడి, బ్యాంకింగ్ ప్రతిష్టంభన గురించి మళ్లీ చర్చించింది. కానీ ఇతర అంశాలను కూడా వెల్లడించింది. అందులో పౌరులందరికీ ఒకే రకమైన కనీస ఆదాయం(యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్) అందించాలని, పెద్దనోట్ల రద్దు(డీమానిటైజేషన్) పర్యవసానాలపై సానుకూల అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేయడం ఉన్నాయి. అయితే అందరికీ కనీస ఆదాయం అనే అంశాన్ని ప్రభుత్వం త్వరగా ప్రక్కన పడేసింది.

### ప్రాధాన్యతల బేరీజు

ఈ సర్వేల్లో లోపించిందేమిటంటే వ్యవసాయం, గ్రామీణ ఆర్థికవ్యవస్థ, ఉపాధికల్పనలపై దృష్టిసారించడం. 2017–18 సర్వేలో ప్రభుత్వం తన దృష్టిని మిగిలిన ఉన్న అధికార కాలంలో మళ్లించాలనుకుంటోంది. ప్రభుత్వ పదవీ కాలం ఇంకా ఒక్క సంవత్సరంలో ముగియనుంది. ఇటీవల ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రభుత్వ దృష్టి రైతులపై ఉండనుందని అన్నారు. ఈ ఏడాది ఆర్థిక సర్వే గత ఆర్థిక సర్వే మాదిరిగానే సలహా, అకాడమిక్ అనాలిసిస్ మిశ్రమంగా ఉండనుంది. బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రకటించే విధాన నిర్ణయాలను సమర్థించేదిగా ఉండనుంది. వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర యంత్రాంగం వంటివి పేర్కొననున్నది.

## ఆదివారపు ఉచిత కాల్స్ కట్ !


**కోల్‌కతా:** ప్రభుత్వరంగ టెలికామ్ కంపెనీ అయిన భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బిఎస్‌ఎన్‌ఎల్) ఫిబ్రవరి 1 నుంచి ల్యాండ్‌లైన్స్‌పై ఇచ్చే ఆదివారం ఉచిత వాయిస్‌కాల్స్ ప్రయోజనాలను ఉపసంహరించుకుంటోంది. ఉచిత నైట్ కాలింగ్ ప్రయోజనాలు రద్దు చేశాక బిఎస్‌ఎన్‌ఎల్ ఇప్పుడు ఈ తాజా నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఈ విధానం అమలుకానున్నదని సమాచారం. 'అయితే ఈ నిర్ణయం వల్ల వినియోగదారులపై ప్రభావం తక్కువ పడేందుకు మేము కొన్ని ప్లాన్లు తెస్తున్నాం' అని కలకత్తా టెలిఫోన్స్(కల్‌టెల్) చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.పి. త్రిపాఠి విలేకరులకు చెప్పారు. కలకత్తా టెలిఫోన్స్ అనేది బిఎస్‌ఎన్‌ఎల్ కోల్‌కతా యూనిట్. బిఎస్‌ఎన్‌ఎల్ ఇప్పటికే జనవరి మధ్య నుంచి నైట్ వాయిస్ కాలింగ్ పథకాన్ని సవరించింది.

రాత్రి 9కి బదులుగా రాత్రి 10.30 నుంచి ఆఫర్ ఇస్తోందని కల్‌టెల్ సిజిఎంకు టెక్నికల్ సెక్రటరీ అయిన గౌతం చక్రబర్తి చెప్పారు. ఉచిత నైట్ కాలింగ్, ఉచిత సండే కాలింగ్‌లను 2016 ఆగస్టు 21న ప్రవేశపెట్టారు. దేశంలో 1 కోటి 20 లక్షల ల్యాండ్‌లైన్ కనెక్షన్లు ఉండగా కలకత్తా టెలిఫోన్స్‌కు అందులో ఆరు లక్షల ఫిక్స్‌డ్ ల్యాండ్‌లైన్లు ఉన్నాయి.




## త్వరలో ఫ్లెక్స్ ఇంజిన్ మోటార్ సైకిళ్లు

### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



**న్యూఢిల్లీ:** రెండు అతిపెద్ద బైక్ తయారీదారులు ఎలక్ట్రిక్, ఫ్లెక్స్ ఇంజిన్ మోటార్‌సైకిళ్లు భారత మార్కెట్‌లోకి ప్రవేశపెట్టనున్నారని కేంద్ర రవాణా, నావికా శాఖ మంత్రి నితిన్ గడ్కరి తెలిపారు. ఫ్లెక్స్ ఇంధనం లేక ద్వంద్వ ఇంధనం వాహనాలు పెట్రోల్, ఇథనాల్ రెండింటితో నడుస్తాయి. ఎలక్ట్రిక్ వాహనాలు, ఇథనాల్ వంటి ప్రత్యామ్నాయ వాహనాలను ప్రోత్సహించేందుకు ఆసక్తిని కనబరుస్తున్నామని కూడా ఆయన చెప్పారు. ఈ నెలకారుకల్లా విద్యుత్తుతో నడిచే అలాగే ఫ్లెక్స్ ఇంజిన్‌తో నడిచే మోటార్‌సైకిళ్లను మార్కెట్‌లోకి తీసుకొస్తామని రెండు ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ కంపెనీలు హామీ ఇచ్చాయని ఆయన చెప్పారు. ఇవి 100 శాతం పెట్రోల్, 100 శాతం ఇథనాల్‌తో నడుస్తాయని కూడా నితిన్ గడ్కరి తెలిపారు. ముడిచమురును దేశంలోకి దిగుమతి చేసుకోవడం ద్వారా రూ. 7 లక్షల కోట్ల దిగుమతి బిల్లు చెల్లించాల్సి వస్తోందని ఆయన వివరించారు. గోధుమ గడ్డి, వరి గడ్డి, వెదురు, తదితరాలతో ఇథనాల్‌ను సులువుగా తయారుచేయవచ్చని ఆయన చెప్పారు. టన్ను వరి గడ్డి 280 లీటర్ల ఇథనాల్‌ను ఉత్పత్తి చేయగలదని, దీనివల్ల కొత్త పరిశ్రమలు రాగలవని ఆయన చెప్పుకొచ్చారు. అమెరికా, బ్రెజిల్, కెనడా వంటి దేశాల్లో ఫ్లెక్స్ ఇంజిన్‌లపై మెర్సిడెస్, బిఎండబ్ల్యు, టయోట వంటి వాహనాలు నడుపుతుండగా అలాంటివే మన ఆటోమొబైల్ కంపెనీలు ఎందుకు తయారు చేయరాదని ఆయన నిలదీశారు. లీటరు ఇథనాల్ ఖరీదు లీటరు పెట్రోల్ ఖర్చులో సగమే ఉండగలదని ఆయన తెలిపారు. రూ. 70,000 కోట్ల ఖర్చుతో చమురుశుద్ధి పరిశ్రమలు(రిఫైనరీలు) పెట్టడానికి బదులు ఇథనాల్ తయారు చేయడానికి భారత్ పెద్ద ఎత్తున వెదురు చెట్లను నాటనున్నదని ఆయన చెప్పారు. మూడు నిమిషాల్లో చార్జి చేసి 36 కిమీ. నడిపే సూపర్ కెపాసిటర్ టెక్నాలజీ విద్యుత్తు బస్సులను కూడా ప్రోత్సాహించబోతున్నామని నితిన్ గడ్కరి విలేకరులకు తెలిపారు. ఇప్పటికే డజన్లకొద్దీ తయారీ సంస్థలు లిథియం ఐయాన్ బ్యాటరీలను తయారు చేయడం మొదలెట్టాయని, దీంతో బ్యాటరీల ధర 50 శాతం తగ్గాయని, గుర్గావ్‌లో కాలుష్య రహిత రవాణా కోసం 1000 విద్యుత్ ఆటోరిక్షాలను ఆరంభించామన్నారు.

## సీప్లేన్లతో పర్యాటక రంగానికి ఊతం

### స్పైస్‌జెట్ సిఇఒ అజయ్ సింగ్ వెల్లడి

**దావోస్:** భారత్‌లో సీప్లేన్ల అభివృద్ధికి మంచి అవకాశం ఉందని ప్రముఖ వైమానిక సంస్థ స్పైస్‌జెట్ సిఇఒ అజయ్ సింగ్ అభిప్రాయపడ్డారు. పర్యాటక రంగానికి అవి మంచి ఊతం ఇస్తాయని కూడా ఆయన చెప్పారు. ఏ కొలనునైనా విమానాశ్రయంగా, ఏ నది అయినా రన్‌వేగా మార్చుకునే సదుపాయం ఈ సీప్లేన్లకు ఉంటుందని ఆయన వివరించారు. దేశంలో ప్రయోగాత్మకంగా సీప్లేన్లను ప్రవేశపెట్టనున్న వైమానిక సంస్థ స్పైస్‌జెట్ కానున్నదని అజయ్ చెప్పారు. గుజరాత్ ఎన్నికల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ సీప్లేన్‌ను వాడడం దీనికి మరింత ఉద్దీపనను ఇచ్చినట్లయిందని ఆయన చెప్పారు. జనవరి 22 నుంచి 26 వరకు జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశంకు హాజరయ్యేందుకు దావోస్‌కు వచ్చిన అజయ్ సింగ్ భారత్‌లో సీప్లేన్లకు మంచి అవకాశం ఉందన్నారు. కేంద్ర రవాణా మంత్రి గడ్కరి తరచూ సీప్లేన్ల గురించి ప్రస్తావిస్తున్నారని, దేశంలోనే వాటిని తయారు చేసేలా చూడాలని కోరుతున్నారని కూడా తెలిపారు. సీప్లేన్లను బాగా నడపగలిగితే అది పెద్ద ఎత్తున ఉపయోగంలోకి రాగలదన్నారు.



## 'మలబార్' స్టోర్స్ ప్రారంభం

**మనతెలంగాణ**/మాదాపూర్: కొండాపూర్‌లో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్‌ను సినీ నటి తమన్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు బంగారు నగలంటే చాలా ఇష్టమని ఆమె తెలిపారు. నాణ్యతతో కూడిన బంగారం, డైమండ్స్‌ని అందిస్తున్న మలబార్ గోల్డ్ సంస్థ నగరంతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ నగరాలో ప్రారంభించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమనికి మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్ రీజనల్ హెడ్ సిరాజ్ మాట్లాడుతూ ప్రారంభోత్సవ ఆఫర్‌గా ప్రతి 30 వేల రూపాయల కోనుగోలుపై ఒక బంగారు నాణేన్ని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశం హైదరాబాద్‌లోని అన్ని షోరూంలలో ఫిబ్రవరి 11 వరకు కొనసాగుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 211 మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలు ఉన్నాయని ఆయన తెలిపారు. భారత దేశంలో 91 ఉన్నాయని విదేశాల్లో 118 షోరూంలను ఏర్పాటు చేసి నాణ్యతతో కూడిన బంగారు నగలను అందిస్తామన్నారు. రాష్ట్రంలోని కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్‌లలో త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్ర మంలో కొండా పూర్ డివిజన్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్, చందానగర్ డివిజన్ కార్పొ రేటర్ నవతారెడ్డి, వార్డు సభ్యులు చాంద్‌పాషాలు పాల్గొన్నారు.





**ప్రపంచంలో అతిపెద్ద ఐదు ఆభరణాల రిటైల్ ఛైన్లలో ఒకటిగా ఉన్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నూతన షోరూంను ఆదివారం హిమాయత్‌నగర్‌లో ప్రముఖ సినీ నటి తమన్నా భాటియా ఖైరతాబాద్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం షోరూంలో ఉన్న ఆభరణాలను ఆమె తిలకించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ ఆండ్ డైమండ్ మేనేజ్‌మెంట్ టీం మెంబర్స్, ఛైర్మన్ ఎంపి అహ్మద్,తదితరలు పాల్గొన్నారు.**

**మనతెలంగాణ/హిమాయత్‌నగర్:**

# అమర్త్యసేన్ 'ద్రోహి' : సుబ్రమణ్య స్వామి



**న్యూఢిల్లీ :** భారతరత్న అవార్డు గ్రహీత అమర్త్యసేన్‌ను 'ద్రోహి'గా బిజెపి సీనియర్ నేత సుబ్రమణ్య స్వామి అభివర్ణించారు. ఆదివారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లు కూడా ఈ దేశ పౌరులే. ఎంతో కష్టపడ్డారు. అయినప్పటికీ వారికి రావాల్సినంత పేరు రాలేదు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులు ఏమీ ఆశించకుండా సామాజిక కార్యక్రమాలు చేస్తుంటారు. అమర్త్యసేన్‌కు ఎన్‌డిఎ భారతరత్న ఇచ్చింది. అమర్త్యసేన్ ఓ నయవంచకుడు. నలందా యూనివర్శిటీని దోచుకోవడం మినహా దేశానికి ఆయన చేసిందేమీ లేదు. వామపక్షవాది కావడం, సోనియాగాంధీ ఒత్తిడి తీసుకురావడం వల్లే ఆయనకు భారతరత్న వచ్చింది' అని స్వామి అన్నారు. పద్మ అవార్డులు కొందరు ఆర్‌ఎస్‌ఎస్ నేతలకు ఇచ్చుకున్నారంటూ కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేసిన నేపథ్యంలో స్వామి ఈ తాజా వ్యాఖ్యలు చేసారు. ఆర్‌ఎస్‌ఎస్ నేత వేద్ ప్రకాష్ నంద, కేరళ ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ చీఫ్ పి.పరమేశ్వర్ సహా ఐదుగురు ఆర్‌ఎస్‌ఎస్ నేతల పేర్లు పద్మ అవార్డుల జాబితాలో చోటుచేసుకున్నారంటూ కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా అంతకుముందు ఓ ట్వీట్‌లో ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు.

## అరుణాచల్‌లో భారీ అగ్నిప్రమాదం

**ఇటానగర్:** అరుణాచల్ ప్రదేశ్‌లోని డిరాంగ్ జిల్లాలో ఓ మార్కెట్ లో ఆదివారం రాత్రి ఒంటి గంట ప్రాంతంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 40 ఇళ్లు, దుకాణాలు పూర్తిగా కాలిపోయాయి. ఇండోటిబిటెన్ బోర్డర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని 100 మంది పౌరులను రక్షించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. ప్రాణ నష్టం వివరాలు ఇంకా తెలియలేదు. భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియలేదు. ఈ ఘటనపై కేంద్రమంత్రి సోషల్ మీడియాలో స్పందించారు.

## యుపిలో ఘోర ప్రమాదం

**లక్నో :** యుపిలో ఆదివారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు చనిపోయారు. అదుపుతప్పిన ఓ కారు చెరువులోకి దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులతో పాటు మరో ఐదుగురు చనిపోయారు. రహదారిపై దట్టమైన పొగమంచు ఆవరించడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలిలో సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## నటుడు చంద్రశేఖర్ కన్నుమూత



**బెంగళూరు :** ప్రముఖ కన్నడ నటుడు ఈడకల్లు చంద్రశేఖర్ (63) గుండెపోటుతో కన్నుమూశారు. కొన్నేళ్లుగా ఆయన కెనడాలోని ఒట్టావాలో నివాసం ఉంటున్నారు. శనివారం తెల్లవారుజామున చంద్రశేఖర్ గుండెపోటుతో మృతి చెందినట్టు ఆయన కుటుంబీకులు తెలిపారు. కెనడాలోనే ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతిపై ప్రముఖ కన్నడ నటీనటులు సంతాపం తెలిపారు. చంద్రశేఖర్ బాలనటుడిగా తన సినీ కెరీర్‌ను ప్రారంభించారు. ఈడకల్లు గుడ్డమెలే అనే సినిమాతో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన సుమారు అరవై సినిమాల్లో నటించారు. దర్శకుడిగా కూడా ఆయన పేరు తెచ్చుకున్నారు.

## యాసిడ్ బాధితులకు జాబ్స్‌లో కోటా

**న్యూఢిల్లీ :** యాసిడ్ దాడి బాధితులకు శుభవార్త. ఇక నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో యాసిడ్ బాధితులు, మూగవారు, మానసిక అనారోగ్యం పాలైన వారు, మేధో వైకల్యంగలవారు రిజర్వేషన్ పొందనున్నారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రత్యక్షంగా నియామకాలు జరిపే ఉద్యోగాల్లో మొత్తం ఖాళీల్లో గతంలో ఉన్న మూడు శాతానికి బదులుగా నాలుగు శాతం రిజర్వేషను కల్పించనున్నారు. 40 శాతం కంటే తక్కువ అంగవైకల్యం లేని వారు గ్రూప్ ఎ, బి, సి ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ను పొందనున్నారు. యాసిడ్ దాడి బాధితులు, కండరాల బలహీనత, అంగవైకల్యం గల వారికి రిజర్వ్ చేసిన అన్ని ఉద్యోగాల్లోనూ ఇప్పుడున్న దాని కంటే ఒక శాతం రిజర్వేషన్ పెంచాలని సిబ్బంది, శిక్షణ విభాగం అన్ని కేంద్ర ప్రభుత్వ విభాగాలకు లేఖ రాసింది.

## బడ్జెట్ భేటీకి సహకరించండి



**న్యూఢిల్లీ :** ఈ నెల 31వ తేదీ నుంచి జరిగే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు అన్ని పక్షాలు సహకరించాలని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ సమావేశాల నిర్వహణపై ఆదివారం సాయంత్రం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని పార్టీల పార్లమెంటరీ నేతలు హాజరయ్యారు. బిజెపి నుంచి రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, అనంతకుమార్, విజయ్ గోయల్, కాంగ్రెస్ నుంచి మల్లిఖార్జున ఖర్గే, జ్యోతిరాదిత్య సింధియా, టిడిపి నుంచి సిఎం రమేష్, తోట నరసింహం, టిఆర్‌ఎస్ నుంచి కేశవరావు, జితేందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లోక్ స్పీకర్ సుమిత్రా మహాజన్ మాట్లాడారు. ఈ బడ్జెట్ సమావేశాలు అర్థవంతంగా సాగేందుకు అన్ని పక్షాల సహకారం అవసరమని ఆమె పేర్కొన్నారు.

## విడాకులు తీసుకున్న వారి ఫోటోలు సోషల్ మీడియాలో ఉంచొద్దు : సుప్రీం

**న్యూఢిల్లీ :** దంపతులకు విడాకులు మంజూరు చేసిన సుప్రీంకోర్టు వారిరువురూ ఫొటోలను ఇంటర్నెట్, సోషల్ మీడియా సహా ఏ రూపంలోనూ లేదా ఏ ప్రదేశంలోనూ ఉంచరాదని ఆదేశాలు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం మహారాష్ట్రకు చెందిన ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్లయిన ఈ దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ...భర్త ఆమెకు రూ.37 లక్షల శాశ్వత నిర్వహణ పరిహారాన్ని ఇవ్వాలని ఆదేశించింది. దీన్ని రెండు మాసాల్లోగా చెల్లించాలని సూచించింది. వీరిద్దరి వివాహానికి సంబంధించిన వివాదం ఇంతటితో ముగిసిందని, ఈ వివాహం కూడా రద్దయిందని జస్టిస్ ఎఎం ఖన్విల్కర్, డి.చంద్రచూడ్‌లతో కూడిన ఈ ధర్మాసనం పేర్కొంది. అయితే, భర్త లేదా భార్య ఇరువురికి సంబంధించిన ఫొటోలను ఇంటర్నెట్, సోషల్ మీడియా సహా ఏ రూపంలోనూ లేదా ఏ ప్రదేశంలోనూ ఉంచరాదని ఆదేశించింది. ఈ వివాదానికి సంబంధించి నమోదైన రెండు ఎఫ్‌ఐఆర్‌లను కూడా రద్దు చేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది.


## ఆ పరిస్థితులు ఇంకా రాలేదు : రావత్



**న్యూఢిల్లీ :** సాయుధ దళాల ప్రత్యేకాధికారాల చట్టంపై పునరాలోచించే పరిస్థితి ప్రస్తుతం లేదని భారత సైన్యాధ్యక్షుడు జనరల్ బిపిన్ రావత్ స్పష్టం చేశారు. ఈ చట్టంలోని కొన్ని నిబంధనల తీవ్రతను తగ్గించే విషయంపై పరిశీలన జరిపేందుకు కూడా సమయం రాలేదన్నారు. ఈ చట్టం అమలవుతున్న జమ్మూకశ్మీరు వంటి రాష్ట్రాల్లో మానవ హక్కుల పరిరక్షణకు సైన్యం తగిన ముందు జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. సాయుధ దళాల ప్రత్యేకాధికారాల చట్టాన్ని తొలగించడం, లేదా, వాటిలోని నిబంధనల తీవ్రతను తగ్గించడం గురించి రక్షణ, హోం మంత్రి త్వ శాఖలు చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో జనరల్ రావత్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ చట్టంపై పునరాలోచన జరిపే సమయం రాలేదని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ చట్టంలోని కఠిన నిబంధనలను అమలు చేయడంలో తాము కఠినంగా వ్యవహరించడం లేదన్నారు. దానివల్ల కలిగే ఇతర నష్టాల గురించి కూడా పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలిగేవిధంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

# పంచాయతీ నిధులపై పాశుపతాస్త్రం

- 14వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపులో కొత్త నిబంధనలు
- వినియోగాన్ని బట్టి వెయిటేజీ మార్కులు
- వాటి ఆధారంగానే నిధుల కేటాయింపు



**మన తెలంగాణ / హైదరాబాద్ :** నిధులు లేక నీరసించిపోతున్న గ్రామ పంచాయతీలకు కేంద్రం మరో షాక్ ఇచ్చింది. పల్లెసీమల్లో అరకొరగా జరిగే పనులకు సైతం బ్రేకులు వేసింది. 14వ ఆర్థిక సంఘం పంచాయతీలకు ఇచ్చే నిధులకు కొత్త నిబంధనలు విధించింది. ఆయా గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులను కేంద్రం పూర్తి స్థాయిలో ఇవ్వాలంటే తాజాగా విధించిన నిబంధనల ప్రకారం నిర్దిష్ట మార్కులు సాధించాలి. వచ్చే మార్కులను బట్టి నిధుల విడుదలలో కోత విధించనుంది. కొన్ని అంశాలను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేసింది. ప్రస్తుతానికి ఈ నిబంధనలకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్రాలకు జారీ చేసిందిగానీ వీటి పూర్తి వివరాలు ఒకటి రెండు రోజుల్లో చేరనున్నాయి.

### ఇదీ కొత్త విధానం

గత ఆర్థిక సంవత్సరాలలో ఆయా గ్రామ పంచాయతీలు అందుకున్న నిధులను ఏ విధంగా ఖర్చు చేశారో దానికి తగినట్లుగా 2018–19, 2019–20 ఆర్థిక సంవత్సరాలకు నిధులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త మార్గదర్శకాలను రూపొందించింది. వీటి ప్రకారం వివిధ పథకాల అమలు, సాకారమైన పనులు, సొంత ఆదాయం, వాటిని ఖర్చు చేసిన తీరు వంటి వాటి ఆధారంగా గ్రామ పంచాయతీలకు వెయిటేజి మార్కులను కేటాయించనుంది. మొత్తం మీద వచ్చిన వెయిటేజి మార్కులను బట్టి రాబోయే రెండు ఆర్థిక సంవత్సరాలకు నిధులను కేటాయిస్తుంది. 2018–19, 2019–20 సంవత్సరాలకు సంబంధించిన గ్రామ పంచాయతి డెవలప్‌మెంట్ ప్లాన్(జిడిపిడి)ని తయారు చేసి ప్లాన్‌ప్లస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. అంతకు ముందటి ఆర్థిక సంవత్సరాలలో వినియోగించిన 14వ ఆర్థిక సంఘపు నిధుల వివరాలను, ఆడిట్ రిపోర్టులను, డెవలప్‌మెంట్ ప్లాన్, దానికి అయిన నిధులు, పర్‌ఫార్మెన్స్ గ్రాంట్స్ తదితరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి డ్యాష్‌బోర్డుపై డిస్‌ప్లే పెట్టాలి. గత సంవత్సరం మే 24న కేంద్ర పంచాయత్ రాజ్ మంత్రిత్వశాఖ నిర్వహించిన వర్క్‌షాప్‌లో వచ్చిన సిఫార్సుల ఆధారంగా ఈ కొత్త మార్గదర్శకాలు రూపొందించారు.

### వెయిటేజీ మార్కుల కేటాయింపు విధానం

పెరిగిన సొంత ఆదాయపు శాతాన్ని బట్టి వెయిటేజీ మార్కులు ఇస్తారు. పదిశాతం ఆదాయం పెరిగితే అయిదు మార్కులు, పది నుంచి 20శాతం పెరిగితే 10మార్కులు, 25 నుండి 50శాతం పెరిగితే 15మార్కులు, 50శాతాని కంటే ఎక్కువ పెరిగితే 20 మార్కులు ఇస్తారు. అలాగే పెరిగిన సొంత ఆదాయంతో పాటు 14వ ఆర్థిక సంఘపు నిధులు వినియోగించిన శాతాన్ని బట్టి వెయిటేజి మార్కులు ఉంటాయి. పదిశాతం నిధులు వినియోగిస్తే 15మార్కులు, పది నుంచి 20శాతం వినియోగిస్తే 20మార్కులు, 20 నుంచి 30శాతం వినియోగిస్తే 30 మార్కులు, 30శాతానికి పైగా నిధులు వినియోగిస్తే 40మార్కులు ఇస్తారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆయా గ్రామ పంచాయతీల్లో టాయ్‌లెట్ల నిర్మాణం, గ్రామాల్లో స్వచ్ఛతకు( ఓపెన్ డెడికేషన్ ఫ్రీ స్టాటస్) నిధులు వినియోగిస్తే 30 మార్కులు కేటాయిస్తారు. వ్యాధుల నివారణకు టీకాలు, దోమల నివారణకు చర్యలు వంటి(ఇమ్మ్యునైజేషన్) పనులకు నిధులను వెచ్చిస్తే పది మార్కులు ఇలా మొత్తం వంద మార్కుల కేటాయింపును నిర్ణయించారు. వీటిలో సాధించిన మార్కులను బట్టి ఆయా గ్రామ పంచాయతీలకు ఇకపైన నిధులను కేటాయిస్తారు. 49శాతం మార్కులు సాధిస్తే 50శాతం నిధులను కేటాయిస్తారు. 50 నుంచి 60మార్కులు వస్తే 70శాతం, 61 నుంచి 70 మార్కులు సాధిస్తే 80శాతం, 71 కంటే ఎక్కువ మార్కులు సాధిస్తే వంద శాతం నిధులు కేటాయిస్తారు.

## ఆవాసానికి అతి చౌకైన దేశం భారత్!



**హ్యూస్టన్:** దక్షిణాఫ్రికా తర్వాత ఆవాసయోగ్యానికి చౌకైన దేశంగా రెండో స్థానంలో భారతదేశం నిలిచింది. 'గో బ్యాంకింగ్ రేట్స్' నిర్వహించిన ఓ సర్వే ద్వారా ఈ విషయం వెల్లడైంది. ఈ జాబితాలో కొలంబియా(13), పాకిస్థాన్(14), నేపాల్(28), బంగ్లాదేశ్(40)వివిధ స్థానాల్లో ఉన్నాయి. మొత్తం 112 దేశాలపై ఈ సర్వే నిర్వహించి 50 దేశాలను ఎంపిక చేశారు. నివసించేందుకు చౌకైన ప్రాంతాల్లో అగ్రస్థానంలో దక్షిణాఫ్రికా నిలిచింది. ఇక అత్యధిక ఖరీదైన దేశంగా బెర్ముడా (112) నిలిచింది. తర్వాతి స్థానాల్లో బహమాస్(111), హాంకాంగ్ (110), స్విట్జర్లాండ్(109), ఘనా(108) ఉన్నాయి. నాలుగు ప్రాథమిక అంశాలను పరిగణలోకి తీసుకొని ఈ జాబితాను రూపొందించారు. స్థానికంగా ఉన్న కొనుగోలు శక్తి, అద్దె, కిరాణా సరుకులు, కన్స్యూమర్ ప్రైజ్ ఆధారంగా చేసుకొని సర్వే చేశారు. అద్దెల పరంగా చూసుకుంటే మిగతా దేశాలతో పోల్చుకుంటే భారత్‌లో చాలా తక్కువగా ఉన్నాయి. అంతేకాదు.. భారత్‌లో వినియోగదారులు ఉపయోగించే నిత్యావసర ధరలు కూడా తక్కువగా ఉన్నాయి. కోల్‌కతాలో ఓ వ్యక్తి నివసించేందుకు 285 డాలర్లు సరిపోతుందని ఉదాహరణగా చూపించారు. అంటే మన కరెన్సీలో సుమారు రూ.18వేలు. భారత్‌లో నివసించేందుకు పరిస్థితులు సానుకూలంగా ఉన్నట్లు సర్వే వెల్లడించింది.

## సోషల్ మీడియాపై నజర్

**న్యూఢిల్లీ :** సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నడుం బిగించింది. ఆర్థిక మోసాలు, మతపరమైన రెచ్చగొట్టే సమాచారం, పోర్నోగ్రాఫిక్ కంటెంట్ వంటి నేరాల కట్టడికి ప్రత్యేక సమన్వయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రతి జిల్లాలోనూ ఇటువంటి యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని కోరింది. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ పేరుతో ఈ సమన్వయ కేంద్రాన్ని ఢిల్లీలో ఏర్పాటు చేస్తారు. సైబర్ ఫోరెన్సిక్ ట్రైనింగ్ ల్యాబొరేటరీ కమ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు రూ.83 కోట్లు విడుదల చేసింది.

## కూతురు పది మంది కుమారులతో సమానం

### మన్‌కీ బాత్‌లో మోడీ



**న్యూఢిల్లీ :** 'ఒక కుమార్తె పది మంది కుమారులతో సమానం' అని ప్రధాని నరేంద్ర మోడీ అభివర్ణించారు. పది మంది కుమారులతో పుణ్యాన్ని పొందితే, కేవలం ఒక్క కుమార్తెతోనే అది సాధ్యపడుతుందని అన్నారు. ఆదివారం నిర్వహించిన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి పథంలో దూసుకుపోతున్నారని ఆయన అన్నారు. మహిళలను గౌరవించడం మన సంప్రదాయమని అన్నారు. ఫిబ్రవరి 1న వ్యోమగామి కల్పనా చావ్లా వర్ధంతి నేపథ్యంలో ఆమె జాతికి ప్రత్యేకించి మహిళలకు ఎంతో విలువైన సందేశాన్ని ఇచ్చారని చెప్పారు. 'సాధించాలన్న గట్టి పట్టుదల ఉంటే మహిళలకు సాధ్యం కానిది ఏదీలేదు' అని ఆమె పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వేదాలను రచించిన నాటి నుంచి 'నారీ శక్తి' అనేక మైలురాళ్లను సాధించిందని, నేటికీ అన్ని రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు.

### పారదర్శకంగా 'పద్మ' అవార్డుల ఎంపిక

'పద్మ' అవార్డుల ఎంపిక ప్రక్రియలో తమ ప్రభుత్వం ఎన్నో మార్పులు తీసుకొచ్చిందని, ఎంతో పారదర్శకంగా వ్యక్తుల పేర్లను బట్టి కాకుండా వారు చేసిన సేవలపైనే దృష్టిని పెట్టి ఎంపిక జరిగిందని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. గణతంత్ర దినోత్సవాల సందర్భంగా పద్మ అవార్డులు పొందిన వారిలో అనేక మంది దినపత్రికలు, టివిల్లో కనిపించని వారే ఉన్నారని, వీరంతా సాధారణ వ్యక్తులేనని కాని వారి సేవలకు గుర్తింపుగానే ఈ అవార్డులు దక్కాయని చెప్పారు. మూడు సంవత్సరాలుగా ఎంపిక ప్రక్రియ ఆన్‌లైన్‌లో సాగుతోందని, ఇది ఎంతో పారదర్శకంగా జరుగుతోందని వివరించారు.

## ఎంఆర్‌ఐ మెషిన్‌లో చిక్కుకుని యువకుడు మృతి



**ముంబయి:** ముంబయిలోని ఓ ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ మెషిన్‌లో చిక్కుకుని ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు రాజేశ్ మురు తల్లి నాయర్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటోంది. ఆమెను చూడటానికి శనివారం సాయంత్రం రాజేశ్ ఆసుపత్రికి వెళ్లాడు. ఈ సమయంలో వార్డ్‌బాయ్ ఆక్సిజన్ సిలిండర్‌ను ఎంఆర్‌ఐ గదికి తీసుకురమ్మని అతడ్ని కోరాడు. సిలిండర్‌తో రాజేశ్ వెళ్లిన వెంటనే స్కానింగ్ రూమ్‌లో ఎంఆర్‌ఐ మెషిన్‌కు ఉన్న అయస్కాంత శక్తి ఒక్కసారిగా అతడ్ని లాగింది. ఈ ప్రమాదంలో రాజేశ్ మెషిన్‌లో చిక్కుకుని, 2 నిమిషాల వ్యవధిలో మృతి చెందాడు. వైద్యుడు సిద్ధార్థ్ షా, వార్డ్‌బాయ్ విఠల్ చవాన్, అక్కడే ఉన్న ఓ మహిళపై సెక్షన్ 304ఏ కింద కేసు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జేజే ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సిబ్బంది, యజమానుల నిర్లక్ష్యం వల్ల రాజేశ్ ప్రాణాలు కోల్పోయాడని మృతుడి బంధువు హరీశ్ సోలంకి ఆవేదన వ్యక్తం చేశాడు. ఎంఆర్‌ఐ గదికి ఆక్సిజన్ సిలిండర్‌ను వెంట తీసుకెళ్లకూడదని అక్కడ భద్రతా సిబ్బంది కూడా చెప్పలేదన్నాడు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మృతుడి కుటుంబానికి రూ. 5 లక్షలు నష్టపరిహారం ప్రకటించారు.

## కశ్మీర్‌లో బంద్ సక్సెస్



**శ్రీనగర్ :** కశ్మీర్‌లో ఆదివారం బంద్ విజయవంతమైంది. షోపియాన్ జిల్లా గనోవ్‌పోరాలో రాళ్లు రువ్విన వారిపై శనివారం పోలీసులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ కాల్పుల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. దీంతో వేర్పాటువాదులు ఆదివారం బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో జనజీవనానికి అంతరాయం కలిగింది. శ్రీనగర్‌తో పాటు కొన్ని ప్రాంతాల్లో అధికారులు నిషేధాజ్ఞలు విధించారు. పలు చోట్ల ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. బంద్ నేపథ్యంలో కశ్మీర్‌లో విద్యా సంస్థలు, వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. కశ్మీర్ వ్యాప్తంగా పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

### సైన్యంపై కేసు

భారత సైన్యంపై హత్య కేసు నమోదు చేసినట్లు జమ్మూకశ్మీరు పోలీసులు ఆదివారం తెలిపారు. దక్షిణ కశ్మీరులోని షోపియాన్‌లో శనివారం ఇద్దరు సాధారణ పౌరుల హత్య నేపథ్యంలో ఎఫ్‌ఐఆర్ నమోదైందని పేర్కొన్నారు. నిరసనకారులపై సైన్యం కాల్పులు జరిపినపుడు జావిద్ భట్, సుహెయిల్ లోన్ మరణించినట్లు తెలిపారు. 10, గర్వాల్ రైఫిల్స్‌పై షోపియాన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదైనట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. దీనిపై సైన్యం స్పందిస్తూ తమ కాన్వాయ్‌పై భారీ సంఖ్యలో గ్రామస్థులు దాడి చేశారని, ఆత్మ రక్షణ కోసమే తాము కాల్పులు జరిపామని తెలిపింది.

## కాస్‌గంజ్‌లో ఆగని హింస



**ఆగ్రా :** ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో హింస ప్రజ్వరిల్లుతూనే ఉంది. ఆదివారం ఉదయం ఆందోళకారులు దుకాణాలకు నిప్పంటించారు. మూడు రోజుల క్రితం రిపబ్లిక్ డే సందర్భంగా నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీలో రెండు గ్రూపుల మధ్య ఏర్పడిన వివాదం ఘర్షణకు దారి తీయగా ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. కాగా, ఆదివారం మంటలు చెలరేగిన ప్రాంతానికి జిల్లా మేజిస్ట్రేట్ ఆర్‌పి సింగ్ వెంటనే చేరుకున్నారు. అగ్నిమాపక దళాలు మంటలను అదుపులోకి తెచ్చాయి. అయితే ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని జిల్లా అధికారులు చెప్పారు. మూడు రోజుల క్రితం జరిగిన ఘర్షణల్లో యువకుడు మృతి చెందిన అనంతరం ఎలాంటి అవాంఛనీయ ఘటలు చోటు చేసుకోలేదని జిల్లా మేజిస్ట్రేట్ తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చామని, కొందరు ఆందోళనకారులు దాడులు చేసేందుకు యత్నిస్తున్నారని, వారిపై ప్రత్యేక దృష్టిని నిలిపామని ఆయన వెల్లడించారు.

# పదవీ విరమణ తర్వాత ఏ పదవి కోరబోను : జస్టిస్ చలమేశ్వర్



**విజయవాడ:** దేశంలోని పౌరులందరికి సమానత్వం వర్తింపచేయాలన్నది మన రాజ్యాంగంలోని కీలక అంశమని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ అన్నారు. విజయవాడలోని సిద్దార్థ కళాశాల అధ్వర్యంలో జరిగిన కంఠంనేని రవీంద్రరావు స్మారక ఉపన్యాసనికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. రాజ్యంగంలోని రాజ్యాంగ ధర్మం, పౌరసమాజం అనే అంశం పై కీలక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా చలమేశ్వర్ మాట్లాడుతూ దేశంలో ప్రతి ఒక్క రు అన్ని రకాలుగా సమానత్వం సాధించాలనేది రాజ్యంగ లక్ష్యమని.. అయితే మన దేశం లో ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ఎన్నికల్లో డబ్బు కీలక అంశం కావడం, వారసత్వ రాజకీయాలు, అవినీతి పెరిగిపోయిన నేపథ్యంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.తనను ఒక రాజకీయ పార్టీకి చెందినవాడిగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమూర్తిగా పదవి చేపట్టిన వెంటనే రాజకీయాలతో సంబంధాలు వదులుకున్నానని స్పష్టం చేశారు.భావ ప్రకటన స్వే చ్ఛ పేరుతో ఏం మాట్లాడినా చెల్లుబా టు అవుతుందనుకోవడం సరికాదన్నారు. పద వీ విరమణ అనంతరం ప్రభుత్వం దగ్గరికి వెళ్లి మరో ఏ పదవి కోరబోనని ఆయన స్పష్టంచేశారు.

## పిఎంఒపై సిఐసి ఆగ్రహం

**న్యూఢిల్లీ :** కేంద్ర సమాచార కమిసన్ ప్రధాన మంత్రి కార్యాలయంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారాన్ని వెల్లడించాల్సిందేనని ఘాటుగా సమాధానం ఇచ్చింది. సమాచారాన్ని అందజేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విదేశాలకు వెళ్ళినపుడు, ఆయనతో కలిసి వెళ్ళిన ప్రతినిథుల పేర్లను వెల్లడించాలని ప్రధాన సమాచార కమిషనర్ ఆర్‌కె మాథుర్ ఆదేశించారు. జాతీయ భద్రతను సాకుగా చూపించిన పిఎంఒ అభ్యంతరాలను తిరస్కరించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే భద్రతా సిబ్బంది, భద్రతకు సంబంధించినవారి పేర్లను మాత్రం వెల్లడించనక్కర్లేదని తెలిపారు. భద్రతతో సంబంధం లేని ప్రభుత్వేతర వ్యక్తుల పేర్లను వెల్లడించాలని తెలిపారు. నీరజ్ శర్మ, అయూబ్ అలీ సమాచార హక్కు దరఖాస్తులపై సిఐసి ఈ ఆదేశాలిచ్చారు. ప్రైవేటు వ్యాపార సంస్థల సిఇఒలు, భాగస్వాములు, యజమానులు తదితరుల వివరాలు ఇవ్వాలని పిఎంఓను శర్మ కోరారు. మోడీ నివాసం, కార్యాలయం కోసం నెలసరి ఖర్చుల వివరాలను అలీ కోరారు.

## పరిటాల సునీత ఇంటికి పవన్



**అనంతపురం :** గుండు వివాదంపై స్పష్టత ఇచ్చిన తర్వాత పవన్ కల్యాణ్ తొలిసారి పరిటాల కుటుంబాన్ని కలుసుకున్నారు. చలోరే చలోరే చల్ యాత్రలో భాగంగా అనంతపురంలో పర్యటిస్తున్న జనసేన అధ్యక్షుడు ఆదివారం ఉదయం మంత్రి పరిటాల సునీత ఇంటికి వెళ్లారు. అక్కడే అల్పాహారాన్ని స్వీకరించి, అనంత సమస్యలపై చర్చోపచర్చలు చేశారు. పవన్ రాక సందర్భంగా పరిటాల నివాసం వద్ద కోలాహలం నెలకొంది. మంత్రి తనయుడు శ్రీరామ్ దగ్గరుండి పవన్‌ను లోనికి తీసుకెళ్లారు. అల్పాహార విందు అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. దివంగత పరిటాల రవితో తనకు ఎలాంటి విబేధాలు ఉండేవికావని మరోసారి చెప్పుకొచ్చారు. టీడీపీతో జనసేన పొత్తు, సీమకు పొంచిఉన్న ప్రమాదాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''ప్రజాభీష్టం మేరకు, ప్రజలు కోరితే వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో జనసేనపొత్తుపై నిర్ణయం తీసుకుంటా. ఒకే ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం సరికాదు. ఏపీ హైకోర్టు రాయలసీమలో ఏర్పాటయ్యేలా కృషి చేస్తాను. వెనుకబాటుకు గురైన రాయలసీమను సత్వరం అభివృద్ధి చేయకుంటే ప్రాంతీయవాదం తలెత్తే ప్రమాదం ఉంది'' అని పవన్ అన్నారు. 2019 ఎన్నికల్లో తాను ఎక్కడి నుంచి పోటీ చెయ్యబోయేది ఇంకా నిర్ణయించుకోలేదని, దానిపై త్వరలోనే ప్రకటన చేస్తానని తెలిపారు.

## బాబురావు దంపతులకు నేడు కౌన్సెలింగ్



**మన తెలంగాణ**/హైదరాబాద్: సిటీ ఆర్మడ్ రిజర్వు హెడ్‌క్వార్టర్‌లో డిసిపిగా విధులు నిర్వహిస్తున్న బాబురావు ఆతని భార్య వేదశ్రీలకు మంగళవారం విజయవాడ ఫ్యామిలీ కోర్టులో కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. మనస్పర్ధలు రావడంతో బాబురావు అతని భార్య నుంచి విడి విడిగా ఉంటున్నారు. తన భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని, తన భర్త తనకు కావాలంటూ హైదరాబాద్ ఫ్యామిలీ కోర్టులో వేదశ్రీ రెండేళ్ల క్రితం కేసు వేశారు. ఏడాది తర్వాత బాబురావు కూడా విడాకులు కావాలంటూ కేసు వేశారు. వేదశ్రీ వేసిన కేసు విజయవాడ కోర్టుకు బదిలీ అయ్యింది. అయితే బాబురావు వేసిన పిటిషన్ ప్రస్తుతం హైదరాబాద్ ఫ్యామిలీ కోర్టులో విచారణలో ఉంది. తనకు బాబురావు నుంచి మనోవర్తి (జీవన భృతి) ఇప్పించాలంటూ అతని భార్య వేదశ్రీ ఎనిమిది నెలల క్రితం విజయవాడ ఫ్యామిలీ కోర్టులో కేసు వేశారు. ఈ పిటిషన్‌పై విచారించిన కోర్టు ఈ నెల 7న దంపతులిద్దరికి కౌన్సిలింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. అయితే ఆ రోజు వేదశ్రీ కౌన్సిలింగ్‌కు హాజరైనా బాబురావు మాత్రం హాజరుకాలేదు. విధినిర్వహణలో భాగంగా బందోబస్తు డ్యూటీలో ఉన్నందున కౌన్సిలింగ్‌కు హాజరుకాలేక పోయానని, మరో తేదీకి వాయిదా వేయాలని తన న్యాయవాది తరపున పిటిషన్ వేశారు. దీంతో ఫ్యామిలీ కోర్టు దంపతులిద్దరికి కౌన్సిలింగ్ 29వతేదీకి వాయిదా వేసింది. ఈ ప్రకారం సోమవారం విజయవాడ ఫ్యామిలీ కోర్టులో హాజరుకానున్నారు.



కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆర్మూర్ మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ త్రివేణి గంగాధర్ హైదరాబాద్‌లో ఆదివారం ఆర్మూర్ ఎంఎల్‌ఎ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపి కల్వకుంట్ల కవిత సమక్షంలో టిఆర్‌ఎస్‌లో చేరారు.

## తమన్నాపై చెప్పు విసిరిన ఆకతాయి





**మన తెలంగాణ**/హైదరాబాద్/హిమాయత్‌నగర్: ప్రముఖ సినీనటి తమన్నాపై ఓ ఆకతాయి చెప్పు విసిరారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లో మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమానికి తమన్నా భాటియాను విచ్చేసారు.ఆమెను చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో వారిని అదుపు చేసేందుకు పోలీసులు శ్రమపడ్డాల్సి వచ్చింది. అయితే తమాన్నా షోరూంను ప్రారంభించి తిరిగి వెళుతున్న సమయంలో ముషీరాబాద్‌కు చెందిన బిటెక్ విద్యార్థి కరీముల్లా ఆమెపై చెప్పు విసిరాడు. అయితే అది పక్కన ఉన్నవారికి తగలడంతో తమన్నా షాక్ గురయ్యారు. దీంతో ఒక్కసారిగా అప్రమత్తమైన పోలీసులు కరిముల్లాను అదుపులోకి తీసుకుని నారాయణగూడ పోలీసుస్టేషన్‌కు తరలించారు.భారీ బందోబస్తు మధ్య పోలీసులు తమన్నాను అక్కడి నుండి పంపించడంతో అభిమానులు నిరాశతో వెళ్లిపోయారు.ఖరీముల్లాను పోలీసులు విచారించగా ఇటీవల కాలంలో మంచి సినిమాలు తీయడం లేదని అందుకే చెప్పు విసిరడం జరిగిందని చెప్పాడని నారాయణగూడా సిఐ రవీందర్ తెలిపారు.

# ఉగ్రదాడులపై జనాగ్రహం

## అఫ్ఘన్ వాసుల్లో పెల్లుబుకుతున్న ఆవేదన





**కాబూల్:** అఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో అంబులెన్స్ బాంబు పేలుడు జరిగిన ఒక రోజు తర్వాత అక్కడి ప్రజల్లో తీవ్ర ఆగ్రహం పెల్లుబుకుతోంది. శనివారం జరిగిన ఈ ఘటనలో 103మంది మృతి చెందగా, 235మంది గాయపడ్డారు. రాజధానిలో శాంతి, భద్రతలు వేగంగా క్షీణించడం పట్ల సాధారణ అఫ్ఘన్లు సైతం సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాబూల్‌పై తాలిబాన్లు, ఐసిస్‌లు దాడులకు పాల్పడుతూ ఆ నగరాన్ని భయంకరమైన మృత్యు ప్రదేశంగా మార్చుడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో బాంబు పేలుళ్లతో తాము తీవ్రంగా ఆందోళన చెందుతున్నామని, దినచర్యను ఎలా ప్రారంభించాలో అర్థం కావడం లేదని ఫ్రెష్టా కరీం ట్వీట్ చేశారు. మేం ఇంట్లో ఉండాలా లేదా బయటకు వెళ్లలా,మా స్నేహితులను కలుసుకోవాలా, ఏడ్వాలా, మాకు మేం బలవంతగా భరోసా అనే భ్రమలో బ్రతకాలా..మీ దినచర్యను మీరేలా ప్రారంభిస్తున్నారు అంటూ ఆయన ట్వీట్ చేశారు. కాబూల్‌లో పేలుళ్లు జరగని రోజంటూ ఏదీ లేదు,అలాంటి రోజంటూ ఉంటే అది ఆశ్చర్యకరమని నజీర్ దనేశ్ ట్వీట్ చేశారు. ఈ పేలుళ్లు ప్రభుత్వానికి అత్యంత అవమానకరమని, ప్రజలను రక్షించడంలో ప్రభుత్వం మళ్లీ విఫలమైందని నవీద్ ఖదేరి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. పేలుళ్లలో నాయకుల కొడుకో, కూతురో చనిపోయి ఉంటే పేద ప్రజ ల బాధేంటో అర్థం మవుతుందని ఆయన పేర్కొన్నారు. నగరంలోని యూరోపియన్ యూనియన్ వంటి ఇతర ఉన్నత సంస్థలు, రద్దీగా ఉండే ప్రాంతంలో పేలుళ్లు సంభవించాయి. పేలుడు ధాటికి కొన్ని మీటర్ల దూరం వరకు భవనాల కిటికీలు ధ్వంసమయ్యాయి. సమీపంలో చిన్న నిర్మాణాలుకుప్పకూలాయి.మృతుల్లోఎక్కువమంది సాధారణ పౌరులు ఉన్నారు.కాబూల్‌లో అంతర్జాతీయ హోటల్‌పై ఉగ్రవాదులు దాడి చేయడంలో 25మంది విదేశీయులు మృతి చెందారు. ఈ ఘటన జరిగిన వారం తర్వాత మళ్లీ ఉగ్రవాదుల అంబులెన్స్ దాడికి పాల్పడ్డారు.తాలిబాన్ల అనుబంధ సంస్థ హక్కానీ పేలుళ్లకు పాల్పడినట్లు ప్రభుత్వం భావిస్తోంది. అంబులెన్స్ దాడిని డొనాల్డ్ ట్రంప్ సహా అనేక మంది అంతర్జాతీయ నేతలు ఖండించారు.తాలిబాన్లపై నిర్ణయాత్మక చర్య తీసుకుంటామని ట్రంప్‌పేర్కొన్నారు.

## 'బిసి కమిషన్ బిల్లు' పెట్టాల్సిందే

### జాజుల శ్రీనివాస్‌గౌడ్

**మన తెలంగాణ**/హైదరాబాద్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యంగబద్ధమైన హక్కును కల్పించే బిల్లును ఆమోదం పొందేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ బిల్లు అంశంలో ప్రధాని మోడి అధ్యక్షతన అఖిలపక్ష పార్టీలతో సమావేశాన్ని నిర్వహించి బిల్లు ఆమోదం పొందేలా చూడాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిజెపి, కాంగ్రెస్‌తో పాటు ప్రాంతీయ పార్టీలు కూడా బిసి బిల్లుకు తమ మద్దతును ప్రకటించాలని కోరారు. అలాగే బిసిలకు చట్టసభలలో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని అన్నారు. బిసి కమిషన్ బిల్లుకు మద్దతు కూడగడగ వచ్చే నెల 3న హైదరాబాద్‌లో అఖిల పక్ష పార్టీలు, బిసి ప్రజాప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.



# వెయ్యేళ్ల క్రితమే కలర్ చాక్‌పీస్‌లు!



**లండన్:** వేయ్యేళ్ల క్రితం నాటి రంగు చాక్‌పీస్‌ను బ్రిటన్‌కు చెందిన పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. తేలికపాటి పసుపు రంగు నుంచి గోధుమ రంగు లేదా ఎరుపు రంగు చాక్‌పీస్ (ఒచర్ క్రేయాన్)లు బయల్పడ్డాయి. మన పూర్వీకులు జంతు చర్మాలకు రంగు లేదా బొమ్మలకు రంగులద్ది ఉంటారని భావిస్తున్నారు. ఆర్కియాలాజికల్ సైన్స్ జర్నల్ కథనంలో వివరాలను వెల్లడించింది. ఉత్తర యార్క్‌షైర్‌లోని స్కార్బ్‌రోలోని పురాతన సరసు సమీపంలోని మట్టిదిబ్బలలో ఒచర్ క్రేయాన్ బయల్పడిందని తెలిపారు. సరసుకు ఎదురుగా ఉన్న మరో ప్రదేశంలో ఒచర్ గులకరాళ్లను శాస్త్ర వేత్తలు కనుగొన్నారు. కళలకు కేంద్ర బిందువైన ప్రాంతంలో ఈ అవశేషాలు బయల్పడడం విశేషం. ఈ వస్తువులను కళాత్మకత కోసం ఉపయోగించొచ్చని, బహుశా జంతు చర్మాలకు రంగులు వేయడం లేదా అలంకరణ, చిత్రకళ కోసం వినియోగించవచ్చని యోర్క్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అండి నీధమ్ తెలిపారు. గులక రాళ్లపై భారీగా గీతలు ఉన్నాయని, దానితో ఎర్రటి పిగ్మెంట్ పొడిని తయారు చేసిఉండొచ్చన్నారు. 22 మి.మీ.పొడువు, 7మి.మీ. వెడల్పుతో క్రేయాన్ ఉందన్నారు. ఒచర్ (ఫెర్రిక్ ఆక్సైడ్ గల మట్టి వర్ణకం) ప్రపంచ వ్యాప్తంగా చారిత్రక పూర్వయుగం నాటి ఆదిమానవులు వాడినట్లు తెలిపారు. తాజాగా బయల్పడిన ఒచర్ క్రేయాన్ మధ్యరాతి యుగం నాటి మనుషులు వివిధ ఉపయయోగాలకు వినియోగించి ఉంటారని ఆర్కియాలాజికల్ సైన్స్ జర్నల్ వ్యాసంలో నీధమ్ తెలిపారు. ఇవి బయల్పడిన ప్రాంతం ఎంత కళాత్మక ఉండొచ్చని ఆయన పేర్కొన్నారు.



## బిసి ఉద్యోగులపై క్రీమీలేయర్‌ను ఎత్తివేయాలి

**మన తెలంగాణ** / హైదరాబాద్/ ముషీరాబాద్: ఎవరికి లేని క్రిమిలేయర్‌ను బిసిలపై వేశారని, బిసి ఉద్యోగులపై ఉన్న క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బిసి టీచర్స్ అసోసియేషన్ (బిసిటిఎ) రాష్ట్ర అధ్యక్షులు కృష్ణుడు అధ్యక్షతన హైదరాబాద్ సుందరయ్యవిజ్ఞానకేంద్రంలోరాష్ట్ర మహాసభ జరిగింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సభకు ముఖ్య అతిథులుగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బిసిల నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మీరేంటని అడిగితే యాదవ్, గౌడ్, ముదిరాజ్ అనకూడదని, మేము బిసిలమని చెప్పాలన్నారు. బిసి టీచర్స్ చోదక శక్తులన్నారు. బిసి ఉద్యోగుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# చెట్టును ఢీకొన్న కారు : ముగ్గురు మృతి

## మరొకరి పరిస్థితి విషమం..!



**మన తెలంగాణ** / చేవెళ్ల : చెట్టును కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన చేవెళ్ల మండల పరిధిలోని మిర్జగూడ గేటు సమీపంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. చేవెళ్ల సిఐ జి. గురువయ్యగౌడ్, ఎస్‌ఐ ఎన్. శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. మహబూబ్‌నగర్‌కు చెందిన కాసపోగు సుసన్న ప్రవీణ్‌కుమార్(28), బరిగెల డేవిడ్(29), పేట్ బషీర్‌బాద్‌కు చెందిన అర్నుగొండ అర్జున్‌కుమార్(27), కరీంనగర్‌కు చెందిన గుండ్ర శ్రవణ్ కుమార్‌లు స్నేహితులు. కాగా వీరు హైద రాబాద్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. కాగా ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి ఆల్టో కారులో వికా రాబాద్‌కు బయలుదేరారు. చేవెళ్ల మండల పరిధిలోని మిర్జగూడ గేటు సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు స్నేహితులు ప్రవీణ్‌కుమార్(28), బరిగెల డేవిడ్(29), అర్నుగొండ అర్జున్‌కుమార్(27) అక్కడికక్కడే మృతి చెందారు. శ్రవణ్‌కుమార్‌కు రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర రక్తస్రావం కావడంతో అతని పరిస్థితి కూడా విష మంగా ఉంది. స్థానికులు వెంటనే చేవెళ్ల పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సిఐ, ఎస్‌ఐలు తమ సిబ్బందితో పాటు 108తో అక్కడికి చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అప్పటికే ముగ్గురు చనిపోగా తీవ్ర గాయాలైన శ్రవణ్‌కుమార్‌ను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అతని పరిస్థితి విషమంగా ఉండ డంతో నగరంలోని ఉస్మానియాసుపత్రికి తీసుకెళ్లాలని రెఫర్ చేశారు. క్షతగాత్రుడిని 108లో నగరంలోని ఉస్మానియాకు తరలించారు. మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. మృతుల కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## కృష్ణానదిలో ఉత్సాహంగా ఈత పోటీలు

**విజయవాడ:** విజయవాడ ప్రకాశం బ్యారేజిలో ఈత పోటీలు ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఆక్వాడెవిల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ పోటిలను నర్సాపురం ఎంపీ గోకరాజు గంగరాజు,విజయవాడ నగర పోలీసు కమిషనర్ గౌతం సవాగ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో క్రీడాకారులు తరలి వచ్చారు. 5 నుంచి 81 సంవత్సరాల పైబడిన వారంతా ఈ పోటిల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తి నింపడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించేందకు ఆక్వాడెవిల్స్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నందుకు సంతోషంగా ఉందని ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. ఈ పోటీలకు అన్ని రక్షణ చర్యలు తీసుకున్నట్లు పోలీసు కమిషనర్ గౌతం సవాంగ్ తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.



# ఎపికి సూర్యుడే బ్రాండ్ అంబాసిడర్

## సిఎం చంద్రబాబు





**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సూర్యుడే అతిపెద్ద బ్రాండ్ అంబాసిడర్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తూర్పు తీర ప్రాంతంగా ఎపి నుంచే సూర్యుడు ఉదయిస్తున్నందున 'సన్ రైజ్ స్టేట్'గా నినాదమిచ్చామని అన్నారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం ఉదయం నిర్వహించిన సూర్యారాధన కార్యక్రమానికి హాజరైన సీఎం.. ఇది ప్రజాహిత వేడుకని స్పష్టం చేశారు. అన్ని మతాల్లోనూ, ప్రాంతాల్లోనూ సూర్యునికి ప్రాధాన్యత ఉందన్నారు. దీన్ని ఏటా రాష్ట్ర వేడుకగా నిర్వహిస్తామని వ్యాఖ్యానించారు. ప్రకృతిని ఆరాధించడంలో భాగంగానే జలహారతి, సూర్యారాధన, అమ్మకు వందనం అనే కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అరబ్ దేశాల్లో సూర్యుడ్ని షమ్స్ అనే పేరుతో ఆరాధిస్తారని, అటు క్రైస్తవులూ బైబిల్‌లో ప్రాధాన్యత ఇచ్చారని ముఖ్యమంత్రి తెలిపారు. సర్వజనీన నిత్యచైతన్య శక్తిగా ఉన్న సూర్యుడిని ఆరాధిస్తే ఆరోగ్యంగా, మానసికం గా వృద్ధిని సాధిస్తామని పేర్కొన్నారు. చైతన్యమూర్తి అయిన సూర్యుడిని ఆరాధిస్తే మనం నిత్య ప్రేరణ పొందొచ్చవచ్చనిఅన్నారు సూర్యుడు జస్టిస్ చక్రవర్తి లాంటివాడని. పేదా.. గొప్పా అనే వ్యత్యాసం లేకుండా అందరిని సమానంగానే చూస్తాడని పేర్కొన్నారు. 460 కోట్ల సంవత్సరాల వయసున్న సూర్యుడు నుంచి మనం రోజూ శక్తిని పొందుతూనే ఉన్నామన్నారు. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని ముందుకు వెళ్ళాలని.. ప్రకృతిని, సాంకేతికతను సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ రెండూ మానవ మనుగడకు అవసరమేనని అన్నారు. సూర్యారాధన ఏ మతానికి సంబంధించిన అంశం కాదని... దీనిపై కొందరు లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సౌరశక్తితోనే 5 వేల మెగా వాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా 1000 మెగావాట్లు సౌర విద్యుత్ ఉత్పత్తి అవుతోందని తెలిపారు. అనంతరం సూర్యభగవానుడికి ఆర్ఘ్యం ఇచ్చి సూర్యారాధన కార్యక్రమాన్ని సీఎం ఆరంభించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ ఆచారాలను అనుసరించి ప్రార్ధనలు నిర్వహించారు. సూర్యారాధన కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, విద్యార్ధులు హాజరై 12 రకాల ఆసనాలతో సూర్యారాధన చేశారు.

## టీమిండియాలో సురేశ్ రైనాకు చోటు



**ముంబయి:** దక్షిణాఫ్రికాతో జరిగే ట్వంటీ–20 సిరీస్ కోసం టీమిండియాను ఎంపిక చేశారు. సీనియర్ ఆటగాడు సురేశ్ రైనాకు జట్టులో చోటు దక్కింది. మరో స్టార్ యువరాజ్ సింగ్‌కు నిరాశే మిగిలింది. అతనికి జట్టులో చోటు దక్కలేదు. ఇక, లంక సిరీస్‌కు దూరంగా ఉన్న భువనేశ్వర్ కుమార్, శిఖర్ ధావన్‌లకు మరోసారి జట్టులో చోటు లభించింది. కాగా, సిరీస్ కోసం 16 మందితో కూడిన జట్టును ఆదివారం బిసిసిఐ ఎంపిక చేసింది. అజింక్య రహానె, అశ్విన్, రవీంద్ర జడేజా, షమీ తదితరులకు జట్టులో స్థానం లభించలేదు. శార్దూల్ ఠాకూర్ మళ్లీ చోటు సంపాదించాడు. రాహుల్ కూడా జట్టులో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. జైదేవ్ ఉనద్కట్ కూడా జట్టుకు ఎంపికయ్యాడు. సిరీస్‌లో భారత్ మూడు మ్యాచులు ఆడనుంది. ఈ సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఫిబ్రవరి 18న జరుగుతుంది.

**జట్టు వివరాలు:** విరాట్ కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ, ధావన్, రాహుల్, సురేశ్ రైనా, ధోని, దినేష్ కార్తీక్, హార్దిక్ పాండ్య, మనీష్ పాండే, అక్షర్ పటేల్, చాహల్, కుల్దీప్ యాదవ్, భువనేశ్వర్, బుమ్రా, ఉనద్కట్, శార్దూల్ ఠాకూర్.

# ఉనద్కట్‌కు జాక్‌పాట్

### గేల్‌కు ఊరట, నేపాల్ సందీప్‌కు చాన్స్, అఫ్గాన్ క్రికెటర్ల హవా, ముగిసిన ఐపిఎల్ వేలం పాట



**బెంగళూరు:** పొట్టి క్రికెట్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2018 సీజన్ కోసం నిర్వహించిన ఆటగాళ్ల వేలం పాట ఆదివారం ముగిసింది. రెండు రోజుల పాటు బెంగళూరు వేదికగా జరిగిన వేలం పాట ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఈ వేలం పాట చాలా మంది క్రికెటర్లను కోటీశ్వరులుగా మార్చింది. ఊహించినట్టుగానే ఇంగ్లాండ్ స్టార్ ఆల్‌రౌండర్ బెన్‌స్టోక్స్ అందరి కంటే అత్యధిక ధరను పలికాడు. ఈ వేలం పాటలో రాజస్థాన్ రాయల్స్ రూ.12.5 కోట్లను వెచ్చించి స్టోక్స్‌ను సొంతం చేసుకుంది. ఇక, రెండో రోజు వేలం పాటలో సౌరాష్ట్ర ఫాస్ట్ బౌలర్ జైదేవ్ ఉనద్కట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఇతన్ని రూ.11.5 కోట్లకు రాజస్థాన్ దక్కించుకుంది. మరోవైపు నేపాల్ యువ సంచలనం సందీప్ లామిచానె ఐపిఎల్ బెర్త్‌ను దక్కించుకుని చరిత్ర సృష్టించాడు. అతన్ని రూ.20 లక్షలకు ఢిల్లీ డేర్‌డెవిల్స్ సొంతం చేసుకుంది. ఈ క్రమంలో ఐపిఎల్‌లో కాంట్రాక్టు దక్కించుకున్న తొలి నేపాల్ ఆటగాడిగా సందీప్ నిలిచాడు. మరోవైపు విండీస్ దిగ్గజం క్రిస్‌గేల్‌కు వేలం పాట చివరి దశలో ఊరట లభించింది. గేల్‌ను కింగ్స్ ఎలెవన్ పంజాబ్ రెండు కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. ఇక, వేలం పాటలో అఫ్గాన్ క్రికెటర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈసారి ఏకంగా నలుగురు అఫ్గాన్ క్రికెటర్లను ఆయా ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. యువ సంచలనం రషీద్ ఖాన్‌ను హైదరాబాద్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ ఏకంగా తొమ్మిది కోట్ల రూపాయలను వెచ్చించి సొంతం చేసుకుంది. మరో అఫ్గాన్ స్పిన్నర్ ముజీబ్ జర్దాన్‌ను పంజాజ్ జట్టు రికార్డు స్థాయిలో 4 కోట్ల రూపాయలకు దక్కించుకుంది. జర్దాన్ కనీస ధర రూ.50 లక్షలు కాగా, అతని కోసం ఫ్రాంచైజీలు తీవ్రంగా పోటీ పడ్డాయి. దీంతో అతనికి రూ.4 కోట్ల ధర దక్కింది. అఫ్గాన్ కెప్టెన్ మహ్మద్ నబిను సన్‌రైజర్స్ రూ.కోటి చెల్లించి తిరిగి సొంతం చేసుకుంది. మరో ఆటగాడు జహీర్ ఖాన్‌ను రూ.60 లక్షలకు రాజస్థాన్ రాయల్స్ సొంతం చేసుకుంది. ఇక, ఆస్ట్రేలియా స్పీడ్‌స్టర్ ఆండ్రూ టై కూడా రికార్డు ధరను పలికాడు. అతన్ని 7.2 కోట్ల రూపాయలు వెచ్చించి పంజాబ్ దక్కించుకుంది. మరోవైపు మురళీ విజయ్‌ను చెన్నై సూపర్ కింగ్స్ సొంతం చేసుకుంది. న్యూజిలాండ్ స్టార్ మార్టిన్ గుప్టిల్‌పై ఏ ఫ్రాంచైజీ ఆసక్తి కనబరచలేదు.

### ఉనద్కట్ సంచలనం

ఐపిఎల్ వేలం పాటలో ఆదివారం రెండో రోజు పెను సంచలనం నమోదైంది. భారత యువ స్పీడ్‌స్టర్ జైదేవ్ ఉనద్కట్ రూ.11.50 కోట్ల ధర పలికి అందరిని ఆశ్చర్య పరిచాడు. సౌరాష్ట్రకు చెందిన ఉనద్కట్‌ను రాజస్థాన్ రాయల్స్ భారీ మొత్తాన్ని వెచ్చించి సొంతం చేసుకుంది. కిందటి ఐపిఎల్ సీజన్‌లో రైజింగ్ పుణశ్రీ సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిథ్యం వహించి జట్టును ఫైనల్‌కు చేర్చడంలో కీలకపాత్ర పోషించాడు. దీంతో అతన్ని సొంతం చేసుకునేందుకు ఫ్రాంచైజీలు తీవ్రంగా పోటీ పడ్డాయి. దీంతో ఉనద్కట్‌కు ఊహించని ధర లభించింది. ఈ సీజన్ వేలం పాటలో స్టోక్స్ తర్వాత అత్యధిక ధర పలికిన రెండో క్రికెటర్‌గా ఉనద్కట్ నిలిచాడు. మరోవైపు యువ క్రికెటర్లు మనీష్ పాండే, లోకేష్ రాహుల్‌లు చెరో పదకొండు కోట్ల రూపాయల ధరను పలికి పెను సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అఫ్గాన్ స్టార్ రషీద్ ఖాన్ కూడా తొలి రోజు వేలం పాటలో రూ.9 కోట్లకు అమ్ముడు పోయి పెను ప్రకంపనలు సృష్టించాడు. కాగా, ఆదివారం ఉనద్కట్‌తో పాటు ఆస్ట్రేలియా స్పీడ్‌స్టర్ ఆండ్రూ టై రికార్డు ధర పలికాడు. అతని కనీస ధర రూ.కోటి కాగా అతన్ని ఏడు కోట్ల 20 లక్షల రూపాయలకు కింగ్స్ ఎలెవన్ పంజాబ్ సొంతం చేసుకుంది. నమాన్ ఓజాను 1.4 కోట్ల రూపాయలకు ఢిల్లీ దక్కించుకుంది. కిందటిసారి అతను సన్‌రైజర్స్‌కు ప్రాతినిథ్యం వహించాడు.

## సన్‌రైజర్స్ హైదరాబాద్

| | | |
|---|---|---|
| 1. | డేవిడ్ వార్నర్ | రూ. 12 కోట్లు |
| 2. | భువనేశ్వర్ కుమార్ | రూ. 8.5 కోట్లు |
| 3. | శిఖర్ ధావన్ | రూ .5.2 కోట్లు |
| 4. | షకీబ్ అల్ హసన్ | రూ .2 కోట్లు |
| 5. | కేన్ విలియమ్సన్ | రూ .3 కోట్లు |
| 6. | కార్లోస్ బ్రాత్‌వైట్ | రూ .2 కోట్లు |
| 7. | యూసఫ్ పఠాన్ | రూ 1.9 కోట్లు |
| 8. | మనీశ్ పాండే | రూ 11 కోట్లు |
| 9. | వృద్ధిమాన్ సాహా | రూ .5 కోట్లు |
| 10. | రషీద్ ఖాన్ | రూ 9 కోట్లు |
| 11. | రికీ భుయ్ | రూ. 20 లక్షలు |
| 12. | దీపక్ హుడా | రూ .3 కోట్లు |
| 13. | సిద్దార్థ్ కౌల్ | రూ 3.8 కోట్లు |
| 14. | టి నటరాజన్ | రూ. 40 లక్షలు |
| 15. | బాసిల్ థంపీ | రూ. 95 లక్షలు |
| 16. | సయ్యద్ ఖలీల్ అహ్మద్ | రూ. 3 కోట్లు |
| 17. | మహ్మద్ నబీ | రూ. 1 కోట్లు |
| 18. | సందీప్ శర్మ | రూ .3 కోట్లు |
| 19. | సచిన్ బేబీ | రూ. 20 లక్షలు |
| 20. | క్రిస్ జోర్డాన్ | రూ. 1 కోట్లు |
| 21. | బిల్లీ స్టాన్లేక్ | రూ. 50 లక్షలు |
| 22. | తాన్మా అగర్వాల్ | రూ. 20 లక్షలు |
| 23. | శ్రీవత్స్ గోస్వామి | రూ. 1 కోట్లు |
| 24. | బిపుల్ శర్మ | రూ. 20 లక్షలు |
| 25. | మొహిద్దీ హసన్ | రూ. 20 లక్షలు |

## చెన్నై సూపర్ కింగ్స్

| | | |
|---|---|---|
| 1. | ఎంఎస్ ధోనీ | రూ. 15 కోట్లు |
| 2. | సురేష్ రైనా | 11 కోట్ల రూపాయలు |
| 3. | రవీంద్ర జడేజా | రూ .7 కోట్లు |
| 4. | డుప్లెస్సిస్ | రూ. 1.6 కోట్లు |
| 5. | హర్భజన్ సింగ్ | 2 కోట్లు |
| 6. | డ్వేన్ బ్రేవో | రూ 6.4 కోట్లు |
| 7. | షేన్ వాట్సన్ | రూ .4 కోట్లు |
| 8. | కేదార్ జాధవ్ | రూ .7.8 కోట్లు |
| 9. | అంబటి రాయుడు | రూ 2.2 కోట్లు |
| 10. | ఇమ్రాన్ తాహిర్ | రూ. 1 కోట్లు |
| 11. | కరణ్ శర్మ | రూ .5 కోట్లు |
| 12. | శార్దూల్ ఠాకూర్ | రూ 2.6 కోట్లు |
| 13. | జగదీసన్ నారాయణ్ | రూ. 20 లక్షలు |
| 14. | మిట్చెల్ సాన్నర్ | రూ. 50 లక్షలు |
| 15. | దీపక్ చహర్ | రూ. 80 లక్షలు |
| 16. | ఆసిఫ్ కెఎం | రూ. 40 లక్షలు |
| 17. | లుంగీ ఎంగిడి | రూ. 50 లక్షలు |
| 18. | కనిష్క్ సేథ్ | రూ. 20 లక్షలు |
| 19. | ధ్రువ్ షోరీ | రూ. 20 లక్షలు |
| 20. | మురళీ విజయ్ | రూ .2 కోట్లు |
| 21. | సామ్ బిల్లింగ్స్ | రూ. 1 కోట్లు |
| 22. | మార్క్ వుడ్ | రూ. 1.5 కోట్లు |
| 23. | షిటిజ్ శర్మ | రూ. 20 లక్షలు |
| 24. | మవున్ సింగ్ | రూ. 20 లక్షలు |
| 25. | చైతన్య బిష్ణోయి | రూ. 20 లక్షలు |

## ఢిల్లీ డేర్ డెవిల్స్

| | | |
|---|---|---|
| 1. | రిషాబ్ పంత్ | రూ. 8 కోట్లు |
| 2. | క్రిస్ మోరిస్ | రూ. 7.1 కోట్లు |
| 3. | శ్రేయస్ అయ్యర్ | రూ. 7 కోట్లు |
| 4. | గ్లెన్ మాక్స్‌వెల్ | రూ. 9 కోట్లు |
| 5. | గౌతమ్ గంభీర్ | రూ. 2.8 కోట్లు |
| 6. | జాసన్ రాయ్ | రూ. 1.5 కోట్లు |
| 7. | కోలిన్ మున్రో | రూ 1.9 కోట్లు |
| 8. | మహ్మద్ షమీ | రూ .3 కోట్లు |
| 9. | కగిసో రబడ | రూ 4.2 కోట్లు |
| 10. | అమిత్ మిశ్రా | రూ.4 కోట్లు |
| 11. | పృథ్వీ షా | రూ 1.2 కోట్లు |
| 12. | రాహుల్ టెవాషియా | రూ .3 కోట్లు) |
| 13. | విజయ్ శంకర్ | రూ. 3.2 కోట్లు |
| 14. | హర్షల్ పటేల్ | రూ. 20 లక్షలు |
| 15. | అవేష్ ఖాన్ | రూ. 70 లక్షలు |
| 16. | షాబాజ్ నదీమ్ | రూ. 3.2 కోట్లు |
| 17. | డానియల్ క్రిస్టియన్ | రూ. 1.5 కోట్లు |
| 18. | జయంత్ యాదవ్ | రూ. 50 లక్షలు |
| 19. | గుర్‌కీరత్ మన్ | రూ. 75 లక్షల |
| 20. | ట్రెంట్ బౌల్ట్ | రూ. 2.2 కోట్లు |
| 21. | మంజోత్ కల్రా | రూ. 20 లక్షలు |
| 22. | అభిషేక్ శర్మ | రూ. 55 లక్షలు |
| 23. | సందీప్ లామితేన్ | రూ. 20 లక్షలు |
| 24. | నమ్యాన్ ఓజా | రూ 1.4 కోట్లు |
| 25. | సయాన్ ఘోష్ | రూ. 20 లక్షలు |

## ముంబై ఇండియన్స్

| | | |
|---|---|---|
| 1. | రోహిత్ శర్మ | రూ. 15 కోట్లు |
| 2. | హర్ధిక్ పాండ్యా | రూ 11 కోట్లు |
| 3. | బుమ్రా | రూ. 7 కోట్లు |
| 4. | కిరోన్ పొలార్డ్ | రూ. 5.4 కోట్లు |
| 5. | ముస్తాఫిజుర్ రెహమాన్ | రూ. 2.2 కోట్లు |
| 6. | ఫాట్ కమిన్స్ | రూ 5.4 కోట్లు |
| 7. | సూర్యా కుమార్ యాదవ్ | 3.2 కోట్లు |
| 8. | కృనాల్ పాండ్యా | రూ .8.8 కోట్లు |
| 9. | ఇషాన్ కిషన్ | రూ 6.2 కోట్లు |
| 10. | రాహుల్ చహర్ | రూ 1.9 కోట్లు |
| 11. | ఎవిన్ లెవిస్ | రూ 3.8 కోట్లు |
| 12. | సౌరబ్ తివారీ | రూ. 80 లక్షలు |
| 13. | బెన్ కట్టింగ్ | రూ. 2.2 కోట్లు |
| 14. | ప్రదీప్ సంగ్వాన్ | రూ. 1.5 కోట్లు |
| 15. | డుమిని | రూ. 1 కోట్లు |
| 16. | జాసన్ బెహ్రెండోర్ఫ్ | రూ. 1.5 కోట్లు |
| 17. | తాజిందర్ ధిల్లాన్ | రూ. 55 లక్షలు |
| 18. | శరద్ లంబా | రూ. 20 లక్షలు |
| 19. | సిద్దాష్ లాడ్ | రూ. 20 లక్షలు |
| 20. | ఆదిత్య తారే | రూ. 20 లక్షలు |
| 21. | మయంక్ మార్కండే | రూ. 20 లక్షలు |
| 22. | అకిలా దానంజయ | రూ. 50 లక్షలు |
| 23. | అనుకుల్ రాయ్ | రూ. 20 లక్షలు |
| 24. | మొహ్సిన్ ఖాన్ | రూ. 20 లక్షలు |
| 25. | నితీష్ దినేన్ | రూ. 20 లక్షలు |

## రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

| | | |
|---|---|---|
| 1. | విరాట్ కోహ్లి | రూ .17 కోట్లు |
| 2. | ఏబీ డివీలియర్స్ | రూ 11 కోట్లు |
| 3. | సర్ఫరాజ్ ఖాన్ | రూ .1.75 కోట్లు |
| 4. | బ్రెండన్ మెకలమ్ | రూ .3.6 కోట్లు |
| 5. | క్రిస్ వోక్స్ | రూ 7.4 కోట్లు |
| 6. | కోలిన్ గ్రాండ్హోమ్ | రూ. 2.2 కోట్లు |
| 7. | మోయిన్ అలీ | రూ 1.7 కోట్లు |
| 8. | డి కాక్ | రూ 2.8 కోట్లు |
| 9. | ఉమేష్ యాదవ్ | రూ 4.2 కోట్లు |
| 10. | చాహల్ | రూ .6 కోట్లు |
| 11. | వోరా | రూ. 1.1 కోట్లు |
| 12. | కుల్వంత్ ఖేజ్రోలియా | రూ. 85 లక్షలు |
| 13. | అనుకేట్ చౌదరి | రూ. 30 లక్షలు |
| 14. | నవదీప్ సైని | రూ .3 కోట్లు |
| 15. | మురుగన్ అశ్విన్ | రూ. 2.2 కోట్లు |
| 16. | మండిప్ సింగ్ | రూ 1.4 కోట్లు |
| 17. | వాషింగ్టన్ సుందర్ | రూ. 3.2 కోట్లు |
| 18. | పవన్ నేగీ | రూ. 1 కోట్లు |
| 19. | మొహమ్మద్ సిరాజ్ | రూ. 2.6 కోట్లు |
| 20. | నాథన్ కౌల్టర్ నైల్ | రూ 2.2 కోట్లు |
| 21. | అనిరుధ్ జోషి | రూ. 20 లక్షలు |
| 22. | పార్థివ్ పటేల్ | రూ 1.7 కోట్లు |
| 23. | టిమ్ సౌథీ | రూ. 1 కోట్లు |
| 24. | పవన్ దేశ్‌పాండే | రూ. 20 లక్షలు |

## కోల్‌కతా నైట్ రైడర్స్

| | | |
|---|---|---|
| 1. | సునీల్ నరైన్ | రూ. 8.5 కోట్లు |
| 2. | రస్సెల్ | రూ .7 కోట్లు |
| 3. | చెల్ స్టార్క్ | రూ 9.4 కోట్లు |
| 4. | క్రిస్ లిన్ | రూ 9.6 కోట్లు |
| 5. | దినేశ్ కార్తీక్ | రూ 7.4 కోట్లు |
| 6. | రాబిన్ ఊతప్ప | రూ. 6.4 కోట్లు |
| 7. | పియూష్ చావ్లా | రూ. 4.2 కోట్లు |
| 8. | కుల్దీప్ యాదవ్ | రూ. 5.8 కోట్లు |
| 9. | షబ్మాన్ గిల్ | రూ 1.8 కోట్లు |
| 10. | ఇషాంగ్ జగ్గి | రూ. 20 లక్షలు |
| 11. | నితీశ్ రాణా | రూ. 3.4 కోట్లు |
| 12. | కమలేష్ నగర్‌కోటి | రూ. 3.2 కోట్లు |
| 13. | వినయ్ కుమార్ | రూ. 1 కోట్లు |
| 14. | అపూర్వ వాంఖడే | రూ. 20 లక్షలు |
| 15. | రింకు సింగ్ | రూ. 80 లక్షలు |
| 16. | శివమ్ మావి | రూ .3 కోట్లు |
| 17. | కామెరౌన్ డెల్పోర్ట్ | రూ. 30 లక్షలు |
| 18. | మిచెల్ జాన్సన్ | రూ .2 కోట్లు |
| 19. | జావోన్ సీర్లెస్ | రూ. 30 లక్షలు |

## రాజస్థాన్ రాయల్స్

| | | |
|---|---|---|
| 1. | స్టీవ్ స్మిత్ | రూ. 12 కోట్లు |
| 2. | బెన్ స్టోక్స్ | రూ. 12.5 కోట్లు |
| 3. | అజింక్యా రహానె | రూ. 4 కోట్లు |
| 4. | స్టూవర్ట్ బిన్నీ | రూ. 50 లక్షలు |
| 5. | సంజు శాంసన్ | రూ 8 కోట్లు |
| 6. | జోస్ బట్లర్ | రూ 4.4 కోట్లు |
| 7. | రాహుల్ త్రిపాఠి | రూ. 3.4 కోట్లు |
| 8. | డి'ఆర్సీ షార్ట్ | రూ 4 కోట్లు |
| 9. | జోఫ్రా ఆర్చర్ | రూ .7.2 కోట్లు |
| 10. | గౌతం కృష్ణప్ప | రూ 6.2 కోట్లు |
| 11. | ధవల్ కుల్‌కర్ణి | రూ. 75 లక్షలు ఆర్‌టిటి |
| 12. | జయదేవ్ ఉనాద్కట్ | రూ. 11.5 కోట్లు |
| 13. | అంకిత్ శర్మ | రూ. 20 లక్షలు |
| 14. | అయూరీత్ సింగ్ | రూ. 30 లక్షలు |
| 14. | జహీర్ ఖాన్ పాకిన్ | రూ. 60 లక్షలు |
| 15. | శ్రేయాస్ గోపాల్ | రూ. 20 లక్షలు |
| 16. | ప్రశాంత్ చోప్రా | రూ. 20 లక్షలు |
| 17. | బెన్ లాఫ్లిన్ | రూ. 50 లక్షలు |
| 18. | మహిపాల్ లోమ్రోర్ | రూ. 20 లక్షలు |
| 19. | జతిన్ సక్సేనా | రూ. 20 లక్షలు |
| 20. | ఆర్యమన్ విక్రమ్ బిర్లా | రూ. 30 లక్షలు |
| 21. | దుష్మాంత చమేరా | రూ. 50 లక్షలు |
| 22. | సుధేశన్ మిధూన్ | రూ. 20 లక్షలు |

## కింగ్స్ ఎలెవన్ పంజాబ్

| | | |
|---|---|---|
| 1. | అక్షర్ పటేల్ | రూ. 12.5 కోట్లు |
| 2. | అశ్విన్ | రూ 7.6 కోట్లు |
| 3. | యువరాజ్ సింగ్ | రూ.2 కోట్లు |
| 4. | కరుణ్ నాయర్ | రూ. 5.6 కోట్లు |
| 5. | కెఎల్ రాహుల్ | రూ.11 కోట్లు |
| 6. | డేవిడ్ మిల్లర్ | రూ.3 కోట్లు |
| 7. | ఆరోన్ ఫించ్ | రూ.6.2 కోట్లు |
| 8. | మార్కాస్ స్టోనియస్ | రూ .6.2 కోట్లు |
| 9. | మయంక్ అగర్వాల్ | రూ. 1 కోట్లు |
| 10. | అంకిత్ సింగ్ రాజ్‌పుత్ | రూ .3 కోట్లు |
| 11. | మనోజ్ తివారీ | రూ. 1 కోట్లు |
| 12. | మోహిత్ శర్మ | రూ. 2.4 కోట్లు |
| 13. | ముజీబ్ జాద్రన్ | రూ.4 కోట్లు |
| 14. | బరీందర్ శ్రాన్ | రూ. 2.2 కోట్లు |
| 15. | ఆండ్రూ టై | రూ. 7.2 కోట్లు |
| 16. | ఆకాష్దీప్ నాథ్ | రూ. 1 కోట్లు |
| 17. | బెన్ ద్వార్షుయిస్ | రూ 1.4 కోట్లు |
| 18. | పర్దీప్ సాహూ | రూ. 20 లక్షలు |
| 19. | మయాంక్ దగర్ | రూ. 20 లక్షలు |
| 20. | క్రిస్ గేల్ | రూ .2 కోట్లు |
| 21. | మంజూర్‌ధర్ | రూ. 20 లక్షలు |

# విజేత ఫెదరర్

### ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్లో సిలిక్ ఓటమి, బోపన్న జంటకు రన్నరప్



### రోజర్ @ 20

స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ కెరీర్‌లో ఇది 20వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ కావడం విశేషం. ప్రపంచంలో మరే ఆటగాడు కూడా సింగిల్స్‌లో ఇన్ని గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించలేదు. అంతేగాక, కెరీర్‌లో ఆరో ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను సాధించాడు. ఇంతకు ముందు నొవాక్ జొకొవిచ్ (సెర్బియా), రాడ్ లెవర్ (ఆస్ట్రేలియా)లు మాత్రమే ఇన్నేసి టైటిల్స్ సాధించారు. తాజాగా ఈ దిగ్గజాల సరసన ఫెదరర్ నిలిచాడు. కాగా, కిందటి ఏడాది కూడా ఫెదరర్ ఆస్ట్రేలియా ఓపెన్ విజేతగా నిలిచాడు. అంతకుముందు 2004, 2006, 2007, 2010లలో కూడా ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్స్ గెలుచుకున్నాడు. ఇదిలావుండగా ఫెదరర్ ఇప్పటి వరకు 20 టైటిల్స్ తన ఖాతాలో జమచేసుకున్నాడు. ఇందులో అత్యధికంగా 8 వింబుల్డన్ టైటిల్స్ ఉన్నాయి. తర్వాతి స్థానం ఆస్ట్రేలియా ఓపెన్‌దే. ఇక ఐదుసార్లు యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌ను సాధించాడు. కాగా, ఒకసారి ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలుచుకున్నాడు. కాగా, ప్రపంచ టెన్నిస్‌లో ఫెదరర్ దరిదాపుల్లో మరే ఆటగాడు కనిపించడం లేదు. స్పెయిన్ యోధుడు రఫెల్ నాదల్ పోటీలో ఉన్నా ఫెదరర్ రికార్డును బద్దలు కొట్టడం అతనికే కష్టమేనని విశ్లేషకులు అంటున్నారు. జొకొవిచ్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. వరుస గాయాలు వీరిద్దరిని వెంటాడుతున్నాయి. దీంతో ఫెదరర్ సాధించిన రికార్డు టెన్నిస్ చరిత్రలో చిరకాలం చెక్కు చెదరకుండా ఉండడం ఖాయమని చెప్పవచ్చు.

**మెల్‌బోర్న్:** ప్రతిష్టాత్మకమైన ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్‌ను స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెదరర్ కైవసం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో రెండో సీడ్ ఫెదరర్ 6–2, 6–7, 6–3, 6–1 తేడాతో క్రొయేసియా స్టార్, ఆరో సీడ్ మారిన్ సిలిక్‌ను చిత్తు చేశాడు. ఫెదరర్‌కు ఇది ఆరో ఆస్ట్రేలియా ఓపెన్ సింగిల్స్ టైటిల్ కావడం విశేషం. ఓవరాల్‌గా ఫెదరర్ గెలుచుకున్న 20వ గ్రాండ్‌స్లామ్ ట్రోఫీ ఇది. కాగా, కిందటి ఏడాది కూడా ఫెదరర్ ఆస్ట్రేలియా ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. కాగా, సిలిక్‌తో జరిగిన టైటిల్ సమరంలో స్విస్ స్టార్ ఫెదరర్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. ప్రారంభం నుంచే ఫెదరర్ దూకుడుగా ఆడాడు. చూడచక్కని షాట్లతో సిలిక్‌ను హడలెత్తించాడు. తనకు మాత్రమే ప్రత్యేకమైన షాట్లతో చెలరేగిన ఫెదరర్ పెద్దగా చెమటోడ్చకుండానే మొదటి సెట్‌ను దక్కించుకున్నాడు. అయితే రెండో సెట్‌లో సిలిక్ దూకుడును పెంచాడు. అసాధారణ పోరాట పటిమతో ఫెదరర్‌కు గట్టి పోటీ ఇచ్చాడు. కళ్లు చెదిరే షాట్లతో స్విస్ దిగ్గజాన్ని బెంబెలెత్తించాడు. అయితే ఫెదరర్ కూడా పట్టు వదలకుండా పోరాడాడు. ఇద్దరు కూడా సర్వం ఒడ్డడంతో పోరు టైబ్రేకర్ వరకు వెళ్లింది. అయితే ఇందులో సిలిక్ పైచేయి సాధించాడు. అంతేగాక 7–6తో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. కానీ, మూడో సెట్‌లో మళ్లీ ఒత్తిడికి గురయ్యాడు. ఈసారి ఫెదరర్ మరింత దూకుడుగా ఆడాడు. సిలిక్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ముందుకు సాగాడు. ఫెదరర్ కళ్లు చెదిరే షాట్లతో సిలిక్‌ను ఉక్కిరిబిక్కిరి చేశాడు. మరోవైపు తీవ్ర ఒత్తిడిలో ఆడిన సిలిక్ వరుస తప్పిదాలకు పాల్పడ్డాడు. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంలో ఫెదరర్ సఫలమయ్యాడు. అద్భుత షాట్లతో అలరించిన స్విస్ దిగ్గజం సెట్‌ను దక్కించుకున్నాడు. ఇక, నాలుగో సెట్‌లో ఫెదరర్‌కు కనీస పోటీని కూడా ఇవ్వడంలో సిలిక్ విఫలమయ్యాడు. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన ఫెదరర్ సులువుగా సెట్‌ను సొంతం చేసుకుని తన ఖాతాలో ఆరో ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను జమ చేసుకున్నాడు. మరోవైపు తన కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలని భావించిన సిలిక్ రన్నరప్‌తో సరిపెట్టుకోక తప్పలేదు.

### బోపన్న జోడీకి రన్నరప్...

ఆస్ట్రేలియా ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో లో రోహన్ బోపన్న(భారత్) జంట రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఐదో సీడ్‌గా బరిలోకి దిగిన బోపన్న–తిమియా బాబోస్ (హంగేరి) జంట ఫైనల్లో ఓటమి పాలైంది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో 8వ సీడ్ గాబ్రియెలా డబ్రొస్కి (కెనడా), మాట్ పావిక్ (క్రొయేసియా) చేతిలో బోపన్న జంట పరాజయం చవిచూసింది. నువ్వానేనా అన్నట్టు సాగిన సమరంలో పావిక్ జంట 2–6, 6–4, 11–9తో బోపన్న జోడీని ఓడించింది. తొలి సెట్‌ను సునాయాసంగా గెలుచుకున్న బోపన్న–బాబోస్‌లు తర్వాతి సెట్‌లో కంగుతిన్నారు. నువ్వానేనా అన్నట్టు సాగిన మూడో సెట్‌లో విజయం కోసం చివరి వరకు ప్రతయ్నించినా ఫలితం లేకుండా పోయింది. కీలక సమయంలో ఒత్తిడికి గురి కావడంతో ఓటమి తప్పలేదు.

### సైనాకు రన్నరప్

**జకర్తా:** భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్‌కు ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో చుక్కెదురైంది. ఆదివారం జరిగిన ఫైనల్లో సైనా పరాజయం పాలైంది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ క్రీడాకారిణి తై జు ఇంగ్ (చైనీస్‌తైపి) చేతిలో చిత్తయ్యింది. ఇంగ్ చేతిలో సైనాకు ఇది వరుసగా ఏడో వరుస ఓటమి కావడం గమనార్హం. అసాధారణ ఆటతో ఫైనల్ వరకు దూసుకొచ్చిన సైనా చివరి మెట్టుపై బోల్తా పడింది. ఇంగ్‌తో జరిగిన టైటిల్ సమరంలో కనీస పోటీ కూడా ఇవ్వకుండానే చేతులెత్తేసింది. ఇంగ్ 21–9, 21–13 తేడాతో సైనాను చిత్తు చేసింది.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.